

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

జగన్ హయాంలో రాష్ట్రానికి చెడ్డపేరు

పెట్టుబడులకు అవకాశాల్లేవన్న అపప్రథను తొలగించుకున్నాం: సీఎం 12

ఎస్ఐపీబీ భేటీలో రూ.20,444 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం

వీటితో 56,279 ఉద్యోగాలకు చాన్స్

శుక్రవారం | 5-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 269 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా.12:56 తదుపరి విదియ, నక్షత్రం: రోహిణి ఉ.11:46 తదుపరి మృగశిర, వర్జ్యం: సా.4:40-6:04, దుర్ముహూర్తం: ఉ.8:47-9:31, మ.12:27-1:11, అమృతఘడియలు: ఉ.8:59-10:22, రా.1:05-2:30, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:35, సూర్యాస్తమయం: 5:36

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

25 ఒప్పందాలు!

పుతిన్ పర్యటన సందర్భంగా భారత్-రష్యా మధ్య కుదిరే అవకాశం



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ కరచాలనం

- భారత్‌కు చేరుకున్న పుతిన్.. ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన మోదీ
- ప్రధాని కారులోనే ఆయన అధికారిక నివాసానికి పుతిన్
- మోదీ ప్రైవేటు విందు.. నేడు ఇరువురి మధ్య చర్చలు
- మరో ఐదు రెజిమెంట్ల ఎస్-400లు, రూపే-మిర్ అనుసంధానం, పౌర అణు సహకారం సహా.. పలు కీలక ఒప్పందాలపై సంతకాలు
- ఎస్-500లు, ఎస్‌యూ-57 యుద్ధవిమానాల కొనుగోలుపై చర్చ!
- ఇరు దేశాల మధ్య 2030కి 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం
- భారత్ 'రక్షణ'కు సహకారం.. రాజ్‌నాథ్‌తో భేటీలో రష్యా రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబరు 4: రెండు రోజుల పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. గురువారం సాయంత్రం 6.35 గంటలకు ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్టులో దిగిన పుతిన్‌కు.. ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా సాదర స్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ నృత్యం చేస్తుండగా.. విమానం దిగిన పుతిన్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. సాధారణంగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు తన కారును మాత్రమే వాడే పుతిన్‌ను.. ప్రధాని మోదీ తన టొయోటా ఫార్చ్యూనర్ కారులో తన అధికారిక నివాసానికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'ఎక్స్'లో ఆయన ఒక పోస్టు పెట్టారు. "నా స్నేహితుడు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలికినందుకు ఆనందంగా ఉంది. ఈ రాత్రి, రేపు మా ఇద్దరి మధ్య జరిగే సమావేశాల కోసం నేనెంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారత్-రష్యా స్నేహం కాల పరీక్షకు నిలిచింది, మన ప్రజలకు అపారమైన మేలు చేకూర్చింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఆ తర్వాత పుతిన్‌కు ఆయన ప్రైవేటు విందు ఇచ్చారు. పుతిన్ రాక సందర్భంగా మోదీ అధికారిక నివాసాన్ని విద్యుద్దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుతిన్‌తోపాటు వచ్చిన బృందంలో ఏడుగురు రష్యన్ మంత్రులు, పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలు, రష్యా సెంట్రల్ బ్యాంకు గవర్నర్ ఉన్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11 గంటలకు పుతిన్ రాష్ట్రపతి భవన్‌లో త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 11.30 గంటలకు రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మాగాంధీకి నివాళులు అర్పిస్తారు. 11.50 గంటలకు హైదరాబాద్ హౌస్‌లో మొదలయ్యే ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర

మిగతా 2వ పేజీలో...

ఇంధన బంధం సుస్థిరం

- ఎన్ని ఆంక్షలు ఉన్నా చెక్కుచెదరలేదు
- ఇరు దేశాల ఇంధన వాణిజ్యంపై వ్లాదిమిర్ పుతిన్
- భారత్ ఎదుగుదల కొందరికి కంటగింపుగా మారింది
- ఇండియాకు మోదీ నాయకత్వం అదృష్టమని వ్యాఖ్య

ఎవరి క్రెడిట్.. ఎవరి చోరీ!? 14

గూగుల్ డేటా సెంటర్‌పై జగన్ సిత్రాలు

2026లో సాధారణ సెలవులు 24


ఆదివారం వచ్చిన శివరాత్రి, దుర్గాష్టమి, దీపావళి

21 ఐచ్ఛిక సెలవులు 12

నేడు మెగా పీటీఎం

45 వేల పాఠశాలల్లో నిర్వహణ

పాల్గొననున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ 12





ఇదేంది జగనా?

అడ్డగోలు వాదనలు.. అవాకులు, అబద్ధాలు



- ఎంపిక చేసుకున్న మీడియాతో 2.43 గంటలు ప్రెస్‌మీట్
- అరటి నుంచి కల్తీ నెయ్యి దాకా అన్నింటిపైనా సొంత 'తీర్పులు'
- ప్రశ్నలకు అవకాశమివ్వకుండా.. 'డైవర్షన్' పేరుతో ముగింపు

వాడూ.. వీడూ.. ఎవడు!?

- ఐపీఎస్‌లపై జగన్ అనుచిత వ్యాఖ్యలు
- కోర్టుల ఆదేశాలతో దర్యాప్తు జరుగుతున్నా అక్కసు.. బాబు కుట్ర అంటూ చిందులు
- పరకామణి చోరీ చిన్న విషయమేనట!
- కల్తీ నెయ్యిపై దర్యాప్తు చెయ్యొద్దట
- తమ వాళ్లంతా సచ్ఛీలురంటూ కితాబు

'ష్... చెప్పింది మాత్రమే వినండి! ప్రశ్నలు అడగొద్దు' అంటూ... ఏకంగా 2.43 గంటల ప్రెస్‌మీట్! కోర్టు తీర్పు మేరకు జరుగుతున్న దర్యాప్తులపైనా రాజకీయం! 'మా వాళ్లంతా మంచోళ్లు' అంటూ కితాబులు! అర్ధసత్యాలతో అడ్డగోలు వాదనలు! ఇదీ జగన్ తీరు! 13

ఆ ముగ్గురినీ బొక్కలో పెట్టాలి

- చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై జగన్ ధ్వజం.. ఏ హామీనీ నెరవేర్చకుండా మోసం చేశారు
- రైతుల ముందుకెళ్తే చంద్రబాబును తంతారు.. గోబెల్స్‌కు బాబు మాస్టారు.. జైల్లో పెట్టి తన్నాలి
- అమాయకులైన జోగి, పిన్నెల్లి సోదరులు, వంశీ, చెవిరెడ్డి.. కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిని కేసుల్లో ఇరికించారు: జగన్
- సబ్జెక్ట్ డైవర్ట్ అవుతుందంటూ 3 రాజధానుల అంశం దాటవేత

రైతు సాయంపై చర్చకు సిద్ధమా? అచ్చెన్న సవాల్

స్వతంత్రంగా పంచాయతీలు



చిత్తూరులో డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యేలు గురజాల, మురళీమోహన్ తదితరులు

- కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు.. పంచాయతీ స్థాయిలోనే పరిష్కారం
- డీడీవో కార్యాలయాలతో పౌర సేవలు విస్తృతం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 12
- చిత్తూరు నుంచి వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాల ప్రారంభం





రాజు వెడలె..

దేశాధ్యక్షుడంటే రాజుతో సమానం! కానీ.. అందరి వైభోగం ఒకేలాగా ఉండదు!! చిన్నదేశాల అధ్యక్షుల పర్యటనలైతే.. ఎప్పుడొచ్చారో, ఎప్పుడెళ్లారో.. అనే విషయం కూడా సామాన్య జనానికి పెద్దగా తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతాయ్! కానీ.. అమెరికా, రష్యా, చైనా లాంటి దేశాల అధ్యక్షుల పర్యటనలంటే మామూలుగా ఉండదు. వేరే లెవెల్ అంతే!! ఏంటా లెవెల్ అంటే.. ప్రస్తుతం మనదేశంలో పర్యటిస్తున్న పుతిన్ వైభోగాన్నే చూడండి..

పుతిన్ భద్రతా వలయం.. శత్రుదుర్భేద్యం..

రష్యా అధ్యక్షుడు తమ దేశానికి పర్యటనకు వస్తున్నారంటే.. ఏ దేశమైనా అత్యంత పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది! అయితే, వాటికి అదనంగా రష్యా ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది. పుతిన్ పర్యటనకు చాలా రోజుల ముందే.. ఆ దేశానికి చెందిన 'ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ (ఎఫ్ఎస్‌వో)' రంగంలోకి దిగిపోతుంది. పర్యటన ఆద్యంతం భద్రతా ఏర్పాట్ల ప్రణాళికను అత్యంత కచ్చితత్వంతో రచిస్తుంది. ఐదంచెల భద్రతను ఆయన చుట్టూ ఏర్పరుస్తుంది. దానికితోడు.. రష్యా గూఢచార సంస్థ కేజీబీ ప్రోటోకాల్స్‌తో.. స్నైపర్లు, డ్రోన్ ఆపరేటర్లు, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ నిపుణులు, కమ్యూనికేషన్ యూనిట్స్‌తో కంటికి కనిపించని శత్రుదుర్భేద్యమైన మరో భద్రతావలయాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. ఇక.. పుతిన్ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని.. 'ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్‌బీపీ)' నుంచి ఎంపిక చేస్తారు. వీరంతా సుశిక్షితులైన కమాండోలు. ఎస్‌బీపీకి ఎంపిక కావాలంటే.. 35 ఏళ్లలోపు వారై ఉండాలి. 180 సెంటీమీటర్ల కన్నా ఎత్తు ఉండాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. ఏ క్షణంలోనైనా పోరాటానికి సన్నద్ధంగా ఉండాలి. విదేశీ భాషలు వచ్చి ఉండాలి. ఈ ఎస్‌బీపీలోకి తీసుకునేవారి నేపథ్యాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తారు. అధ్యక్షుడి పట్ల నిజాయితీగా వ్యవహరిస్తారని పూర్తిస్థాయిలో నిర్ధారించుకున్నాకే వారిని విధుల్లోకి తీసుకుంటారు.

పుతిన్ విమానం.. ఎగిరే క్రెమ్లిన్

మాస్కోలోని రష్యా అధ్యక్షుడి కార్యాలయాన్ని 'క్రెమ్లిన్' అంటారు! మరి పుతిన్ విదేశాలకు వెళ్లినప్పుడు? ఆయన ప్రయాణించే విమానమే అధ్యక్ష భవనం అవుతుంది. అందుకే దాన్ని 'ఫ్లైయింగ్ (ఎగిరే) క్రెమ్లిన్'గా వ్యవహరిస్తారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానానికి దీటుగా ఉండేలా ఈ ఇల్యూషిన్ ఐఎల్ 96-300 పీయూ విమానాన్ని రూపొందించారు. శత్రుదేశాల రాడార్లు, క్షిపణి వ్యవస్థలకు దొరకకుండా దీంట్లో జామింగ్ వ్యవస్థలు ఉంటాయి. ఒక స్థాయి వరకు క్షిపణి దాడులను తట్టుకునేలా కవచం ఉంటుంది. నేరుగా శాటిలైట్ల అనుసంధానంతో కమ్యూనికేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. లోపలిభాగంలో విలాసవంతమైన ఏర్పాట్లు ఉంటాయి. అధ్యక్షుడికి ప్రైవేటు బెడ్‌రూమ్, ఆఫీసు గది, రెండు కాన్ఫరెన్స్ గదులు, అతిథుల కోసం ఒక గది, మినీ జిమ్, కిచెన్, భోజనాల గది, చిన్న బార్, బాత్రూమ్‌లు ఉంటాయి. అంతేకాదు బయటి నుంచి చూస్తే అచ్చం ఈ విమానాన్ని పోలినట్టే మరో విమానం కూడా ఉంటుంది. పుతిన్ ఎక్కడికైనా వెళ్లినప్పుడు రెండు వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ విమానాలు వేర్వేరు మార్గాల్లో ప్రయాణం ప్రారంభిస్తాయి. అధ్యక్షుడు ఎందులో ఉన్నారో శత్రువులకు చిక్కకుండా ఉండాలన్నదే దీని ఉద్దేశం.

పూప్‌కేస్

మనం ఏదైనా ఊరెళ్లేటప్పుడు సూట్‌కేస్ తీసుకెళ్తాం. పుతిన్ మాత్రం.. పూప్‌కేస్ కూడా తన వెంట తీసుకెళ్తారు! పూప్ అంటే తెలుసు కదా.. మలం. రష్యా అధ్యక్షుడు విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి మరుగుదొడ్లలో కాలకృత్యాలు తీర్చుకుంటే.. ఆయన మలాన్ని సేకరించి, పరీక్షలు చేసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి విదేశీ గూఢచార సంస్థలు తెలుసుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే భద్రతా సిబ్బంది ప్రత్యేక టాయిలెట్లను ఏర్పాటుచేసి, ఆయన మలాన్ని కూడా సేకరించి తమతోపాటు రష్యాకు తీసుకెళ్తారు. అందుకోసం వారు వాడేదే పూప్‌కేస్. ఇప్పుడే కాదు.. పుతిన్ అధికార పగ్గాలు చేపట్టిన 1999 నుంచీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయన మలాన్ని ఇలాగే ప్రత్యేక కవర్లలో సేకరించి, పూప్‌కేస్‌లో పెట్టి రష్యాకు తరలిస్తున్నారు!

వెంట ఫుడ్ ల్యాబ్.. టేస్టర్లు..

పుతిన్ ఎక్కడికి వెళ్లినా ఆయన తినే ఆహారాన్ని పరిశీలించేందుకు చిన్నపాటి ఫుడ్ ల్యాబ్ కూడా వెంట ఉంటుంది. వ్యక్తిగత షెఫ్ కూడా ఉంటారు. స్థానికంగా ఉండే వస్తువులేవీ ఉపయోగించరు. రష్యా నుంచి తెచ్చిన సరుకులతోనే వంట చేస్తారు. 'ఫుడ్ టేస్టర్'గా పిలిచే బాడీగార్డు ఆహారాన్ని తిని చూశాకే.. పుతిన్ భోజనం చేస్తారు. విష ప్రయోగం, కలుషితం కావడం వంటి జరగకుండా ఉండేందుకే ఈ ఏర్పాటు. ఇక ట్వోరోగ్‌గా పిలిచే కాటేజ్ చీజ్, కౌజుపిట్ట గుడ్లు, పిస్తా ఐస్‌క్రీమ్‌లను పుతిన్ ఇష్టంగా తింటారు. పండ్ల రసాలు తాగుతారు. సాల్మన్ చేపలు, పొట్టేలు మాంసం, కూరగాయలతో చేసిన సలాడ్ కూడా తీసుకుంటారు.

మా ఇంధన బంధం సుస్థిరం: పుతిన్

న్యూఢిల్లీ, డిసెంబరు 4: అమెరికా ఆంక్షలు, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కఠిన చర్యల వల్ల అంతర్జాయంగా పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా.. భారత్, రష్యా మధ్య ఇంధన సంబంధాలు చెక్కుచెదరలేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. ఈ విశ్వాసం ఇలాగే బలంగా సుదీర్ఘ కాలం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన.. ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ ఇండియా టుడేకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, రష్యా సంబంధాలు, అంతర్జాతీయ రాజకీయ, వాణిజ్య పరిణామాలపై తన అభిప్రాయాలను సూటిగా వెల్లడించారు. రష్యానుంచి భారత్ చమురు కొనుగోళ్లను ప్రభావితం చేయాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా రాజకీయ దురుద్దేశాలతో కూడుకున్నవని, వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. చాలాకాలం క్రితమే రష్యా చమురు కంపెనీ రోస్‌నెఫ్ట్ భారత్‌లోని నయారా ఎనర్జీలో వాటాలు కొనుగోలు చేసిందని, ఆ పెట్టుబడి రెండుదేశాల మధ్య విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో భారత ప్రాబల్యం రోజురోజుకూ పెరుగుతుండటం కొందరికి కంటగింపుగా మారిందని పుతిన్ విమర్శించారు. అందుకే వారు రాజకీయ కారణాలతో కృత్రిమ అవాంతరాలను సృష్టించి భారత ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన ఆంక్షలు, పశ్చిమదేశాల ఆందోళనలన్నీ అంతర్జాతీయ వాణిజ్యంలో భారదేశ బలం పెరుగుదలను సూచిస్తున్నాయి. ఈ రంగంలో భారతదేశ ప్రాబల్యం పెరగటం వారికి అసౌకర్యంగా ఉంది' అని అన్నారు. అంతర్జాతీయంగా ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా.. మోదీతో తనకు ఉన్న సాన్నిహిత్యం భారత్-రష్యా మధ్య సంబంధాలు స్థిరంగా కొనసాగేందుకు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. దేశమే శ్వాసగా, ప్రాణంగా భావిస్తున్న ప్రధానిగా నరేంద్రమోదీ ఉండటం భారతదేశ అదృష్టమని పుతిన్ అన్నారు. .

'సోషల్ మీడియా' వివరాలు వెల్లడించాల్సిందే

- హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుదారులకు అమెరికా ఆదేశం

న్యూయార్క్, డిసెంబరు 4: హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుల స్క్రీనింగ్, వెట్టింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. దరఖాస్తుదారులకు సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైళ్ల ప్రైవసీ సెటింగ్‌లను పబ్లిక్ చేయాలని ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. డిసెంబరు 15నుంచి హెచ్-1బీ దరఖాస్తుదారులతో పాటు వారిపై ఆధారపడిన వారి ఆన్‌లైన్ యాక్టివిటీని క్షుణ్నంగా సమీక్షిస్తామని పేర్కొంటూ అమెరికా విదేశాంగశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ కన్నుమూత

న్యూఢిల్లీ, డిసెంబరు 4: మిజోరం మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్(73) కన్నుమూశారు. ఛాతిలో నొప్పితో ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారని ఆయన కుమార్తె, బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ తెలిపారు. దివంగత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ భర్త అయిన స్వరాజ్ కౌశల్ 1990లో 37 ఏళ్ల వయసులో మిజోరం గవర్నర్‌గా పనిచేశారు.

ఏడాదిలోగా ఎలక్ట్రానిక్ టోల్ వసూలు: గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఏడాదిలోగా ప్రస్తుతం అమల్లో ఉన్న టోల్ వసూలు విధానం స్థానంలో కొత్త ఎలక్ట్రానిక్ విధానం అమల్లోకి వస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పేర్కొన్నారు. దీని ద్వారా వాహనదారులు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

25 ఒప్పందాలు!

(మొదటిపేజీ తరువాయి)



సమావేశంలో పుతిన్-మోదీ పాల్గొననున్నారు. రెండు గంటలపాటు సాగే ఈ సమావేశంలో.. ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలను బలోపేతం చేయడం, బయటి ఒత్తిళ్ల నుంచి ఇరుదేశాల వాణిజ్యాన్ని కాపాడడం, పౌర అణు ఇంధన సహకారం, ఎరువుల రంగంలో సహకారం పెంపు, యురేషియన్ ఎకనమిక్ యూనియన్‌తో భారత్ ప్రతిపాదించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలు కీలకంగా చర్చకురానున్నాయి. రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున ముడిచమురును కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో భారీగా పెరిగిపోతున్న వాణిజ్య లోటు గురించి భారత్ ఈ భేటీలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది (ప్రస్తుతం మనదేశం రష్యా నుంచి ఏటా 65 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.5.8 లక్షల కోట్ల) విలువైన దిగుమతులు చేసుకుంటుండగా.. రష్యాకు మన ఎగుమతులు కేవలం 5 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.45 వేల కోట్లు) ఉన్నాయి). 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఈచర్చ జరగనుంది. అలాగే.. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లపై అమెరికా విధిస్తున్న ఆంక్షల ప్రభావంపైనా ఈ భేటీలో చర్చించనున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాల గురించి పుతిన్ మోదీకి వివరించనున్నట్టు సమాచారం.

కీలక అంకం.. ఒప్పందాలు

భేటీ అనంతరం.. రష్యా నుంచి కొత్తగా మరో ఐదు రెజిమెంట్ల ఎస్-400ల కొనుగోలు, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వినియోగించిన క్షిపణుల స్థానంలో కొత్త మిస్సైళ్ల కొనుగోలు, రష్యాలో ప్రస్తుతం నిపుణుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో భారతీయ కార్మికులు, పలు రంగాల నిపుణులు రష్యాకు వెళ్లడాన్ని సులభతరం చేసే, వారి హక్కులకు రక్షణ కల్పించే మొబిలిటీ ఒప్పందం, ఇరుదేశాల మధ్య రక్షణ సహకారం, ఇరు దేశాల చెల్లింపు వ్యవస్థలైన 'రూపే-మిర్' అనుసంధానం సహా... 25 (10 ప్రభుత్వ, 15 వాణిజ్య) కీలక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందాల ఫలితంగా ఫార్మా, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు తదితర రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అలాగే.. రష్యా నుంచి అత్యంత అధునాతన ఎస్-500ల కొనుగోలు, ఐదో తరం యుద్ధవిమానాలైన ఎస్‌యు-57ల కొనుగోలు, ఉమ్మడి ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, అంతరిక్ష రంగం, అణు ఇంధనం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పోర్టుల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి కూడా శుక్రవారంనాటి భేటీలో చర్చ జరిగే అవకాశం ఉంది. శిఖరాగ్ర సమావేశం ముగిశాక మధ్యాహ్నం 1.50 గంటలకు పుతిన్-మోదీ సంయుక్త ప్రకటన విడుదల చేస్తారు. అనంతరం.. రష్యా ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన భారత చానల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. సాయంత్రం ఏడు గంటలకు రాష్ట్రపతి భవన్‌కు బయలుదేరి వెళ్లి.. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము ఇచ్చే విందుకు హాజరై రాత్రి 9 గంటలకు మాస్కోకు తిరుగుప్రయాణం అవుతారు. కాగా.. గురువారం సాయంత్రం రష్యా, భారత్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. రష్యా నుంచి అదనంగా ఎస్-400 మిసైల్ సిస్టమ్స్, కీలక మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుపై ప్రధానంగా వారు చర్చించినట్టు సమాచారం. భారత సైనిక దళాల ఆధునికీకరణకు, రక్షణ ఉత్పత్తుల రంగంలో స్వావలంబనకు సహకరిస్తామని రష్యా రక్షణ మంత్రి అంద్రేయ్ బెలొసోవ్ ఈ భేటీలో హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంపొందించుకునే దిశగా కొత్త అవకాశాలను అన్వేషిద్దామని రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. రష్యా నుంచి చమురు కొనుగోలుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన వేళ.. ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం ఒక కొలిక్కి వస్తున్న దశలో జరుగుతున్న పుతిన్-మోదీ భేటీని పాశ్చాత్య దేశాలు కూడా నిశితంగా పరిశీలిస్తున్నాయి.

11 ఏళ్లలో ఆరుగురికి ఆహ్వానం

ప్రొటోకాల్‌కు భిన్నంగా గురువారం సాయంత్రం ప్రధాని మోదీ ఎయిర్‌పోర్టుకు వెళ్లి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆహ్వానించడాన్ని అంతా ఆసక్తిగా చూశారు. అయితే, మోదీ ఇలా వేరే దేశాల అధినేతలను ఆహ్వానించడానికి విమానాశ్రయానికి వెళ్లడం ఇదే మొదటిసారి కాదు. గడిచిన 11 ఏళ్లలో ఆయన 6 సందర్భాల్లో ఇలా వెళ్లారు. 2015లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను, 2017లో బంగ్లాదేశ్ పీఎం షేక్ హసీనాను, జపాన్ ప్రధాని షింజో అబెను, 2020లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను, 2024 జనవరిలో యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను, 2025 ఫిబ్రవరిలో ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీని స్వయంగా ఆహ్వానించారు.

అప్పుడాయన.. ఇప్పుడీయన..

కిందటి సంవత్సరం మన ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లినప్పుడు.. మాస్కోలో ఆయనకు పుతిన్ ప్రైవేట్ డిన్నర్ ఇచ్చారు! దానికి ప్రతిగా మోదీ.. గురువారం రాత్రి పుతిన్‌కు ప్రైవేటు డిన్నర్ ఇచ్చి తమ స్నేహబంధాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నారు! ఇక.. మూణ్నెల్ల క్రితం చైనాలోని టియాన్జిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సమయంలో.. మోదీని పుతిన్ తన కారులో ఎక్కించుకుని దాదాపు 45 నిమిషాలపాటు అందులోనే చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఇదే కోవలో.. గురువారం రాత్రి ప్రధాని మోదీ పుతిన్‌ను తన టొయోటో ఫార్చ్యూనర్ కారులో ఎక్కించుకుని తన అధికారిక నివాసానికి తీసుకెళ్లడంతో.. సామాజిక మాధ్యమాల్లో పలువురు 'కార్‌పూలింగ్ 2.0' జరిగిందంటూ రెండు ఫొటోలూ పెట్టారు.

కారు కాదది.. రోడ్డుపై కదిలే పడవ!



పుతిన్ ఏ దేశానికి వెళ్లినా.. ఆయన బుల్లెట్ ప్రూఫ్ 'ఆరస్ సెనాట్' లైమోజిన్ కారును విమానంలో అక్కడికి తరలిస్తారు. అక్కడ కూడా ఆయన ఆ కారులోనే పర్యటిస్తారు. పుతిన్ కారుపై గ్రెనేడ్‌లు పడ్డా చెక్కు చెదరదు. అద్దాలన్నీ పూర్తిగా బుల్లెట్ ప్రూఫ్. ఇంధన ట్యాంకుకు కూడా ప్రత్యేకమైన రక్షణ ఉంటుంది. టైర్లు పంక్చర్ కావు. నాలుగు టైర్లూ పంక్చరైనా కారు ఆగకుండా దూసుకుపోతుంది. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లోనూ, ఎలాంటి నేలపై అయినా దూసుకుపోయేలా 4 వీల్ డ్రైవ్, హైడ్రాలిక్ సస్పెన్షన్ వ్యవస్థ ఉంటుంది. అత్యంత శక్తివంతమైన వీ8 ట్విన్ టర్బో ఇంజన్‌తో కూడిన ఈ వాహనం.. అంత బరువుతోనూ కేవలం 6 సెకనల్లో 100 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. కారు లోపల అత్యంత అధునాతన, భద్రతాపరమైన ఫీచర్లతో సీట్లు, లైటింగ్, ఇతర ఏర్పాట్లు ఉంటాయి.

లోకం తీరు



రష్యాలో భారత సంతతి ఎమ్మెల్యే..

- ఎస్-500 వ్యవస్థ కొనుగోలుకు భారత్ ప్రయత్నించాలన్న అభయ్‌సింగ్



న్యూఢిల్లీ, డిసెంబరు 4: రష్యా నుంచి అత్యాధునికమైన క్షిపణి రక్షణ వ్యవస్థ ఎస్-500ను కొనుగోలు చేయడానికి భారత్ ప్రయత్నించాలని రష్యాలోని భారత సంతతి ఎమ్మెల్యే అభయ్‌సింగ్ సూచించారు. ఎస్-500 వ్యవస్థను రష్యా ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదని, దాన్ని పొందితే భారత్‌కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌యూ-57 యుద్ధ విమానాలు కూడా అద్భుతమని చెప్పారు. రష్యాలో నిపుణుల కొరత ఉందని, భారతీయులకు అక్కడ మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుతిన్ భారత పర్యటన నేపథ్యంలో రష్యాలో భారత సంతతి ఎమ్మెల్యే ఈ ప్రకటన చేయడంతో ఆయన ఎవరనే దానిపై అంతటా ఆసక్తి నెలకొంది. బిహార్‌లోని పట్నాకు చెందిన అభయ్‌సింగ్ 1991లో అప్పటి సోవియట్ యూనియన్‌కు వెళ్లి.. అక్కడే స్థిరపడ్డారు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీ తరఫున 2017లో తొలిసారిగా ఉక్రెయిన్ సరిహద్దుల్లోని కర్స్క్ ప్రాంత శాసనసభ్యుడిగా గెలిచారు. 2022లో మరోసారి విజయం సాధించారు. సోవియట్ యూనియన్ పతనం సమయంలోనే తాను పుతిన్‌ను చూశానని, ఆయనను ఆదర్శంగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానని అభయ్‌సింగ్ చెప్పారు. భారత్‌లో జరిగే ఎన్నికల తరహాలోనే తాను ప్రచారం చేశానని, ప్రతిఒక్కరినీ కలిసి మద్దతు కూడగట్టుకుని, గెలిచానని పేర్కొన్నారు.

భారత్ 'రక్షణ'కు పూర్తి సహకారం

రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబనకు తోడ్పడుతాం.. సైనిక దళాల ఆధునికీకరణకు సాయం చేస్తాం

- రష్యా రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్ హామీ
- దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి, ఎగుమతులపై దృఢ సంకల్పంతో ఉన్నాం: రాజ్‌నాథ్
- వార్షిక సదస్సుకు ముందస్తుగా రక్షణ మంత్రుల భేటీ


రష్యా రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్‌తో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, డిసెంబరు 4: భారత్ రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించేందుకు రష్యా రక్షణ పరిశ్రమ తోడ్పడుతుందని ఆ దేశ రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్ హామీ ఇచ్చారు. భారత సైనిక దళాల ఆధునీకరణకు రష్యా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని చెప్పారు. భారత్, రష్యా వార్షిక సదస్సుకు ముందు సన్నాహకంగా.. ఇరుదేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, ఆంద్రే బెలొసోవ్ గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. శుక్రవారం జరిగే సదస్సులో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయి తీసుకునే కీలక నిర్ణయాలు, జరగనున్న ఒప్పందాలపై చర్చించారు. 'భారత్-రష్యా అంతర ప్రభుత్వ కమిషన్ ఆన్ మిలటరీ, మిలటరీ సాంకేతిక సమావేశం'లో భాగంగా ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా భారత రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని పెంచుకోవడం తోపాటు దేశీయ ఉత్పత్తి, ఎగుమతులపై దృఢ సంకల్పంతో ముందుకు సాగుతామని రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు. అధునాతన సాంకతికతల్లో భారత్, రష్యా మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునేందుకు కొత్త అవకాశాలను అన్వేషిద్దామని ప్రతిపాదించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు గాఢమైన నమ్మకం, పరస్పర గౌరవంతో కూడుకున్నాయని.. ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని రక్షణ మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయానికి వచ్చారు. భారత్ రక్షణ ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు రష్యా రక్షణ పరిశ్రమ తోడ్పడుతుందని ఆంద్రే బెలొసోవ్ హామీ ఇచ్చారు. భారత సైనిక దళాల ఆధునికీకరణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అస్థిరతలు నెలకొన్న సమయంలోనూ భారత్, రష్యా రక్షణ సహకారం బలంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్, రష్యా మధ్య దృఢమైన స్నేహం కాలపరీక్షను తట్టుకుని నిలిచిందని.. దక్షిణాసియా ప్రాంతంలో సమతుల్యతకు ఇది మార్గం వేసిందన్నారు. భేటీ అనంతరం రక్షణ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. ఈ సమావేశానికి ముందు రాజ్‌నాథ్, బెలొసోవ్ నేషనల్ వార్ మెమొరియల్ వద్ద నివాళి అర్పించారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌లో అద్భుత పనితీరు చూపిన రష్యా ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థలు మరిన్నింటిని కొనేందుకు భారత్ ఆసక్తి చూపినట్టు సమాచారం.

విదేశాల అధినేతలను కలవకుండా చేస్తున్నారు

- ప్రతిపక్ష నేతతో సమావేశం కావొద్దని ప్రభుత్వం వారికి చెబుతోంది : రాహుల్ గాంధీ
- రాహుల్ ఆరోపణలు పచ్చి అబద్ధం: బీజేపీ



న్యూఢిల్లీ, డిసెంబరు 4: విదేశాల ప్రధానులు, అధ్యక్షులు వంటివారు భారత్‌కు వచ్చినప్పుడు.. వారు ప్రతిపక్ష నేతను కలవకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇది ఎన్డీయే ప్రభుత్వ అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన నేపథ్యంలో రాహుల్ గురువారం పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "విదేశాల అధినేతలు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతను కూడా కలవడం మన సాంప్రదాయం. వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ ప్రధానులుగా ఉన్న సమయంలో అది కొనసాగింది. ప్రధాని మోదీగానీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌గానీ ఆ సాంప్రదాయాన్ని పాటించడం లేదు. ఇప్పుడు విదేశాల నేతలు ఇక్కడికి వచ్చినా, నేను విదేశాలకు వెళ్లినా.. ప్రతిపక్ష నేతను కలవవద్దని వారికి ప్రభుత్వం సూచిస్తోంది. నన్ను కలవవద్దని ప్రభుత్వం చెప్పిందంటూ విదేశాల నేతల నుంచి నాకు సమాచారం వస్తోంది" అని వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌కు వచ్చే విదేశాల అధినేతలు ఇక్కడి ప్రతిపక్ష నేతను కలవడం ప్రొటోకాల్‌లో భాగమని, కానీ మోదీ ప్రభుత్వం దీనిని ఉల్లంఘిస్తోందని ప్రియాంకగాంధీ విమర్శించారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. "రాహుల్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధం. గత ఏడాదిన్నర కాలంలో మలేషియా, న్యూజిలాండ్, మారిషస్, వియత్నాం ప్రధానులు సహా పలువురు విదేశాల నేతలను రాహుల్ కలిశారు" అని బీజేపీ అధికార ప్రతినిధి అనిల్ బలుని అన్నారు.

బీఎల్‌వోలపై 'సర్' ఒత్తిడిని తగ్గించే బాధ్యత రాష్ట్రాలదే!

- ఈసీకి అదనపు సిబ్బందిని సమకూర్చాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్-సర్)ను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాల్సి రావడంతో తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లకు రాష్ట్రప్రభుత్వాలే ఉపశమనం కలిగించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)కి అదనపు సిబ్బందిని సమకూర్చడం ద్వారా బీఎల్‌వోలపై ఒత్తిడి తగ్గించాలని ఆదేశించింది. తమిళ సినీహీరో విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ దాఖలుచేసిన దరఖాస్తుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. బీఎల్‌వోల్లో అత్యధికులు టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలైనందున వారి రెగ్యులర్ పనులకు తోడు 'సర్' సంబంధ విధులు కూడా నిర్వర్తించాల్సి వస్తున్నందున.. సమయం చాలక తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆ పార్టీ తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టు దృష్టికి తెచ్చారు. విధి నిర్వహణలో విఫలమైన బీఎల్‌వోలపై ఈసీ ఎఫ్ఐఆర్‌లు నమోదుచేస్తోందని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ పై ఆదేశాలిచ్చింది. ఈసీకి అదనపు సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపడం ద్వారా రాష్ట్రాలు బీఎల్‌వోలపై ఒత్తిడి తగ్గించాలని పేర్కొంది. కాగా, 51 కోట్ల మంది ఓటర్లతో కూడిన జాబితాల ప్రక్షాళన ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది.

ఆకాశాన్నంటిన విమాన టికెట్ ధరలు!

- ఇండిగో సంక్షోభంతో రేట్లు పైపైకి..

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశంలోనే అతిపెద్ద పౌర విమానయాన సంస్థ ఇండిగోలో సంక్షోభం కొనసాగుతోంది. గురువారం ఏకంగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. రోజూ దాదాపు నాలుగు లక్షల మంది ప్రయాణికులు ఇండిగో విమానాల్లో ప్రయాణిస్తుంటారు. ఇండిగోలో నెలకొన్న అంతర్గత సమస్యల వల్ల రెండు మూడు రోజులుగా భారీ సంఖ్యలో విమానాలు రద్దవుతున్నాయి. పలు విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ ప్రభావం టికెట్ ధరలపై పడింది. ఎంతలా అంటే.. ఢిల్లీ నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లడం కంటే ముంబై వెళ్లడానికే ఎక్కువ ఖర్చు పెట్టాల్సినంతగా ధరలు పెరిగిపోయాయి! ఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు శుక్రవారం విమాన టికెట్ కనిష్ఠ ధర రూ.36,668. అదే సమయంలో ఢిల్లీ నుంచి ముంబైకి టికెట్ ధర రూ.40,452. ఇండిగో సంస్థ భారీగా విమాన సర్వీసులు రద్దు చేయడంతో దేశంలో విమాన టికెట్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పోటీ విమానయాన సంస్థలు ప్రస్తుత పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నాయి. టికెట్ ధరలు అమాంతం పెరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాగా, ఇండిగో విమానాల రాకపోకల్లో అంతరాయాలపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థకు సూచించారు.


పొగాకుపై అధిక సెంట్రల్ ఎక్సైజ్ సుంకం... బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 4: పొగాకుపై అధిక సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని విధించేందుకు అవకాశం కల్పించే బిల్లును గురువారం పార్లమెంటు ఆమోదించింది. ప్రస్తుతం పొగాకుపై విధించిన జీఎస్టీ పరిహార సెస్సు వసూళ్లను నిలిపివేసిన అనంతరం ఎక్సైజ్ సుంకం అమల్లోకి రానుంది. ఈ బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదించింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులను 'డీ మెరిట్' కేటగిరీగా పరిగణించి 40% జీఎస్టీ పరిధిలో ఉంచినట్టు చెప్పారు. ప్రస్తుతం 28% జీఎస్టీతో పాటు పరిహార సెస్సును వసూలు చేస్తున్నట్టు తెలిపారు. సిగరెట్లు, సిగార్లు, హుక్కా, జర్దా, సెంటెడ్ టుబాకో వంటి ఉత్పత్తులకు ఇది వర్తిస్తోందని వివరించారు.

యాసిడ్ దాడుల కేసులపై నిర్లక్ష్యం వ్యవస్థకే సిగ్గుచేటు

- సుప్రీంకోర్టు సీరియస్

న్యూఢిల్లీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాసిడ్ దాడి కేసుల విచారణలో జాప్యంపై గురువారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 16ఏళ్లుగా బాధితురాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడంపై తీవ్రంగా స్పందించింది. ఇది దేశానికే సిగ్గుచేటని, ముమ్మాటికీ వ్యవస్థను అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడుల కేసులపై నివేదిక ఇవ్వాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. ఢిల్లీలోని రోహిణి ప్రాంతం కోర్టులో పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసును దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీకి చెందిన షహీన్ మాలిక్ అనే మహిళపై 2009లో యాసిడ్ దాడి జరిగింది. దీనిపై రోహిణీ కోర్టులో కేసు నమోదు కాగా, 2013 వరకు ఎలాంటి విచారణ జరగలేదు. 16ఏళ్ల తరువాత ప్రస్తుతం తుది దశ విచారణ జరుగుతోంది. తన కేసుపై పోరాటం చేస్తుండడంతో పాటు, యాసిడ్ దాడి బాధితులను దివ్యాంగులుగా గుర్తించి, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ ఆమె పిల్ కూడా దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం దేశ రాజధానిలోనే ఇంతటి నిర్లక్ష్యం చోటుచేసుకోవడంపై అసహనం వ్యక్తం చేసింది. పెండింగ్ కేసుల వివరాలను జనవరి 27లోపు ఇవ్వాలని ఏపీ, తెలంగాణ సహా దేశంలోని అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లకు నోటీసులు జారీ చేసింది.





వెండి మండపం రశీదులు అందిస్తున్న ఆర్‌వీఆర్ చౌదరి, పక్కన మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కొనకళ్ల నారాయణరావు

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి మండపం బహుకరణ

» రూ.కోటితో ప్రత్యేకంగా చేయించిన ఆర్.వి.ఆర్.గ్రూప్ చైర్మన్

మోపిదేవి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ఆర్.వి.ఆర్ (గ్రూప్) చైర్మన్ ఆర్.వి.ఆర్.చౌదరి, సౌభాగ్యలక్ష్మి దంపతులు రూ.కోటితో ప్రత్యేకంగా తయారు చేసిన వెండి మండపాన్ని బహుకరించారు. గురువారం ఉదయం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కుటుంబసభ్యులతో కలసి వారు పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలసి ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్‌కు వెండి మండపం తాలూకా రశీదులను దాత అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా వస్తుంటారన్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి వెండి మండపం బహూకరించే అదృష్టం ఆర్‌వీఆర్ చౌదరికి కలగటం ఎంతో గర్వించదగ్గ విషమని తెలిపారు.



బలిపీఠంపై దీపాన్ని వెలిగిస్తున్న టీటీడీ ఈవో సింఘాల్

కన్నులపండువగా కార్తీక దీపోత్సవం

తిరుమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. ముందు యోగనరసింహస్వామి ఆలయం పక్కనే ఉన్న పరిమళం అర వద్ద కొత్త మూకుళ్లలో దీపాలను వెలిగించారు. వీటిని ఛత్రచామరం, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. ఆ తర్వాత ఆలయంలోపల, బయట సుమారు వెయ్యి నేతి జ్యోతులను వెలిగించారు. ఈ సందర్భంగా పౌర్ణమి గరుడసేవ, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ దీపోత్సవంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి విరాళంగా ప్రకటించిన ఇల్లు, స్థలం విరాళం అంగీకార పత్రాలను ఈవో సౌజన్యకు అందజేస్తున్న రాజేశ్వర్

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భారీ విరాళం

రూ.2 కోట్ల విలువైన స్థలం, ఇల్లు అందజేత

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దత్త జయంతి పర్వదినాన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భారీ విరాళం అందింది. బెంగళూరుకు చెందిన చక్కా వెంకట రాజేశ్వర్ పిఠాపురం మహారాజా కోట ప్రాంతంలో 940 చదరపు గజాల విస్తీర్ణంలో భవంతి నిర్మించారు. రూ.2 కోట్లు విలువ చేసే ఈ ఆస్తిని శ్రీపాదశ్రీవల్లభులు వారికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన అంగీకార పత్రాలను దత్త జయంతి రోజైన గురువారం మహా సంస్థానం ప్రాంగణంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్యకు అందజేశారు. దాతను ఈవో ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేయగా వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీపాదశ్రీవల్లభులు అంటే తనకు నమ్మకమని, అందుకే విలువైన ఆస్తిని స్వామికి సమర్పించానని దాత చెప్పారు.

శ్రీవారి సేవలో సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ శ్రీనివాస్

తిరుమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమ ం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నంబరుకు ఫోను చేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

తెలుగు చదువుకుంటేనే ఉద్యోగాలివ్వాలి

» తెలుగు ముఖ్యమంత్రులిద్దరికీ ఇదే చెప్పా

» కృష్ణాతరంగ్ 2025 ప్రారంభోత్సవంలో వెంకయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాతృభాష, మాతృమూర్తి, మాతృదేశంపై ప్రతి ఒక్కరికీ అభిమానం ఉండాలని, మాతృభాష అయిన తెలుగును గౌరవించుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు చదువుకున్నవారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలకు చెప్పానని తెలిపారు. కృష్ణా జిల్లా బందరులోని కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం కృష్ణాతరంగ్-2025 ప్రారంభోత్సవ సభలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తెలుగు భాషతో తెలుగు సంస్కృతి, తెలుగువారి ఆచార వ్యవహారాలు, చారిత్రక అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని, ఇంకా దేశంలో బ్రిటీషు ఆన వాళ్లు కనబడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు మచిలీపట్నంలో యువకెరటాలు కార్యక్రమం చేపట్టామని, ఈ కార్యక్రమాల్లో 40 వేల మంది పాల్గొంటున్నారని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణా వర్సిటీ ఏర్పాటులో తన పాత్ర ఉండటం గర్వించదగినదన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కృష్ణా ఉపకులపతి కూన రాంజీ తదితరులు మాట్లాడారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్య బృందంతో ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

స్పృహలో ఉండగానే బైపాస్ సర్జరీ

» ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా 76 ఏళ్ల మయాస్థీనియా గ్రేవిస్ రోగికి పూర్తి స్పృహలో ఉన్న స్థితిలో బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించి తమ వైద్య బృందం వైద్య రంగంలో అరుదైన ఘనత సాధించిందని ఆస్టర్ రమేష్ ఎండీ డాక్టర్ పి.రమేష్‌బాబు తెలిపారు. విజయవాడ ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగి గుండెకు రక్తం సరఫరా చేసే మూడు ప్రధాన ధమనుల్లో పూడికలు ఉండడమే కాకుండా, శ్వాస కోశ కండరాలను బలహీనపరిచే మయాస్థీనియా గ్రేవిస్ వ్యాధి కూడా ఉందని చెప్పారు. ఇటువంటి రోగులకు జనరల్ అనస్థీషియా ఇవ్వడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండడంతో వైద్యబృందం అవేక్ బైపాస్ టెక్నిక్‌ను ఎంచుకుందని, ఈ పద్ధతిలో రోగి శస్త్రచికిత్స జరుగుతున్నంతసేపు స్పృహతో ఉండి, శ్వాస తీసుకున్నారని ఆయన తెలిపారు. థొరాసిక్ ఎపిడ్యూరల్ అనస్థీషియా ద్వారా ఛాతీ భాగానికి మాత్రమే మత్తు ఇచ్చామని, వెంటిలేటర్ అవసరం లేకుండానే శస్త్రచికిత్స ముగిసిందని పేర్కొన్నారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను కార్డియోథొరాసిక్, వాస్క్యులర్ సర్జన్స్ బృందం డాక్టర్లు జయరామ్ పాయ్, శివప్రసాద్, అశోక్ కుమార్, భరత్ సిద్ధార్థ్, శ్రీకాంత్ మహాపాత్ర, అనస్థీషియా బృందం లోగనాథన్ చక్రవర్తి, పవన్, హిమబిందు విజయవంతంగా పూర్తిచేశారన్నారు. హాస్పిటల్‌లో అంతర్జాతీయ స్థాయి వైద్య ప్రమాణాలతో సర్జరీలు జరుగుతున్నాయని తెలిపారు. హాస్పిటల్ సాధించిన విజయాలు లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదయ్యాయన్నారు. గత 37 ఏళ్లగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు 25వేలకు పైగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతం చేశామని, వాటిలో అత్యంత క్లిష్టమైన 2,500కు పైగా బైపాస్ సర్జరీలు, వాల్వ్ మార్పిడి సర్జరీలు, 3,500లకు పైగా నవజాత శిశువులు, పిల్లల గుండె శస్త్రచికిత్సలు చేశామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద పదివేల సర్జరీలు నిర్వహించామన్నారు.

విజయవాడలో వారాహి సిల్క్స్ షోరూం

» ప్రారంభించిన సినీ హీరో తేజ సజ్జా, హీరోయిన్ మీనాక్షి చౌదరి



వారాహి సిల్క్స్ షోరూంను ప్రారంభిస్తున్న తేజ సజ్జా, మీనాక్షి చౌదరి

విజయవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద వస్త్ర నందనం వారాహి సిల్క్స్ ఐదో షోరూంను విజయవాడలో గురువారం ప్రారంభమైంది. ఎంజీ రోడ్‌లో సువిశాల ప్రాంగణంలో నెలకొల్పిన షోరూంను సినీ హీరో తేజ సజ్జా, హీరోయిన్ మీనాక్షి చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారాహి సిల్క్స్ మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ యేచూరి, డాక్టర్ స్పందన మద్దుల మాట్లాడుతూ.. విజయవాడ వస్త్ర ప్రపంచంలోకి అడుగుపెట్టడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలకు వారాహి సిల్క్స్ వారధిగా నిలుస్తుందని చెప్పారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఖాతాదారులకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామని, రూ.10 వేలు కొనుగోలుపై బంగారు నాణెం, రూ.15 వేలు కొనుగోలుపై బంగారం, వెండి ఉచితంగా అందిస్తామని తెలిపారు. వీటితో పాటు రూ.1500 విలువైన ఓచర్ కూడా ఇస్తున్నామని చెప్పారు. ఈ ప్రత్యేక ఆఫర్ విజయవాడ షోరూంలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని లక్కీడ్రా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు నిర్వహించిన లక్కీడ్రాలో గెలుపొందిన విజేతలకు ఐఫోన్లు బహూకరించారు. లక్కీ డ్రా విజేతలకు మొదటి బహుమతిగా ఐఫోన్లు, ద్వితీయ బహుమతిగా 500 గ్రాముల వెండి అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు వైకుంఠద్వార దర్శన టికెట్ల విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి కోటా టికెట్లను శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. తొలి మూడు రోజులకు ఈ-డిప్ ద్వారా ఇప్పటికే కేటాయించారు. మిగిలిన ఏడు రోజులకు నేటి ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో రోజుకు వెయ్యి చొప్పున శ్రీవాణి దర్శన టికెట్లు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు రోజుకు 15 వేల చొప్పున రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల చేస్తారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పేరుమార్పుతో సరా..?

వలసపాలనాకాలపు వాసనలను వదిలించుకొనే పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. గవర్నర్ల అధికారిక నివాసం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం నుంచి సూచన పేరిట ఆదేశాలు అందడంతో రాష్ట్రాలు ఆ పనిలో ఉన్నాయి. పేరులో ఏమున్నది, మార్చితే పోయేదేమున్నది అనుకోవచ్చును గానీ, అంతా పేరులోనే ఉందని అనుకోబట్టే కేంద్రం ఈ పథకాన్ని ప్రకటించిన మాట నిజం. పేరు మార్చినంతనే ప్రయోజనం లేదు, పేరు కాదు, ముందు బుద్ధి మారాలి, మీ తీరుమారాలి అని తమిళనాడు పాలకుడు స్టాలిన్ వంటివారు గిల్లుతున్నారు కానీ, పేరు మార్పుతో తమకు మరింత మన్నన దక్కుతుందని, రాజకీయ పెన్నిధి సమకూరుతుందని బీజేపీ నమ్ముతోంది.

కొత్త నామఫలకం తీర్చిదిద్దిన ఆ భవనంలో ఇకముందు కూడా ఉండేది, ఉండబోయేది ఆ గవర్నరే. మారింది నివాసం పేరే కానీ ఆ వ్యవస్థ కాదు. గవర్నర్ వ్యవస్థే బ్రిటిష్ వలసపాలనా కాలం అవశేషం. బ్రిటిష్‌కాలంలో గవర్నర్లంటే అధికారం, అహంకారం, అణచివేత, అమానుషత్వాల కలబోత. ఆ వ్యవస్థను మనం ఇంకా కొనసాగించుకుంటూ, మరో పక్క కేవలం పేరుమార్చడం ద్వారా అది ప్రజలపక్షమని సందేశం ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. రాజ్ స్థానంలో లోక్ అనడం ద్వారా దీనిని జన భవనంగా జనులందరూ విశ్వసించాలని కేంద్రం ఆలోచన కావచ్చు. బాగానే ఉంది కానీ, జనంతో ప్రత్యక్ష సంబంధం లేని, వారు నేరుగా ఎన్నుకోని, ఇంకా చెప్పాలంటే ప్రజలకు పరిచయం కూడా లేని గవర్నర్ అధికారిక నివాసాన్ని ప్రజాభవనంగా నామకరణం చేయడంలో ఔచిత్యమేమిటని లోకుల అనుమానం.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా, తమకు నచ్చినవారిని, సైద్ధాంతికంగా తాము మెచ్చినవారిని ఈ పదవిలో నియమిస్తుంది. వారు మేధావులు కావచ్చు, సకలవిద్యాపారంగతులు కావచ్చును కానీ, ప్రధానంగా ప్రధాని ఎంపికలో తమ మాట వినే లక్షణం పనిచేస్తుంది. ఆయన సూచనమేరకు రాష్ట్రపతి వద్దు కాదు లేదు వంటి సంశయాలకు తావు ఇవ్వకుండా ఆ నియామకాలు జరుపుతారు. రాష్ట్రపతికి నచ్చినంతకాలం గవర్నర్లు పదవిలో ఉంటారు తప్ప, ప్రజలు మెచ్చినంతకాలం కాదు. తన నియామకంతో సంబంధంలేని ప్రజలకు సహజంగానే గవర్నర్ జవాబుదారీ కాదు. వారు తనకు ఓటువేయరు కనుక, నేరుగా బాధ్యత వహించాల్సిన బాధ కూడా లేదు. ఆయన జవాబు చెప్పుకోవాల్సింది రాష్ట్రపతికీ, కట్టుబడాల్సింది రాజ్యాంగానికే. ప్రజలు ఎన్నుకొనే పార్టీలు, అవి ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, మంత్రి వర్గాలు మాత్రం ప్రజలకు తలవంచాలి, శాసనసభకు జవాబు చెప్పుకోవాలి, ప్రజాభీష్టానికి తలొగ్గాలి. కేవలం సమన్వయకర్తగా, కేంద్రం దూతగా, నామమాత్రపు పాలకుడుగా ఉంటున్న గవర్నర్ ఇంటిని జన భవనం అనడం జనానికి సరైనదిగా కనిపించడం లేదు.


విపక్షాల విమర్శలను అటుంచితే, కేంద్రం ప్రతిపాదించిన ఈ మార్పుకు పౌరసమాజం నుంచి, సామాన్యజనం నుంచి సానుకూల స్పందన రాకపోవడానికి కారణం గవర్నర్ వ్యవస్థ పనితీరు. అస్మదీయులే గవర్నర్లుగా నియమితులవుతారు కనుక డబుల్ ఇంజన్ సర్కార్లకు ఏ సమస్యా రాకపోవడం సహజం. కానీ, విపక్షపార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు మరొక ప్రత్యామ్నాయ పాలనావ్యవస్థగా తయారై, ఎలా వ్యవహరిస్తున్నారో చూస్తున్నాం. తమిళనాడు నుంచి పశ్చిమబెంగాల్ వరకూ గవర్నర్లు తామే ప్రతిపక్షంగా, ప్రతిపక్షనాయకుడిలాగా వ్యవహరిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను విమర్శించడం, ఘర్షణపడుతూండటం, బిల్లులను తొక్కిపెట్టి, ఎటూ తేల్చకుండా వదిలేసి పాలనను స్తంభింపచేయడం గమనిస్తున్నాం. 'రాజ్' అన్నది రాజరికాన్నో, బ్రిటిష్ రాజ్యాన్నో ప్రతిబింబిస్తున్నదని, గవర్నర్‌ను అలా చూడటం, ఆయన నివాసాన్ని రాజభవనం అనడం తగదని కేంద్రం అనుకుంటున్నందుకు సంతోషించాల్సిందే. అది పాలకుడి భవనం కాదు, ప్రజల భవనమనీ, ప్రజాసేవకుడి భవనమనీ కేంద్రం సందేశాన్ని ఇవ్వదల్చుకున్నందుకు మెచ్చాల్సిందే. తదనుగుణంగా ఈ అమృతభారతంలో గవర్నర్ వ్యవస్థను ప్రజానుకూల, ప్రజాకేంద్రిత వ్యవస్థగా సరిదిద్దాలి. గవర్నర్ అధికారాలు, విధులు, బాధ్యతల్లో మార్పులేవీ లేకుండా, వారి వ్యవహారశైలి అలాగే కొనసాగుతూంటే, కేవలం ఇంటిపేరుకు జనాన్ని తగిలించినమాత్రాన వారు పండుగ చేసుకోలేరు. 'లోక్‌భవన్' అన్నందుకు ఆ మార్పు కనబడాలి.

ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా!

మూడున్నర దశాబ్దాల చరిత్రను ఒక్కమాటలో చెప్పుకోవటం కష్టం. కానీ ఆ ఒక్కమాట చుట్టూనే ఎన్నో వివాదాలూ విమర్శలూ విరామం లేకుండా చెలరేగుతూనే ఉన్నాయి. అందరూ వింటున్న పదమే అది. తేలికగా అర్థమయినట్లూ అనిపిస్తుంది. అందరి అనుభవంలోనూ ఉన్నట్లూ కన్పిస్తుంది. కానీ హాస్యం వెనకాల లోతైన గాంభీర్యం దాక్కొన్నట్లుగా ఆ పదం సూచించే పరిణామం ఆషామాషీ అయినది కాదు. గ్లోబలైజేషన్‌గా మనందరమూ పిలిచే ఆ పదం 1990ల నుంచి విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చినా, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రపంచ పరిణామాలన్నీ దాని కేంద్రంగానే జరుగుతూనే ఉన్నా.. ఆ పదం విస్తృతార్థంలోకి వెళ్లగలిగితే వెనుకటి యుగాలు కనపడతాయి. 1990ల్లో బలం పుంజుకుని 2000ల నుంచి రాటుతేలిన గ్లోబలైజేషన్‌తో మనకు తెలిసేది ఒక యుగం చరిత్రే. ప్రపంచం చూసిన అనేక గ్లోబలైజేషన్లలో అది ఒకటి మాత్రమే.

మన అనుభవంలోని గ్లోబలైజేషన్ ఎంతో ప్రగాఢమైంది. కాదనలేం. అన్ని సంస్కృతులనూ అది రోడ్డురోలర్‌లాగా సమం చేసేస్తోంది. అలవాట్లలో, ఆకాంక్షల్లో, కట్టూబొట్టులో, వేషభాషల్లో, విశ్వసించే విలువల్లో ఏకత దిశగా మనుషులను పరుగులు పెట్టిస్తోంది. సొంత సంస్కృతులను కోల్పోతున్న వారిలో ఒక పట్టాన అర్థంకాని అశాంతికీ, అభద్రతకూ కారణమూ అవుతోంది. ఒక మార్పునకు అనుగుణంగా మనుషులు కుదురుకునే లోపలే మరో మార్పును గ్లోబలైజేషన్ వారి నెత్తిమీదకు తీసుకువస్తోంది. ఇవ్వాల్టి ఉద్యోగం రేపు ఉంటుందో ఊడుతుందో తెలియదు. ఈ ఏడాది టెక్నాలజీ వచ్చే ఏడు బతికి బట్టకట్టగలదా? లేదా? అన్నది ఎవ్వరూ చెప్పలేరు. వ్యక్తులూ, కంపెనీలతో పాటు దేశాలూ ఎగుడుదిగుడులకు గురవుతున్నాయి. అందుకే డీగ్లోబలైజేషన్ కావాలంటూ దాన్ని వ్యతిరేకించే ధోరణులూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య వాణిజ్యానికి అడ్డుగోడలు కట్టాలనే వాదనలూ ఎక్కువవుతున్నాయి. మనుషుల రాకపోకలపై కట్టడులూ మొదలవుతున్నాయి. ఇప్పటి గ్లోబలైజేషన్ అర్థంకావాలంటే దీనికంటే ముందు మనుషులను ప్రభావితం చేసిన ఆరు గ్లోబలైజేషన్ల వ్యవహారాలను తెలుసుకోవాలి. మొత్తంగా సప్త ప్రపంచీకరణల మంచి చెడులను స్థూలంగా అర్థం చేసుకుంటేనే భవిష్యత్తు రూపురేఖలు బోధపడతాయి. వర్తమానంలో ఏ అడుగులు వేయాలో తెలుసుకోగలం. కొందరు గాఢంగా కోరుకుంటున్నట్లుగా ప్రపంచీకరణ రథచక్రాన్ని వెనక్కి మళ్లించటం సాధ్యమో, అసాధ్యమో తేలిపోతుంది.

భౌగోళికంగా విడివిడిగా ఉన్న సమాజాల మధ్య వస్తువులూ, భావాలూ, సాంకేతిక పరిజ్ఞానాల మార్పిడులూ, మనుషుల రాకపోకలూ చరిత్ర పొడవునా ఏదో ఒకస్థాయిలో జరుగుతూనే ఉన్నాయి. అందుకే వస్తు, భావాల మార్పిడితో, మనుషుల రాకపోకలతో జన సమూహాల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడటమే గ్లోబలైజేషన్ అని స్థూలంగా చెప్పుకోవచ్చు. అయితే అది అన్ని సందర్భాల్లోనూ ప్రశాంతంగా జరగలేదు. ఇచ్చిపుచ్చుకునే రీతిలో మొదలవ్వలేదు. యుద్ధాలు, ఆధిపత్యాలు, అణచివేతలు, కిరాతకాలతో గ్లోబలైజేషన్లు ముడిపడిపోయాయి. రక్తాలూ, కన్నీళ్లతోనే దాని చరిత్ర తడిసింది. సుదీర్ఘ దృష్టితో చూస్తే మానవ సమాజాలన్నీ కాలక్రమంలో ప్రగతిమెట్లు ఎక్కినట్లు కనపడతాయి. కానీ ప్రతి ప్రగతిమెట్టు కిందా కొందరు నలిగిపోయారు. విజేతలూ, పరాజితులూ లేకుండా గ్లోబలైజేషన్ లేదు. సప్తప్రపంచీకరణల్లో ఈ రెండు సమూహాలూ ఉన్నాయి. వేల సంవత్సరాల చరిత్రలో ప్రపంచీకరణలు అనదగిన పరిణామాలను విడివిడిగా వివరించే రచనలు బోలెడు ఉన్నాయి. వాటికి భిన్నంగా ప్రపంచీకరణను ఏడుయుగాలుగా (ద ఏజెస్ ఆఫ్ గ్లోబలైజేషన్) వర్గీకరించి బాగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చింది ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త జఫరీ డి.శాక్స్ అనే చెప్పుకోవాలి.



ఏడు గ్లోబలైజేషన్లలో మొదటిది పాతరాతియుగం, రెండోది కొత్తరాతియుగం... మూడోది గుర్రాల యుగం. నాలుగోది సంప్రదాయ (క్లాసికల్) యుగం. అయిదోది సముద్రాన్వేషణ యుగం. ఆరోది పారిశ్రామిక యుగం. ఏడోది డిజిటల్ యుగం. పాతరాతియుగంలో మానవ సమూహాలు ఆహార అన్వేషణ కోసం ఒకచోట నుంచి ఇంకోచోటికి వెళ్లటం చాలా సాధారణం. ఆ క్రమంలోనే కొత్త వాతావరణ పరిస్థితులనూ, కొత్త జంతుప్రపంచాన్నీ, కొత్త సూక్ష్మక్రిములనూ, కొత్త వైరస్‌ల లోకాన్నీ ఎదుర్కొన్నారు. వాటి ప్రభావానికీ గురయ్యారు. వారికి తారసపడ్డ నియాండర్తల్, డెనిసోవన్స్ లాంటి పురాతన మానవ జాతులు కొన్ని అంతరించిపోయాయి. కొత్తవారితో యుద్ధాలూ, కొట్లాటలూ జరిగాయి. బతికిబట్టకట్టిన వారితో క్రమేపీ సాంస్కృతిక, శారీరక సంపర్కాలూ జరిగాయి. క్రీస్తుపూర్వం 70వేల సంవత్సరాల నుంచి 10,000 సంవత్సరాల వరకూ అంటే 60 వేల ఏళ్ల మనుషులు రాతి ఆయుధాలతో కొత్త ప్రాంతాలకు సంచరిస్తూనే ఉన్నారు.

> **ఏడో ప్రపంచీకరణ యుగం అంతులేని సంపదను సృష్టిస్తోంది. అదే సమయంలో ఆదాయంలో తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం, అణ్వస్త్ర యుద్ధభూతం అనేవి తీవ్ర అస్థిరతకు కారణం అవుతున్నాయి. ప్రపంచాన్ని ప్రమాదం అంచున నిలబెడుతున్నాయి. వీటిని పరిష్కరించగలిగిన స్థాయిలో సామాజిక, వైజ్ఞానిక అవగాహనా సంపద మనకుంది. ధనిక వర్గాల మితిమీరిన స్వార్థం, లాభకాంక్షలు ఆ సంపదను ఉపేక్షిస్తే భవిష్యత్తు అగమ్యగోచరమే!**


■ రాహుల్ కుమార్

అప్పుడే ఒక విచిత్రం జరిగింది. మానవ ప్రమేయం లేకుండానే జరిగిన ఒక పరిణామం రెండో గ్లోబలైజేషన్‌కు కారణమైంది. క్రీస్తుపూర్వం 10,000 ఏళ్ల నాటికి మంచుయుగం ముగిసింది. వాతావరణం వేడెక్కింది. వ్యవసాయానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. జంతువులను మచ్చికచేసుకోవటం మొదలైంది. ఆహార అన్వేషణ పోయి ఆహార ఉత్పత్తి మొదలైంది. స్థిరనివాసం కోసం గ్రామాలు ఏర్పడ్డాయి. శ్రమవిభజన సర్వసామాన్యమైంది. దీన్నే కొత్తరాతి యుగంగా పిలిచారు. ఇది ఏడువేల ఏళ్లు (క్రీస్తుపూర్వం 10,000 నుంచి 3,000 వరకూ) కొనసాగింది. సుదూర ప్రాంతాలతో వ్యాపారాలు కూడా మొదలయ్యాయి. గ్రామాల మధ్య వస్తుమార్పిడులూ సాధారణమయ్యాయి. వ్యవసాయ గ్రామాలు విస్తరిస్తున్న కొద్దీ ఆదిమతెగలతో యుద్ధాలూ మొదలయ్యాయి. మార్పును అంగీకరించకుండా పాతజీవితాన్ని అంటిపెట్టుకున్న తెగలు ఆ యుద్ధాల్లో అంతరించటమో, దూర ప్రాంతాలకు తరలివెళ్లటమో జరిగింది. కొత్త జీవితాన్ని అంగీకరించిన తెగలు వ్యవసాయాన్ని నేర్చుకుని గ్రామాల్లో కుదురుకున్నాయి.

రాగి, కాంస్యం లాంటి లోహాల వాడకంతో సమాజం కొత్త మలుపు తిరిగిందని మనందరమూ భావిస్తాం. కానీ వాటి కంటే గుర్రాలను మచ్చికచేసుకోవటంతోనే ప్రపంచీకరణ మూడో యుగం మొదలైందని శాక్స్ కొత్త ప్రతిపాదన చేశారు. ఆ అశ్వయుగం క్రీస్తు పూర్వం 3000–1000 వరకూ అంటే రెండువేల ఏళ్లు కొనసాగింది. దీని అర్థం తదనంతర కాలంలో గుర్రాల పాత్ర తగ్గిందని కాదు. వేరే ఇతర పరిణామాలకు ప్రాధాన్యం లభించింది. అశ్వయుగంతో రథాలు వాడుకలోకి వచ్చాయి. గుర్రాలపై సవారీ మొదలైంది. సుదూర ప్రాంతాల మధ్య సమాచార సౌకర్యాలు మెరుగుపడ్డాయి. నేలను దున్నటంలో గుర్రాలు కీలక పాత్రను పోషించాయి. ఇక గుర్రాల ప్రవేశంతో యుద్ధరీతులే మారిపోయాయి. తెగల పెద్దల పెద్దరికం స్థానంలో రాజులు వచ్చి రాజ్యాలు ఏర్పడటంలో గుర్రాలు కీలకపాత్రను పోషించాయి. మంచి గుర్రాలు అందుబాటులో ఉన్న రాజ్యాలు ఇతర ప్రాంతాల మీద ఆధిపత్యాన్ని సంపాదించాయి. గుర్రాలతోనే గ్రామాలపై ప్రభుత్వాలు అదుపు ఆజ్ఞలను సాధించగలిగాయి.

క్రీస్తుపూర్వం 1000 ఏళ్ల నుంచి క్రీస్తుశకం 1500 దాకా కొనసాగిన సంప్రదాయ యుగంలో రాజ్యాలూ సామ్రాజ్యాలూ విజృంభించాయి. ఇప్పుడు ప్రపంచంలో ప్రబలంగా ఉన్న మతాలన్నీ ఈ యుగంలో పుట్టి, బలపడి, విస్తరించినవే. తత్వశాస్త్రాలు, రాజకీయ సిద్ధాంతాలు అప్పుడే తలెత్తాయి. రాజరికాలు నిలదొక్కుకునేందుకు అవి ఎంతగానో తోడ్పడ్డాయి. రాజులు దైవాంశసంభూతులనే భావాలకు ప్రాచుర్యం అలాగే వచ్చింది. సామ్రాజ్యాలతో విడివిడి సమాజాల మధ్య సంబంధాలు బలపడి సంస్కృతులు విపరీతంగా ప్రభావితం అయ్యాయి. మధ్య ప్రాచ్యంలో పుట్టిన క్రైస్తవం యూరప్ అంతటా విస్తరించటమూ అందులో భాగమే. ఇస్లాం ఆసియా, ఆఫ్రికాలకు శరవేగంగా పాకింది. బౌద్ధం భారత్‌ను దాటి తూర్పు, ఆగ్నేయాసియాలను విపరీతంగా ప్రభావితం చేసింది. సముద్రయాన యుగంలో (1500–1800) యూరప్ దేశాలు అమెరికా ఖండాన్ని కనుగొనటమే కాదు ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధిపత్యాన్ని సాధించాయి. బానిసలుగా లక్షలాది ఆఫ్రికన్లను అమెరికాకు తరలించారు. ఖండాతర యుద్ధాలు మొదలయ్యాయి. యూరోపియన్లు అంటించిన జబ్బులతో, చేసిన యుద్ధాలతో అమెరికా ఖండంలో స్థానికజాతులన్నీ అంతర్థానమైపోయాయి. బలవంతపు వ్యాపారాలవాదేవీలు అన్నిచోట్లా మొదలయ్యాయి. చైనా, భారత్ లాంటి సుదీర్ఘ నాగరికత గల దేశాల ప్రాబల్యం క్షీణించింది. తుపాకీ, మరఫిరంగులు, శతఘ్నుల ధాటికి ఆసియా, ఆఫ్రికాలు కకావికలయ్యాయి. పారిశ్రామిక యుగంతో (1800–2000) ప్రపంచమే కుగ్రామంగా మారిపోయింది. బొగ్గు వినియోగంతో మొదలైన పారిశ్రామిక విప్లవం ఆవిరియంత్రంతో వడివడిగా అడుగులు వేసి.. మోటారు వాహనాలు, కరెంటు, రైళ్లు, విమానాలు, టెలిఫోన్లు, అత్యాధునిక యుద్ధ ఆయుధాల వినియోగంతో ప్రపంచ చిత్రాన్నే మార్చివేసింది. రెండు వందల ఏళ్ల చరిత్రలో రెండు దేశాలకు (బ్రిటన్, అమెరికా) అది ప్రపంచ ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు తలెత్తాయి. వలసపాలనలు అంతమయ్యాయి. ఆ రెండు వందల ఏళ్లలోనే ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగింది. దేశాల మధ్య అసమానతలు గతంలో ఎన్నడూ లేనంతగా తలెత్తాయి. పర్యావరణ విధ్వంసమూ పతాకస్థాయికి చేరింది.

> **యుద్ధాలు, ఆధిపత్యాలు, అణచివేతలు, కిరాతకాలతో గ్లోబలైజేషన్లు ముడిపడిపోయాయి. రక్తాలూ, కన్నీళ్లతోనే దాని చరిత్ర తడిసింది. మానవ సమాజాలన్నీ కాలక్రమంలో ప్రగతిమెట్లు ఎక్కినట్లు కనపడతాయి. కానీ ప్రతి ప్రగతిమెట్టు కిందా కొందరు నలిగిపోయారు. విజేతలూ, పరాజితులూ లేకుండా గ్లోబలైజేషన్ లేదు. సప్తప్రపంచీకరణల్లో ఈ రెండు సమూహాలూ ఉన్నాయి.**

2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఉన్నది డిజిటల్ యుగం. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, మొబైల్స్, కృత్రిమమేధతో దేశాల మధ్యా, దేశాల లోపలా సంబంధాలు, పరస్పర ఆధారితాలు పెరిగిపోయాయి. బొగ్గు స్థానంలో సౌర, పవన విద్యుత్తు ప్రాధాన్యం పెరుగుతోంది. ఏ దేశమూ మరో దేశంపై ఆధారపడకుండా మనగలిగే పరిస్థితి వచ్చేసింది. ఏకదేశ ఆధిపత్యానికీ కాలం చెల్లుతోంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల మీద గుత్తాధిపత్యం కొనసాగించే పరిస్థితి కనపడటం లేదు. అమెరికాను అన్నింటా సవాల్ చేస్తున్న చైనా పురోగతే దీనికి నిదర్శనం. ప్రపంచంపై ఆధిపత్యాన్ని చెలాయించిన అమెరికా, బ్రిటన్‌లకు ఉన్న అనుకూల పరిస్థితులు చైనాకు ఎన్నడూ లేవు. దోపిడీ చేయటానికి బ్రిటన్‌లాగా వలసరాజ్యాల్లేవు. అమెరికాకు లభించిన ఆఫ్రికా బానిసల శ్రమ చైనాకు లేదు. విలువైన వనరులున్న సువిశాల భూభాగాన్ని స్థానిక జాతుల నుంచి అమెరికాలాగా దక్కించుకునే అవకాశమూ రాలేదు. అయినా చైనా అమెరికాను అన్నింటా దాటిపోయే పరిస్థితే కనిపిస్తోంది.


ఏడో ప్రపంచీకరణ యుగం అంతులేని సంపదను సృష్టిస్తోంది. అదే సమయంలో ఆదాయంలో తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం, అణ్వస్త్ర యుద్ధభూతం అనేవి తీవ్ర అస్థిరతకు కారణం అవుతున్నాయి. ప్రపంచాన్ని ప్రమాదం అంచున నిలబెడుతున్నాయి. వీటిని పరిష్కరించగలిగిన స్థాయిలో సామాజిక, వైజ్ఞానిక అవగాహనా సంపద మనకుంది. ధనిక వర్గాల మితిమీరిన స్వార్థం, లాభకాంక్షలు ఆ సంపదను ఉపేక్షిస్తే భవిష్యత్తు అగమ్యగోచరమే! ప్రపంచీకరణ రథాన్ని వెనక్కితిప్పలేం. కానీ నిర్లక్ష్యం వహించి, యథాతథస్థితిని కొనసాగిస్తే దాని రథచక్రాల కింద అందరమూ నలిగిపోయే ప్రమాదాన్నీ కొట్టేయలేం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

వెంకయ్య సలహాలు నేతలకు నచ్చుతాయా?

ఉభయ తెలుగు రాష్ట్రాలలో అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు చేసిన హితబోధ ఆచరణాత్మకమైనదే. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కాదని, ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదని తెనాలిలో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో ఆయన చెప్పిన విషయం చర్చనీయాంశంగా మారింది. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించాలే తప్ప, ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని, దేశ ప్రజల ఆత్మనిర్భరతను దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయం. ఎన్నికల సందర్భంలో ఉచిత పథకాల హామీలపై ఆయన అనేకమార్లు తన నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ద్వారా ప్రేరణ పొందిన ఆయన... రాజకీయాల్లో హుందాతనాన్ని, దేశ హితాన్ని, సిద్ధాంత రాజకీయాలను ప్రోది చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. రాజకీయ పదవులకు దూరమైనప్పటికీ, దేశ హితం కోసం సలహాలు ఇవ్వడం మాత్రం ఆయన మానలేదు. రాజకీయాల్లో అజాతశత్రువు అయినందున, ఆయన ఆలోచనల ప్రభావం భవిష్యత్తు రాజకీయాలపై కొంత ఉంటుంది. ప్రతిపక్షాల్లో సైతం ఆయనను అభిమానించే నాయకులు ఉండడం ప్రత్యేకత.



ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం కోసం తప్పుడు మార్గాలు అవలంబిస్తారని, విలువల పరిరక్షణ పట్ల ప్రజలకు అనురక్తి తగ్గుతుందని ఆయన పలుమార్లు తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. వాస్తవ విషయాలను పరిశీలిస్తే మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకంలో ప్రామాణికత లేదు. చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే సామాజిక న్యాయం కొంత వరకు నెరవేరుతుంది. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, కోటీశ్వరుల కుటుంబాల స్త్రీలు ఈ పథకాన్ని ఉపయోగించుకోవడంలో ఎటువంటి సామాజిక న్యాయం లేదు. ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత అనవసర ప్రయాణాలు ఎక్కువయ్యాయి. ప్రామాణికత లేని ఈ పథకాన్ని కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందనే విషయం ఇక్కడ గమనార్హం. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగిన ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించడమే ఇందుకు కారణం. జాతీయవాదాన్ని రాజకీయ సిద్ధాంతంగా అనుసరించే భారతీయ జనతా పార్టీ సైతం ఈ ఉచిత పథకాల ఉచ్చులో పడడం మరింత విస్మయం కలిగించే విషయం.

వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడుతున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేక మంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇక రేషన్ కార్డులు పొందటానికి ఎవరు అర్హులు అనే విషయంలో రాజకీయ పార్టీల నాయకులకు స్పష్టత లేదు. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని చాలా మంది ఉపయోగించకుండా బ్లాక్ మార్కెట్‌కు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఒక కేజీ బియ్యానికి 42 రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులు గానీ నోరు విప్పకపోవడం శోచనీయం. వాస్తవంగా ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. ప్రజల భవిష్యత్తుకు ఒక పునాది లభిస్తుంది.

వెంకయ్యనాయుడు ఇచ్చిన సలహాలను రాజకీయ నాయకులు పాటిస్తారో, పాటించరో చెప్పలేం గాని, ఈ విషయంపై దేశ హితాన్ని కోరే ప్రజలలో చైతన్యం రావడం ఎంతైనా అవసరం.

– ఉల్లి బాలరంగయ్య
సామాజిక విశ్లేషకులు

నావికాదళాలకు అవమానం

దాదాపు అయిదున్నర దశాబ్దాలుగా భారత నౌకాదళం ఏటా డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవాన్ని జరుపుతోంది. దీని నేపథ్యం ఈ తరం వారికి తెలియకపోవచ్చు. 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మద్దతుగా, పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేసిన సందర్భంలో ఒక మహోజ్వల దినం డిసెంబరు 4. పాక్ సబ్‌మెరైన్ 'ఘాజీ' చాకచక్యంగా భారత సముద్రతీరంలోకి ప్రవేశించి, విశాఖ తీరానికి చేరువైంది. దీన్ని పసిగట్టిన 'ఐఎన్ఎస్ రాజ్‌పుత్' అనే భారత నావికాదళ నౌక, ఘాజీని ధ్వంసం చేసింది. దాంతో పాకిస్థాన్ యుద్ధ ప్రతాపం నిర్వీర్యమైపోయింది. ఆ విజయానికి ప్రతీకగా రక్షణశాఖ 1972 నుంచి ఏటా ఆ తేదీన విశాఖలో నేవీ డే జరుపుతోంది.

వచ్చే ఏడాది జరగనున్న ఐఎఫ్ఆర్ (ఇన్‌స్ట్రుమెంట్ ఫ్లైట్ రూల్స్)ను సాకుగా చూపి, ఈ ఏడాది నేవీ డేను రద్దు చేయడం– ఆనాటి సమరంలో పాల్గొని విజయం సాధించిన నౌకాదళాన్ని అవమానించడమే. 2016లోనూ విశాఖసాగరంపై ఐఎఫ్ఆర్ జరిగింది. అప్పుడు లేని ఇబ్బందులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ దశలో ఏమొచ్చాయో రక్షణశాఖకే తెలియాలి. ప్రతి ఏడాది డిసెంబర్ 4న విశాఖతీరంలో లక్షలాదిమంది ప్రజలు దేశభక్తితో పాల్గొని, నాటి నావికులకు నివాళిని, నేటి నావికులకు స్ఫూర్తిని అందించడం ఆనవాయితీ. విశాఖలోని ఆర్కే బీచ్‌లో నాటి ఐఎన్ఎస్ రాజ్‌పుత్ శౌర్యానికి ప్రతీకగా నిలిచిన 'విక్టరీ @ సీ' విజయస్థూపం నేడు విచారవదనంతో చూస్తోంది.

– బి.వి అప్పారావు

హామీ ఇచ్చారు... నెరవేరుస్తారా?

గత సాధారణ ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాజంపేట బహిరంగ సభలో హామీ ఇచ్చారు. ఇప్పుడు వారు ముఖ్యమంత్రిగా, ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అత్యంత క్లిష్టమైన సూపర్ సిక్స్ హామీలనే స్వల్ప వ్యవధిలో నెరవేర్చిన వీరు, ఈ హామీని కూడా కచ్చితంగా నెరవేరుస్తారని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలలో గంపెడు ఆశలు రేకెత్తాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే వారికి మళ్లీ ఆశాభంగం కలిగేటట్లు కనిపిస్తోంది.


చరిత్రాత్మకంగా, మౌలికవసతుల పరంగా, నైసర్గికంగా జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు కలిగిన రాజంపేట... గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. గతంలో జగన్మోహన్‌రెడ్డి రాజంపేటకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హోదాలో ప్రకటించి, జీఓ కూడా విడుదల చేశారు. కానీ కొద్ది రోజులకే ఆ మెడికల్ కాలేజీని మదనపల్లికి తరలించారు. దానికి ప్రతిగా రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు కంటి తుడుపు మాటలు చెప్పారు. కానీ సుదూర ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రం చేసింది వైసీపీ ప్రభుత్వం. వాస్తవంగా రాజంపేట నియోజకవర్గం అన్ని విధాలుగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమనడంలో ఎటువంటి సందేహం లేదు. బ్రిటీషు వారి కాలం నుంచే ఇక్కడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఉంది. నవాబుల పాలనలో 1807 నుంచి 1812 వరకు రాజంపేట నియోజకవర్గంలోని పెన్నా నది ఒడ్డున ఉన్న సిద్దవటం జిల్లా కేంద్రం ఉండేది. వర్షాలు వచ్చినప్పుడు పెన్నా నది పొంగుతుండడంతో ఆ జిల్లా కేంద్రాన్ని అప్పట్లో కడపకు మార్చారు. క్రీ.శ 1303లో మట్లి రాజులు సిద్దవటంలో బలమైన కోటను నిర్మించుకుని అక్కడి నుంచి సుదీర్ఘకాలం పరిపాలించినట్లు చరిత్ర తేటతెల్లం చేస్తోంది. రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట కూడా ఎంతో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక నేపథ్యాన్ని కలిగి ఉంది. మహాభారతాన్ని తెలుగులో రచించిన బమ్మెర పోతన కూడా 1450 నుంచి 1510 వరకు ఒంటిమిట్టలో నివాసం ఉన్నాడు. రాష్ట్ర విభజన తరువాత 2015లో రెండవ భద్రాచలంగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవ నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు ఇచ్చింది. పద కవితా పితామహుడు అన్నమాచార్యులు రాజంపేట సమీపంలోని తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. 1408 నుంచి 1503 వరకు అన్నమయ్య తిరగాడిన రాజంపేటను కాదని అదే అన్నమయ్య పేరుతో గత పాలకులు రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం రాజకీయ విశ్లేషకులను, మేధావులను, చరిత్రకారులను విస్మయానికి గురిచేసింది.

రాజంపేటలో ఇప్పటికిప్పుడు జిల్లా కేంద్రం నెలకొల్పేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. చరిత్రను, సదుపాయాలను, నైసర్గికతను విస్మరించి సుదూర ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేసిన గత పాలకుల తప్పును సరిదిద్దడంతో పాటు, గత ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోవలసిన బాధ్యత కచ్చితంగా ప్రస్తుత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలపై ఉంది.

● కైలసాని శివప్రసాద్

రైతు శ్రేయస్సుకు పాటుపడేదెవరు?

ఆనాదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకృతి విలయాలకు నిలయమైంది. సాధారణంగా వర్షాకాలంలో వర్షాలు పడతాయి. కానీ గత రెండు మూడు దశాబ్దాలుగా అక్టోబర్–నవంబర్–డిసెంబర్ నెలల్లో తీవ్ర తుఫానులు వస్తున్నాయి. విపరీతంగా వానలు కురిసి, నదులు పొంగి, వరదలు రావడంతో పంటలు పూర్తిగా దెబ్బతినడం మనం చూస్తున్నాం. రైతులను కోలుకోలేని స్థితికి తీసుకొస్తున్న ప్రకృతి వైపరీత్యాలను నిలువరించేందుకు మనమేం చేయాలి?




నేడు వ్యవసాయం లాటరీ అయ్యింది. ప్రకృతి వైపరీత్యాలు ఒక ఎత్తయితే, మరోవైపు ప్రభుత్వ విధానాలు ఈ స్థితికి కారణం. మరీ ముఖ్యంగా కోస్తా ప్రాంతంలో తరచూ తుఫాన్ల తాకిడికి పంటలు తీవ్రంగా నాశనమౌతున్నాయి. ఒక్కో సంవత్సరమైతే బాగా పండిన పంటలు కూడా చేతికి అందకుండా నీటిపాలు అవుతున్నాయి. ఒక్కోసారి పాక్షికంగా కొంత పంట చేతికందుతుంది. ఆ పంట భారీవర్షాల మూలాన నాసిరకంగా తయారవుతుంది. ఆ సరుకును వ్యాపారులు కొనరు. పెట్టిన పెట్టుబడి రాక, అప్పులు పెరిగిపోయి రైతు దిగాలుపడతాడు. ఈ స్థితిలో కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటారు. కానీ ఇంకొందరు ఆత్మవిశ్వాసంతో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, వ్యవసాయాన్ని విడిచిపెట్టకుండా ఉంటారు. పరిస్థితి ఇలా ఉండబట్టే చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరమౌతున్నారు.

వ్యవసాయరంగం లాభసాటి కాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో చాలా మంది నగరాలకు వలస పోతున్నారు. నాడు 'రైతేరాజు' అనే పరిస్థితి నుంచి నేడు 'రైతేకూలీ' అని స్థితికి వారు నెట్టబడ్డారు. నిత్యమూ రైతు నామం జపం చేస్తూ రైతు రాజ్యం, రైతు సంక్షేమం అని గగ్గోలు పెడుతున్న పాలకవర్గాలు రైతుకేమాత్రమూ లాభాలు చేకూర్చలేకపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం, పెట్టుబడి రాయితీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టాయి. ఇవేమీ రైతుల ఆత్మహత్యలను ఆపలేకపోతున్నాయి. వాస్తవంగా ఆలోచిస్తే రైతుకు కావలసింది పెట్టుబడి సాయాలు కాదు. సామ్రాజ్యవాద మార్కెట్‌లో విరివిగా లభిస్తున్న కల్తీ విత్తనాలు, నాసిరకం పురుగు మందుల కట్టడి. కల్తీ సరుకులను అమ్ముతున్న వ్యాపారులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. పంట సమయానికి ఎరువులను సకాలంలో రైతులకు అందించాలి. రాయితీల పేరిట వ్యవసాయ శాఖ అందిస్తున్న అత్యాధునిక వ్యవసాయ పరికరాలను కేవలం రైతులకే అందివ్వాలి.

'జై జవాన్–జై కిసాన్' అన్న లాల్‌బహదూర్ శాస్త్రి మాటలకు విలువనిస్తూ, రైతుల శ్రేయస్సుకై పాటుపడాలి. పండిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వాలపై లేదా? మార్కెట్ హెచ్చుతగ్గులను నియంత్రించాల్సిన పనిలేదా? కార్పొరేట్ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో నియంత్రిస్తూ, పలు సంస్కరణలను కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలి. స్వామినాథన్ సిఫారసులను పూర్తిస్థాయిలో అమలుపరచాలి. పలు పాశ్చాత్య దేశాలు వ్యవసాయ రంగాన్ని ఆదాయం లభ్యమయ్యే విధంగా తీర్చిదిద్దాయి. వారు విస్తార వ్యవసాయం చేయడంలో పలు ఆధునిక సాగు పద్ధతులు అవలంబిస్తున్నారు. భారతీయ శాస్త్రవేత్తలు కూడా ఆ దిశగా ఆలోచించి మరిన్ని ఆధునిక వ్యవసాయ పద్ధతులకు రూపకల్పన చేయాలి. మరిన్ని దిగుబడి వంగడాలను సృష్టించాలి. తద్వారా రైతు కంట కన్నీరుకు అడ్డుకట్ట వేయగలగాలి. అందరికంటే రైతులే తుఫానుల వల్ల ఎక్కువగా నష్టపోతున్నారు. ఒకవైపు ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపడుతూనే మరోవైపు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చాలి.

■ పిల్లా తిరుపతిరావు







గుంటూరు సీసీఐ కేంద్రంలో పత్తి ఆటో

రూ.20 ఇస్తే..పాస్

సీసీఐ కేంద్రాల్లో రైతుల నిలువు దోపిడీ

- లోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20 ఇవ్వాల్సిందే
- దిగుమతి కూలీ రెట్టింపుతో జేబుకు చిల్లు

సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వాళ్లే అన్నదాతలతో ఆడుకుంటున్నారు. సాధారణంగా పరీక్షల్లో వందకు 35 మార్కులు వస్తే పిల్లలను టీచర్లు పాస్ చేస్తారు. అలానే రైతులు తీసుకొచ్చిన పత్తి బండి సీసీఐ కొనుగోలు కేంద్రంలోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20లు చెల్లిస్తేనే పాస్ చేస్తున్నారు. లేదంటే లోనికి పంపేది లేదని మంకుపట్టు పడుతున్నారు. ఇది అప్పటికి చిన్న దోపిడీలా కనిపించినా.. కొనుగోళ్లు పూర్తయ్యే సరికి రూ.కోట్లకు చేరుకుంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రైతులు తీసుకొచ్చిన పత్తి నిల్వలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం నిర్ధారించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖది. ఈ పని చేసేందుకు ప్రతి సీసీఐ కేంద్రంలో మార్కెటింగ్ శాఖ సూపర్ వైజర్‌ను నియమించింది. ఆయా మండలాల నుంచి వచ్చిన రైతుల వివరాలు సీఎం యాప్, కిసాన్ యాప్‌లలో సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయం సదరు సిబ్బంది పరిశీలిస్తారు. వారు పరిశీలించిన తర్వాతే మిగిలిన కొనుగోలు ప్రక్రియ ఆరంభం అవుతుంది.

అదే అదునుగా...

ఒక వేళ మార్కెటింగ్ శాఖ సిబ్బంది (మిగతా 6వ పేజీలో)

దిగుమతి కూలీ రెట్టింపు

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో దింపుడు కూలీ ధరలు ఆసాంతం పెంచేశారు. గతంలో ఉన్న ధర కంటే రెట్టింపు కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు చక్రాల ఆటోలో పత్తి తీసుకువస్తే దిగుమతి కూలీ రూ.1000 నుంచి రూ.1200 వరకు తీసుకుంటున్నారు. అదే ట్రాక్టర్‌లో తీసుకు వస్తే రూ.1500 కు తగ్గకుండా తీసుకుంటున్నారు. లారీలో అయితే ఒక్కో చోట ఒక్కో ధర వసూలు చేస్తున్నారు. దిగుమతి కూలీ వ్యవహారంలో ఒకే విధానం లేక పోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. చాలా సందర్భాల్లో ఈ విషయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి.



ఆకట్టుకున్న 'ఆంధ్ర ఏకలవ్య'

- కరతాళ నీరాజనం అందుకున్న 'ఆపరేషన్ సిందూర్'
- కేఎల్‌యూలో 2వ రోజు ఉద్భవ్ ఉత్సవం



స్పీడ్ యాక్సిస్ రోడ్డు పనులు

- ఫేజ్- 2లో కి.మీ. మేర సెంటర్ కారిడార్ రోడ్డు పూర్తి
- మంతెన ఆశ్రమం నుంచి సీఎం ఇంటి వరకు పొడిగింపు
- అనుసంధానంగా రెండు అప్రోచ్‌లు
- కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాలు

8

ఆసుపత్రికి తాళం.. సిబ్బంది సస్పెన్షన్

- ఇద్దరు డాక్టర్లు సహా 12 మందిపై వేటు
- కమిషనర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన నిర్వాహకం

6

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

- తరలి రానున్న మాలధారులు
- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వర స్వామిని మేధా దక్షిణామూర్తిగా భక్తులు కొలుస్తారు. కోటి వరాల దీక్ష కోటప్పకొండ దీక్ష అనే సంకల్పంతో మాలను ధరిస్తారు. కోటప్పకొండలో 1981 నుంచి కోటయ్య స్వామి మాలధారణ ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు కోటప్ప మాలను ధరించి 41 రోజులు మండల దీక్షను భక్తిశ్రద్ధలతో చేపడతారు. అయ్యప్ప స్వాముల వలె కోటయ్య మాలధారులు ఇరుముడితో కొండకు చేరుకుంటారు. ఆరుద్రోత్సవం సందర్భంగా కోటయ్య స్వామికి స్వాములు ఇరుముడి సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇరుముడిని స్వాములు తలపై ధరించి నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి కొందరు స్వాములు పాదయాత్రగా కోటప్పకొండ చేరుకుంటారు.

విశేషంగా అభిషేకాలు

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం సందర్భంగా స్వామికి వివిధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. జ్యోతి దర్శనం అనంతరం త్రికోటేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరగనుంది. వీభూది, గంధం, కుంకుమ, పంచదార, వివిధ రకాల ఫలాలు, శుష్క ఫలాలు, ఆవు నెయ్యి, పెరుగు, తేనె, పాలు తదితర ద్రవ్యాలతో స్వామికి ఘనంగా అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి స్వామికి అన్నాభిషేకం చేస్తారు. అర్ధరాత్రి నుంచి ఆలయంలో మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు జరగనున్నాయి. అభిషేకాల అనంతరం స్వాములు మాల ధారణలు విరమిస్తారు. ఆదివారం ఉదయం గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహిస్తారు. స్వాములకు ప్రసాదం, భోజన సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో దాతలు తాళ్ల వెంకట కోటిరెడ్డి, అల్లు రమేష్, జయరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లను ఈవో డి.చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు.



మేధా దక్షిణామూర్తి

అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి

- ప్రజలకు ప్రభుత్వానికి వారధి కావాలి
- డీడీవో ప్రారంభోత్సవంలో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయ, పంచాయతీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలని అప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం వర్చువల్‌గా చిత్తూరు జిల్లా నుంచి ప్రారంభించగా తెనాలిలో డీడీవో కార్యాలయాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి సందేశాన్ని వీడియో ద్వారా ప్రదర్శించగా తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో మార్పు తెచ్చేందుకు పని చేస్తామని, బాధ్యతగా వ్యవహరిస్తామన్నారు. గతంలో ప్రజల కోసం పని చేసే అధికారులకు దండలు వేసి ఊరేగించేవారని, ఇప్పుడు ఆ వాతావరణం కనపడకపోవడానికి కారణాలను అన్వేషించాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్ అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా

గుంటూరులో కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ: గుంటూరులో డీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఆదనపు కమిషనర్ నాగార్జునలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ మాట్లాడుతూ డీడీవో కార్యాలయాల ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. దస్త్రాలు త్వరితగతిన పరిష్కారం కావడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ టి.విజయలక్ష్మి, డీపీవో బి.వి.నాగసాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.169 కోట్లతో లోక్ భవన్ నిర్మాణం

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని క్రియేటివ్ సిటీగా తీర్చిదిద్దనున్నట్లు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన 55వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ కాంప్లెక్స్‌లో రూ.169 కోట్లతో గవర్నర్ నివాస సముదాయం లోక్‌భవన్, రూ.165 కోట్లతో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణాలకు టెండర్లు పిలిచేందుకు ఆమోదం తెలిపారు. ఈ-3 సీడ్ యాక్సెస్ రహదారిని ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారితో అనుసంధానించేందుకు రూ.532 కోట్లతో టెండర్లు పిలిచేందుకు నిర్ణయించింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అమరావతిలో నిర్మించే ప్రతి భవనం విలక్షణంగా, పచ్చదనంతో అలరారుతూ ఉండాలన్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో 85 పనులు జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తెలుగు ఆత్మగౌరవానికి, వైభవానికి ప్రతీకగా నీరుకొండ వద్ద ఎన్టీఆర్ విగ్రహం నిర్మించాలని సూచించారు.

నేడు.. పాఠశాల పండుగ

- మెగా పీటీఎం 3.0కు విస్తృత ఏర్పాట్లు
- జిల్లాలో 1074 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ

గుంటూరు, గుంటూరు(విద్య) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పేరిట శుక్రవారం నిర్వహిస్తున్న పాఠశాల పండుగకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం) 3.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ ఎలా ఉందనే అంశంతో పాటు పాఠశాలల్లో వసతులపై చర్చించనున్నారు. మెగా పేరెంట్స్ మీట్‌కు రూ.25.20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని 1074 పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో రేణుక, సమగ్ర శిక్ష ఏపీవో పద్మావతి గురువారం తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మెగా పీటీఎం జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మెగా పీటీఎంపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్కే ఖాజా వలి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అంతర్జాతీయ స్థాయి నిర్మాణాలకే..

రెండో దఫా భూ సమీకరణ

\- మంత్రి నారాయణ

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరాలతో సమానంగా నిర్మించేందుకు అవసరమైన అంతర్జాతీయ స్టేడియం, ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ సిటీ, రైల్వేలైను, ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి భూమిని సమీకరించేందుకు రెండవ దఫా భూ సమీకరణకు క్యాబినెట్ ఆమోదించిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.నారాయణ అన్నారు. భూ సమీకరణ చేయనున్న గ్రామాలలో ఒకటైన యండ్రాయిని గురువారం మంత్రి నారా యణ స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ భూ సేకరణ చేపట్టాలని నిర్ణయం తీసు కుంటే.. స్థానిక పెదకూరపాడు, తాడికొండ ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రావణ్ కుమార్ అభ్యంతరం తెలిపి.. రైతులు నష్టపోతారని భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. దీనికి సీఎం చంద్రబాబు అంగీకరించారని తెలిపారు. గతంలో సమీకరించిన 29 గ్రామాల్లోని భూమి పెద్దపెద్ద ప్రాజెక్టులకు అవసరమైన ఎక్కువ మొత్తంలో అందుబాటు లో లేకపోవడంతో ఏడు గ్రామాలలో 16 వేల ఎకరాలు భూ సమీకరణ చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. రైతు కూలీలకు కూడా నెలనెల పెన్షన్, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. సమావే శం అనంతరం రైతు నంబూరి తులసిబాబు(బలరాం) యండ్రాయిలో ఉన్న తన నాలుగు ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇస్తున్నట్లు సంబంధిత ధ్రువీ కరణ పత్రాలను మంత్రి నారాయణకు ఎమ్మెల్యే ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో ఆర్డీఓ రమణాకాంత్ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు నాలుగు ఎకరాల భూమికి చెందిన దస్తావేజులు అందజేస్తున్న బలరాం

ఆలయాల నిర్మాణానికి.. శ్రీవాణి ట్రస్టు సహకారం

● ఈ నెల 15 వరకు దరఖాస్తులకు అవకాశం

పొన్నూరుటౌన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి సహకారం అందిస్తారని దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు గురువారం తెలిపారు. ఈ నెల 15లోగా ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు దేవదాయశాఖ జిల్లా అధికారులకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ పథకం కోసం ఐదు సెంట్ల లోపు స్థలం ఉంటే ఏ కేటగిరీ కింద రూ.10 లక్షలు, 5 నుంచి 8 సెంట్లు స్థలం ఉంటే బీ క్యాటగిరీ కింద రూ.15 లక్షలు, 8 నుంచి 10 సెంట్లు స్థలం ఉంటే సీ క్యాటగిరీ కింద రూ. 20 లక్షలు ఆలయ నిర్మాణ ప్రతిపాదనలు ఉండాలని తెలిపారు. పట్టా స్థలం అయితే భూ యజమాని అంగీకార పత్రం పోరంబోకు స్థలం అయితే పంచాయితీ కార్యదర్శి అంగీకార పత్రం, దరఖాస్తుతో పాటు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ పథకం కోసం దరఖాస్తులను స్థానిక ఎమ్మెల్యే లేఖ, హిందూ సంస్థల ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. అయితే ఎంపిక చేసిన స్థలంలో గతంలో ఎటువంటి ఆలయ నిర్మాణం చేసి ఉండకూడదని తెలిపారు. అలాగే గతంలో నిర్మాణం చేసి ప్రతిష్ట చేయకుండా ఉన్న వాటిని పూర్తి చేయడానికి కూడా దేవదాయ శాఖ అధికారులు సహకారం అందించనున్నట్లు చెప్పారు.

ఏఆర్ ఎస్ఐని కాపాడిన ఎస్ఐ ఖాజావలి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇంటి వద్ద విధులు నిర్వహిస్తుండగా.. అస్వస్థతకు గురైన ఏఆర్ ఎస్ఐని తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కాపాడారు. జగన్ ఇంటి సెక్యూరిటీ చెక్ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న ఏఆర్ ఎస్ఐ సింగ్ అకస్మాత్తుగా కింద పడి అపస్మారక స్థితికి వెళ్లారు. తోటి సిబ్బంది తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమయానికి అంబులెన్స్ రాకపోవడంతో.. సంఘటన స్థలానికి వచ్చిన తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి హుటాహుటిన ఏఆర్ ఎస్ఐని తన వాహనంలో ఎక్కించుకొని సమీపంలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ఎస్ఐ సింగ్ కోలుకున్నారు. తాడేపల్లి సీఐ వీరేంద్ర, సిబ్బంది ఎస్ఐ ఖాజావలిని అభినందించారు.

రూ.20 ఇస్తే.. పాస్

(5వ పేజీ తరువాయి)

వివరాలు నిర్ధారించకపోతే సీసీఐ కేంద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. రైతుల ఇటువంటి అవసరాన్ని ఆధారం చేసుకొని క్వింటాల్‌కు రూ. 20 ఇస్తే కానీ, పత్తి లోడ్‌ను పాస్ చెయ్యమని సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వే బ్రిడ్జి బరువు ఆధారంగా నగదు ముందే వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతి రైతు కనీసం రూ. 200 నుంచి రూ.400 వరకు చెల్లించి లోపలికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. గతంలో కూడా ఇదే వ్యవహారంపై దుమారం రేగింది. మార్కెటింగ్ సిబ్బంది చేస్తున్న వసూళ్ల దందాపై ఒక వ్యక్తి రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు.

రూ. 20 అంటే సామాన్యం కాదు

సీసీఐ కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి క్వింటాల్ పత్తికి రూ. 20 వసూలు చేస్తున్నారన్నది చిన్న విషయంగా తోచినా.. సీజన్ మొత్తంలో అది పెద్ద మొత్తంగానే కనిపిస్తుంది. ఉదాహరణకు గతేడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 9.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అప్పుడు కూడా క్వింటాల్‌కు రూ. 20 వసూలు చేసినట్లు పలువురు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ లెక్కన గత ఏడాది సుమారుగా రూ. 1.90 కోట్లు వసూలు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఇలా వసూలు చేసే సొమ్ము ఆ శాఖ లోని కీలకమైన వారి వద్దకు చేరుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అవి బుట్టదాఖలు అన్నట్లుగానే ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సూపర్‌ంటెండెంట్ సార్!

● మార్చురీ వద్ద..మరోసారి మారు వేషంలో జీజీహెచ్ సూపరింటెండెంట్

● మృతుడి బంధువుల ఆందోళనకు పరిష్కారం



మారు వేషంలో మృతుల బంధువుల పక్కన కూర్చున్న రమణ యశస్వి

గుంటూరు మెడికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మరోసారి మారువేషం వేశారు. జీజీహెచ్‌లో మృతుల బంధువుల ఆందోళనకు కారణం తెలుసుకుని.. న్యాయం చేసేందుకు ఆయన మృతుని బంధువులా వచ్చారు. గుంటూరు నల్లచెరువుకు చెందిన దారం రాంబాబు అనే వ్యక్తి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం జీజీహెచ్‌లో చేరాడు. ఐసీయూలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్లే రాంబాబు మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో రాంబాబు మృతదేహాన్ని ఆస్పత్రి సిబ్బంది మార్చురీకి తరలించారు. గురువారం ఉదయం కూడా కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన కొనసాగించారు. దీంతో.. వాస్తవాలు తెలుసుకుని వారికి న్యాయం చేసేందుకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి రంగంలోకి దిగారు. స్వెటర్, తలకు మంకీ క్యాప్ ధరించి, మృతుడి తరపున బంధువులా మారు వేషంలో అక్కడి వచ్చారు. చలిలో కూడా ఉదయం 8 గంటల నుంచి 9.40 వరకు మార్చురీ వద్దే కూర్చున్నారు. మృతుని బంధువులతో మాట్లాడారు. వైద్యుల భావవ్యక్తీకరణ సరిగా లేకపోవడమే గొడవకు మూలకారణమని తెలుసుకున్నారు. అనంతరం 'మీరు సూపరింటెండెంట్‌ను కలిసి మాట్లాడండి.. ఆయన మీకు న్యాయం చేస్తారు' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సూపరింటెండెంట్ చాంబర్‌లో అసలు విషయం

ఎట్టకేలకు ఉదయం 11.30 గంటలకు రాంబాబు కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్ చాంబర్‌కు వచ్చారు. అక్కడున్న సూపరింటెండెంట్‌ను చూసి.. ఉదయం మారువేషంలో వచ్చి తమతో మాట్లాడింది ఆయనేనని గుర్తుపట్టారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ.. 'మీకు న్యాయం చేసేందుకు.. జరిగిందేమిటో తెలుసుకోనేందుకే నేను అక్కడికి వచ్చాను' అని వారితో చెప్పారు. తాను ఐసీయూ సీసీ టీవీ ఫుటేజ్‌తో పాటు కేసు షీటు, వైద్యపరీక్షల వివరాలు పరిశీలించానని, రాంబాబుకు వైద్య సేవల్లో ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదని, జబ్బు తీవ్రత వల్లే ఆయన మృతి చెందాడని వారికి వివరించారు. అనంతరం వారికి నచ్చజెప్పి ఫ్రీజర్ ఉన్న అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మృతుడి బంధువులు కూడా శాంతించి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం సూపరింటెండెంట్ వైద్య సిబ్బందికి కూడా క్లాసు పీకారు. సిబ్బంది పనితీరుని అంచనా వేయడానికి ఆయన తరచూ మారువేషంలో వస్తుంటారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

● 20 సూత్రాల అమలు కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని 20 సూత్రాల అమలు కార్యక్రమం చైర్మన్ (స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్) లంకా దినకర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవాతో కలిసి వైద్య, ఆరోగ్య, విద్యా శాఖ, మౌలిక సదుపాయాల కల్పన శాఖలతో ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు తీరును సమీక్షించి, పురోగతికి అవసరమైన సూచనలు చేశారు. ఆయుష్మాన్ భారత్ నమోదు సంఖ్య మరింతగా పెరగాలని సూచించారు. 70 ఏళ్ల దాటిన వారి ఇంటి వద్దే రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ క్యాంటీన్లతో పిల్లల బడిబాట పట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎం శ్రీ పాఠశాలలపై త్వరలోనే ఆకస్మిక తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లాలో అమృత్-2 కింద నగరంలోని గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేసామని, త్వరలోనే పనులను ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలీ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కల్యాణ చక్రవర్తి, డీపీఓ శేష శ్రీ, ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా జిల్లా ఆరోగ్యం

20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ వెల్లడించిన రక్త నమూనా పరీక్షల ఫలితాల గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. జిల్లాలో 85,348 సాధారణ రక్తపరీక్షలు నిర్వహించగా 1,054 మందికి, 33,304 గర్భిణులకు పరీక్షలు చేయగా 25 మందికి హెచ్ఐవీ పాజిటివ్ వచ్చిందన్నారు. 59, 228 యూనిట్ల రక్తాన్ని సేకరించగా అందులో 69 అనుమానాస్పద రక్త నమూనాలను పరీక్షలకు పంపగా 15 యూనిట్లలో హెచ్ఐవీ కనపడిందని, దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో 19 -45 మధ్య వయస్సు ఉన్నవారిలో 2025-26కు 3,353 అనీమియా కేసులు గుర్తించినట్లు చెప్పారు. 18 ఏళ్ల పైబడిన వారు 17.95 లక్షల మంది ఉంటే ఓరల్ క్యాన్సర్ 205, రొమ్ము క్యాన్సర్ 508, సెర్వికల్ క్యాన్సర్ 307 మందికి ఉన్నట్లు తెలిపారు. మొత్తం జిల్లాలో 22.42 లక్షల జనాభాలో ప్రస్తుతం 4,339 టీబీ కేసులు ఉండగా, 83 మంది మరణించారని, హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న టీబీ కేసులలో 8 మంది మరణించారని, ఇతర కారణాలతో టీబీ కేసులు 92 ఉంటే అందులో 6 మంది మరణించారని వివరించారు. జిల్లాలో మొత్తం 9.09 లక్షల అర్హులైన వారికి ఇప్పటివరకు 8.79 లక్షల పీఎంజేఏవై కార్డులు పంపిణీ చేశామన్నారు. 70 సంవత్సరాలు పైబడిన వారు 1.55 లక్షల లబ్ధిదారులు ఉంటే ఇప్పటి వరకు 14.50 వేల మంది మాత్రమే కార్డులు తీసుకున్నారని వివరించారు. స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం క్రింద జిల్లాలో 360 పాఠశాలలో కంటి పరీక్షలను 43,950 మందికి చేయగా, 3147 మందికి కళ్లజోళ్లు అందిచినట్లు చెప్పారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 579.20 అడుగులు ఉంది. ఇది 280.69 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6097 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,797 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,797 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

జడ్పీ చైర్‌పర్సన్‌కు ఊరట



హెనీ క్రిస్టీనా

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాపై అభియోగాన్ని సివిల్ జడ్జి కోర్టు గురువారం తోసిపుచ్చింది. పట్టణానికి చెందిన మండ్రు సరళకుమారి అనే మహిళ 2022 జడ్పీటీసీ ఎన్నికల్లో క్రిస్టీనా ఎస్‌సి కాదని, నలుగురు సంతానం ఉన్నారంటూ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం జడ్జి పవన్‌కుమార్ పిటిషన్‌ను కొట్టివేశారు.

ఆసుపత్రికి తాళం.. సిబ్బంది సస్పెన్షన్

● ఇద్దరు డాక్టర్లు సహా 12 మందిపై వేటు

● కమిషనర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన నిర్వాకం



తాళం వేసిన గణపవరం పీహెచ్‌సీ

గుంటూరు సిటీ, నాదెండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిపై వేటుపడింది. పల్నాడు జిల్లా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు సహా 12 మంది సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఆరోగ్యశాఖ డైరెక్టర్ కె.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్ గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటల పాటు తెరిచి ఉంచాల్సిన ఆసుపత్రికి తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఆసుపత్రి సిబ్బంది పై చర్యలకు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ కవిత అనసూయదేవి, డాక్టర్ ఎల్.ప్రసాద నాయక్, ఎంపీహెచ్ఈఓ కె.శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ అంజమ్మ, సీనియర్ అసిస్టెంట్ బి.హనుమంతనాయక్, స్టాఫ్ నర్సులు బి.అరుణ, ఎస్.విజయ, ఎస్కే. మస్తాన్ బీ, ల్యాబ్ టెక్నీషియన్ అరుణకుమారి, సూపర్వైజర్లు షేక్ రెహ్మాన్ బాషా, జానకీ దేవి, ఎఫ్ఎన్ఓపీ ఎస్.పుట్టలమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెండ్ అయిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లొద్దని ఆదేశాల్లో పేర్కొన్నారు. వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రవిని హెల్త్ డైరెక్టర్ ఆదేశించారు.

డిప్యూటేషన్‌పై సిబ్బంది

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సస్పెండైన సిబ్బంది స్థానంలో కొత్తగా సిబ్బందిని నియమించారు. డాక్టర్ హరిహరణ్, డాక్టర్ ఎస్కే. సుమియా, స్టాఫ్ నర్సులు నాగరాజు, సురేఖ, కృష్ణవేణి, ల్యాబ్ టెక్నీషియన్‌గా సతీష్, ఎంపీహెచ్ఈఓగా శేషగిరి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి, సూపర్వైజర్ బాలకోటేశ్వరి భాయ్‌ని డిప్యూటేషన్‌పై గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

ప్రపంచ బ్యాంకు, ఏడీబీ టెక్నికల్ మిషన్ ప్రారంభం

● వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు, అధికారులు

తుళ్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఏపీ సీఆర్డీఏ జాయింట్ టెక్నికల్ మిషన్‌ను గురువారం సీఆర్డీఏ ప్రారంభించింది. ఈ కార్యక్రమం రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ వరకు వారం రోజులపాటు జరుగనుంది. ఇందులో అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కార్యక్రమం (ఏఐయూడీపీ) కింద రాజధాని నిర్మాణంలో భద్రతా ప్రమాణాల అమలు, భాగస్వాముల భాగస్వామ్యం, పీపీపీ ప్రణాళిక, కాంట్రాక్టుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యకలాపాలపై చర్చలు జరుగుతాయి. తొలిరోజైన గురువారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస (జీబీవీ) లైంగిక దోపిడీ, వివక్ష (ఎస్ఈఏ), లైంగిక వేధింపులు (ఎస్‌హెచ్) అనే అంశాలపై ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందంలో ప్రపంచ బ్యాంకు సీనియర్ జెండర్ స్పెషలిస్ట్ జయా శర్మ, జీబీవీ కన్సల్టెంట్ శృతి మున్షి, గుంటూరు వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సెలర్ విజయలక్ష్మి, సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారుల, కాంట్రాక్టర్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దాచేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ నూతన లైన్ల నిర్మాణం చేస్తూ ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో జరిగింది. గురువారం దాచేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదగార్లపాడు సమీపంలో 133కేవీ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కరెంటు వైర్లు లాగుతుండగా ప్రమాదవశాత్తు హెవీ లైన్ తగలటంతో తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బోరారు రుక్మద్(29) అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

594 కేజీల గంజాయి ధ్వంసం



పశ్చిమ గోదావరి ఎస్పీ బద్నాన్ నయీం అస్మి, ఇతర అధికారులు

యడ్లపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లాలో పట్టుబడిన గంజాయిని ఆ జిల్లా పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ బద్నాన్ నయీం అస్మి చైర్మన్‌గా ఉన్న డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 21 కేసులలో పట్టుబడిన 594.84 కిలోల గంజాయిని గట్టి బందోబస్తు నడుమ యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటుకు తరలించారు. జిందాల్ పవర్ ప్లాంటులోని రెండవ బాయిలర్‌లో గంజాయి వేసి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్లాంటు ప్రెసిడెంట్ ఎంవీ చారికి, సిబ్బందికి, ఈగల్, ఎక్సైజ్, రెవెన్యూ, ఫైర్, పొల్యూషన్ అధికారులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరిజిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, భీమవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీంద్ర, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, డీసీఆర్‌బీ ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

మేనమామ అప్పు తీర్చి.. మేనల్లుడి ఆత్మహత్య



షేక్ అహ్మద్ (ఫైల్ ఫొటో)

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేనమామ మోసగించడంతో మేనల్లుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. తక్కెళ్లపాడుకు చెందిన షేక్ అహ్మద్(26) అనే యువకుడు అదే గ్రామంలో ఉంటున్న తన మేనమామ ఆర్థిక ఇబ్బందులు తీర్చాడు. ప్రైవేట్ ఫైనాన్స్‌లో తన ఇల్లు తాకట్టు పెట్టి రూ.4లక్షలు మేనమామకు ఇచ్చాడు. రుణానికి సంబంధించిన కిస్తీలను తన మేనమామ కట్టకపోవడంతో మనస్థాపానికి గురైన అహ్మద్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మృతికి కారణం తన మేనమామేనని సూసైడ్ నోట్ రాశాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ పెద్ద మస్తాన్



లంచం నగదుతో పట్టుబడ్డ ఏఈ పెద్ద మస్తాన్

కారంపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారంపూడి విద్యుత్ శాఖ ఏఈ కె.పెద్ద మస్తాన్ రూ.25వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహీందర్ నేతృత్వంలోని బృందం గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుంది. కారంపూడికి చెందిన మస్తాన్‌వలిని ఇంజనీరింగ్ వర్క్స్ షాపునకు సంబంధించి కేటగిరి-2 మీటరు కోసం మూడు నెలల నుంచి తిప్పుకుంటూ.. విద్యుత్ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. మీటరు ఇవ్వడానికి డబ్బులు కూడా డిమాండ్ చేయడంతో మస్తాన్‌వలి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏఎస్పీ మహీందర్ విలేకరులతో మాట్లాడుతూ పట్టుబడ్డ ఏఈ పెద్ద మస్తాన్ గతంలో రాజుపాలెం, మాచవరం మండలాల్లో పనిచేశారన్నారు. ఎవరైనా లంచం అడిగితే బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు నాగరాజు, మన్మథరావు, ఎస్ఐలు సతీష్‌బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

45,479 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 42,461 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,479 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,854 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17000	334	10500	16700
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	----	----	273	----	----
341	10500	16800	341	12000	17000
4884	----	----	4884	12000	14200
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	17200
బ్యాడిగి	10500	17100	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7800
ఆర్మూరు	10500	13300			



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

డ్రెయిన్ల తర్వాతే రోడ్ల నిర్మాణం చేపట్టాలి: కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నూతనంగా నిర్మించే రోడ్ల డ్రెయిన్ల నిర్మాణం అనంతరమే చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు ఆయన ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. గురువారం స్తంభాల గరువు, బ్రాడీపేట, అరండల్‌పేటల్లోని పలు ప్రాంతాలను పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో డ్రెయిన్లు ఏర్పాటు చేయకుండా రోడ్లు నిర్మించడం వల్ల వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. డ్రెయిన్ల ఆక్రమణలపై పట్టణ ప్రణాళిక అధికారులు కఠినంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట ఈఈ వేణుగోపాల్, ఏసీపీ రెహ్మాన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

7న జూడో జూనియర్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో ప్లేయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి డాన్‌బాస్కో పాఠశాల ఆవరణలో ఈ నెల 7వ తేదిన అండర్-15, 21 బాల బాలికల విభాగాల్లో జూడో జూనియర్ క్యాడెట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీ.శ్రీహరి నాయుడు, కిరణ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20వ తేదిల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 99660 99120 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

బాస్కెట్‌బాల్‌లో సీతారామయ్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూజివీడులో జరిగిన అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలలో పాటిబండ్ల సీతారామయ్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కమిటీ గౌరవ అధ్యక్షుడు యలమంచిలి శివాజీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీలో పాఠశాల 9వ తరగతి సీబీఎస్ఈ విద్యార్థి మణికంఠ కాంస్యపతకం సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువే కాకుండా వివిధ ఆటలలో నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ శేఖర్ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోనేపూడి దుర్గా శ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ మట్టమనేని రాధామాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ సయ్యద్ దిల్ ఖుషాన్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ తిరుమలశెట్టి శ్రీదేవి, ఇంచార్జి కొమ్మినేని హరిప్రియ పాల్గొన్నారు.

భావితరాలకు కోగంటి సీతారామాచార్యులు స్ఫూర్తి



ప్రసంగిస్తున్న ఎంటీ ఆల్వార్, పాల్గొన్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంస్కృత తెలుగు భాషలలో ప్రజ్ఞా పాటవాలతో భావితరాలకు స్ఫూర్తిని, తేజస్సును అందించిన ఉభయ భాషా సరస్వతాభూర్తి కోగంటి సీతారామాచార్యులని సాహిత్య శిరోమణి ఎంటీ ఆల్వార్ పేర్కొన్నారు. స్థానిక బృందావనగార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కోగంటి సీతారామాచార్యుల శత జయంతి ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు చతుష్పాదుల కాశీకవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కోగంటి వెంకటాచార్యులు మాట్లాడారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆళ్వారు సుందరరావు హాజరయ్యారు. దేవస్థానం నిర్వాహకులు కొమ్మూరి పుట్టగుంట ప్రభాకరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించగా సభకు కేవీఎల్ఎన్ అవధానాచార్యుల స్వాగతం పలికారు. డాక్టర్ కేవీ శ్రీరంగనాయకి అతిథులను సత్కరించి వందన సమర్పణ గావించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

స్థానిక బృందావనగార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిరపౌర్ణమి సందర్భంగా విశ్వశాంతి కాంక్షిస్తూ నిర్వహించిన ఈ హోమంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు, వేదపండితుల నిర్వహణలో గణపతి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, చండీహోమం నిర్వహించారు. కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరస్వామి ఊరేగింపు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శివాలయంలో వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా శ్రీబాలా త్రిపురసుందరి సమేత శ్రీఉమామహేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి పవళింపు సేవ కార్యక్రమం నిర్వహించారు.

కార్పొరేట్ల గుప్పిట్లో దేశం: ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశంలోని మొత్తం రాజకీయవ్యవస్థ కార్పొరేట్ల గుప్పిట్లో ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేటీకరణ జపం చేస్తూ వారి ప్రయోజనాలను కాపాడటమే పనిగా పెట్టుకుందన్నారు. స్థానిక కొత్తపేటలో గురువారం జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన పార్టీ కార్యదర్శులు, సభ్యుల వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని రామారావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవినీతి వ్యతిరేక కవితల పోటీ ఫలితాలు

గుంటూరు: గత నెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ సంయుక్తంగా నిర్వహించిన అవినీతి వ్యతిరేక కవితల పోటీల ఫలితాలను గురువారం ప్రకటించారు. ఇంద్రగంటి మధుసూదనరావు (నెల్లూరు) ప్రథమ బహుమతి రూ.5వేలు, డాక్టర్ సుధామైథిలి (గుంటూరు) ద్వితీయ బహుమతి రూ.3వేలు, యర్రబత్తిన మునీంద్ర (నెల్లూరు) మూడో బహుమతి రూ.2వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఈ నెల 9న ఈ బహుమతులు అందిస్తామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు, ఆప్ నాయకులు సేవకుమార్ తెలిపారు.

శారదానికేతన్ మరో వెయ్యేళ్ళు కొనసాగాలి

● చలనచిత్ర నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ



ప్రసంగిస్తున్న చలనచిత్ర నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూరేళ్ల చరిత్రగల శ్రీశారదానికేతన్ మరో వెయ్యేళ్ళపాటు కొనసాగేలా చర్యలు చేపట్టాలని చలనచిత్ర నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ పిలుపునిచ్చారు. శారదానికేతన్‌లో ఉన్నవ లక్ష్మీనారాయణ 148వ జయంతి సందర్భంగా అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మాలపల్లి నవలా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మా ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తమ్మారెడ్డి భరద్వాజ ప్రసంగిస్తూ నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా మాలపల్లి నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ రచించారన్నారు. ఆ రోజుల్లో ఉన్నతమైన ఆశయాలతో ఉన్నవ దంపతులు స్థాపించిన శ్రీశారదానికేతన్ భావితరాలకూ సేవలందించేలా ప్రభుత్వాలు, సేవా తత్పరులు సహకారం అందించాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ ఉన్నవ లక్ష్మీనారాయణ 103 ఏళ్ల క్రితమే నాటి సమాజంలో వేళ్ళూనుకుపోయిన రుగ్మతులను, లోపాలను స్పృశిస్తూ తన నవలకు మాలపల్లి అని పేరు పెట్టడం సాహసమేనన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ ఉన్నవ రచించిన మాలపల్లి ప్రభావం నాటి సమాజాన్ని, రచయితలను ప్రభావితం చేసిందన్నారు. తొలుత ఉన్నవ దంపతుల చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా మాలపల్లి నవలా విశిష్టతను తెలియపరుస్తూ విద్యార్థులు చేసిన ఉపన్యాసం, ప్రదర్శించిన స్కిట్ అలరించాయి. కార్యక్రమంలో శారదానికేతన్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసరావు, ప్రముఖ విద్యావేత్త డి.ఏ.ఆర్.సుబ్రహ్మణ్యం, ఉన్నవ కుటుంబ సభ్యురాలు హేమ, కళాశాల ప్రిన్సిపాల్ పి.కోటిరత్నం, హెచ్ఎం ఎన్.ఉషాకుమారి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కేవీ చలపతిరావు, ఓరుగంటి నారాయణరెడ్డి, మేకల రామారావు తదితరులు ప్రసంగించారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సీఎస్ సమీక్ష



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్‌పై ప్రామాణిక మార్గదర్శకాలను జారీ చేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. దీనికి సంబంధించి టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. తాగునీరు, కీటకాల ద్వారా వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. గురువారం ఏపీ సచివాలయం నుంచి కలెక్టర్ అన్సారియా అధికారులతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శనివారం డ్రై డే నిర్వహించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎక్కడా గోనె సంచులు కొరత లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పేరుతో వైసీపీ మోసం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాల పేరుతో గత వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. నియోజకవర్గంలోని మేనకా గాంధీ నగర్ 7వ లైన్‌లో రూ.49.90లక్షల ఖర్చుతో సీసీ డెయిన్, ఆర్సీసీ కల్వర్టుల నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మేనకా గాంధీ నగర్ 17వ డివిజన్‌లో తాను బాధ్యత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ వేగంగా పనులు పూర్తిచేసి అందజేస్తారని హామీ ఇచ్చారని, అనంతరం స్థానిక ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ, అర్హులైన వారికి 100 గజాల స్థలాలు కేటాయించే విధానంపై ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం ఉద్యోగనగర్‌లో ఎమ్మెల్యే గళ్లా మాధవి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

కార్యక్రమంలో సింగంశెట్టి వీరయ్య, గుంటుపల్లి సుధా రాణి, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

● వెస్ట్ డీఎస్పీ అరవింద్



జేకేసీ కళాశాలకు సర్టిఫికెట్ అందిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తాత్కాలికంగా ఉత్సాహాన్నిచ్చినా జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని వెస్ట్ డీఎస్పీ అరవింద్ అన్నారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో ఇటీవల ఎస్పీ వకుల్ జిందాల్ "సంకల్పం-మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జేకేసీ కళాశాలలో డ్రగ్స్‌పై సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరవింద్ గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే మానసిక, శారీరక దుష్ప్రభావాలు, భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు కాని డయల్ 112, 1972 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని చెప్పారు. అనంతరం జేకేసీ కళాశాల మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతోంది అనే సర్టిఫికెట్‌ను కళాశాల యాజమాన్యానికి అందజేసారు. ఈ కార్యక్రమంలో పట్టాభిపురం ఎస్సైలు నాగేంద్ర కుమార్, ప్రదీప్, కళాశాల ప్రిన్సిపల్ గోపీచంద్, శ్రీనివాస్ రావు, నాగ సుశీల, వీణ, అంజనీ దేవి, ఇతర కళాశాల ప్రముఖులు పాల్గొన్నారు.

26, 27న ఆర్వీఆర్‌లో సాంస్కృతిక, క్రీడా ఉత్సవం

గుంటూరు(విద్య) డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 26, 27వ తేదీల్లో సాంకేతిక, సాంస్కృతిక క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. కొలరీడో 2కే25 పేరుతో నిర్వహించే వేడుకల్లో విజేతలకు రూ.5 ల క్షల బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయిలో నిర్వహిం చే పోటీలకు దేశవ్యాప్తంగా కళాశాల నుం చి విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు http-s://rvrjcce.ac.in/colori-do2k25 అనే వెబ్‌సైట్‌లో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గొప్ప పరిపాలనా దక్షుడు రోశయ్య

● డీసీఎమ్ఎస్ చైర్మన్ హరిబాబునాయుడు



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరిబాబు తదితరులు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య గొప్ప పరిపాలనా దక్షుడని డీసీఎమ్ఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు పేర్కొన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలో రోశయ్య నాలుగో వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోశయ్య ఎన్నో కీలక పదవుల్లో ఉన్నా, ఆయన వినయం, నిష్పక్షపాత ధోరణి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు కార్పొరేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా వాసవి సేవా సమితుల సమాఖ్య కన్వీనర్ ఉడత మహేష్ కుమార్ హిందూ కాలేజీ జంక్షన్లో ఉన్న రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 17 సార్లు రాష్ట్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను రోశయ్య సొంతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ నిడమానూరి సురేష్, డీఎల్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత డి.సురేష్ బాబు, అమరావతి వాసవి అన్న పూర్ణ సత్రం చైర్మన్ తడవర్తి రాంబాబు, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, రాష్ట్ర నాయకులు నేరెళ్ల మాధవరావు, వాసవి సేవా సమితుల సమాఖ్య పూర్వాధ్యక్షులు డి.నరసింహారావు, కె.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చినపలకలూరులో ఎన్ఎస్ఎస్ శిబిరం

గుంటూరు (విద్య) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ నిరుల మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చినపలకలూరులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక వెల్లడించారు. గ్రామంలో వారంపాటు కొనసాగనున్న శిబిరంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం, స్వచ్ఛ భారత్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ హెచ్.భవాని పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం

గుంటూరు మెడికల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలో నూతనంగా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చక చకా జరుగుతున్నాయి. ఈ ఆడిటోరియానికి అయ్యే నిర్మాణ వ్యయం రూ.15 లక్షలను దాత కరణం రాజారావు విరాళంగా అందజేశారు. ఆసుపత్రిలో వివిధ సందర్భాల్లో నిర్వహించే ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లకు ఇకపై ఈ వేదికను వినియోగించనున్నారు. శనివారం నాటికి ఈ ఆడిటోరియం సిద్ధం చేసి ప్రారంభించాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచించారు.

10న సీసీఐ కార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు (తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 10న గుంటూరులోని సీసీఐ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు తెలిపారు. రైతు సంఘం జిల్లా స్థాయి సమావేశం స్థానిక మల్లయ్య లింగం భవన్లోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేవీవీ ప్రసాదు మాట్లాడుతూ, పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు రైతాంగానికి నష్టం కలిగిస్తున్నాయన్నారు. తక్షణమే నిబంధనలు సడలించాలని కోరారు. 10న జరిగే ధర్నాలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ముప్పాళ్ల శివ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు ఐదో లైను కోదండ రామాలయంలో దత్త జయంతి సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రామకృష్ణ శర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ సభ్యుడు పుల్లారావు ఘనంగా సత్కరించారు. అంతకుముందు దత్తాత్రేయునికి పాలాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిగాయి.

ప్రేమ జంట ఆత్మహత్య

● ఇష్టం లేని పెళ్లి చేస్తున్నందుకు బలవన్మరణం

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని ఓ ప్రేమ జంట ఎలుకల ముందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో తొలుత ప్రియురాలు ఆ తర్వాత ప్రియుడు ప్రాణాలు కోల్పోయారు. నల్లపాడు పోలీసుల వివరాల ప్రకారం, పల్నాడు జిల్లా ఈపూరు మండలం బోడెపూడివారిపాలెంకి చెందిన కారుడ్రైవర్ రెడ్డిబోయిన రాంబాబు (23) చింతలచెరువు గ్రామానికి చెందిన శిరీష(22) ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. అయితే శిరీషకు వేరే పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించడంతో గత నెల 28న ఇరువురు నల్లపాడు వచ్చి ఎలుకల ముందు తిన్నారు. మరుసటిరోజు వినుకొండకు వెళ్లి కుటుంబసభ్యులకు విషయాన్ని తెలిపారు. వెంటనే కుటుంబసభ్యులు ఇరువురిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గత నెల 30న రాంబాబును మెరుగైన వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శిరీష ఈ నెల 2న మృతిచెందగా, రాంబాబు గురువారం మృతి చెందాడు. రాంబాబు అన్న శివకృష్ణ ఫిర్యాదుమేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9 మంది జూదరుల అరెస్టు

నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధి పలకలూరు రోడ్డు రత్నగిరి కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 9 సెల్ ఫోన్లు, ఓ బైక్, రూ.54,140 నగదును స్వాధీనం చేసుకొని జైలుకు తరలించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా షేక్ సాంబశివరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా షేక్ సాంబశివరావు నియమితులయ్యారు. గురువారం లాలుపురంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు చేతుల మీదగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న సంక్షేమ ఫలాలు మైనార్టీలకు అందేలా కృషి చేస్తానని అన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాషా, జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపారాణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, షేక్ రఫీ, గౌస్ పీరా, షేక్‌బాషా, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.



షేక్ సాంబశివరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న చెరుకూరి తిరుపతిరావు

మాతృ భాషా వికాసానికి కృషి చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్, పి.రామచంద్రరాజు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాతృ భాషా వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి జరిగే ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రికను కలెక్టరేట్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సమన్వయకర్త పి.రామచంద్రరాజు అందజేశారు. మహాసభల కార్యక్రమంతో పాటు దేశ విదేశాల నుంచి వచ్చే ముఖ్య అతిథులకు జరిపే విస్తృత ఏర్పాట్ల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, ప్రపంచ తెలుగు మహాసభలు జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సభల నిర్వహణకు సంపూర్ణ సాకారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

● ఎమ్మెల్యే నసీర్



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలను చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో ఏర్పాటు చేసిన లెర్నింగ్ విస్టా సైన్స్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఉత్తమ శాస్త్రవేత్తలు పాఠశాలల నుంచే వెలుగులోకి వస్తారన్నారు. ఇటువంటి శాస్త్రీయ కార్యక్రమాలు తరుచుగా జరగాలని ఆకాంక్షించారు. ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే నసీర్ ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు బహుమతిని ప్రకటించి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ ఇస్లామియా ట్రెజరర్ జాహిద్, డైరెక్టర్లు డాక్టర్ అన్వర్ హుస్సేన్, షేక్ షౌకత్, అంజుమన్ ఇస్లామియా ప్రధానోపాధ్యాయురాలు షాహినా బేగం తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్ దరఖాస్తులకు చొరవ చూపాలి

● టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ మధు కుమార్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీపీఎస్ దరఖాస్తు చేసుకునేలా లైసెన్స్ ఇంజినీర్లు, ప్లానింగ్ కార్యదర్శులు చొరవ చూపాలని పట్టణ ప్రణాళిక రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్ సూచించారు. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మించిన భవనాలను బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకొనే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గురువారం స్థానిక కాకాని రోడ్‌లోని ఏఎస్ కన్వెన్షన్ హాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు, ఎల్టీపీలతో బీపీఎస్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ, నిర్దేశిత అనుమతిలేని, అనుమతి తీసుకున్నా ప్లానుకు భి న్నంగా నిర్మించిన భవనాలను యజమానులు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అలాగే అనుమతి లేని లేఅవుట్‌లో నిర్మాణం చేసిన భవనాలు కూ డా ఎల్ఆర్ఎస్ పీనల్ చార్జీలు చెల్లించి, ఎల్ఆర్ఎస్ నివంధనలకు లోబడి క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జీఎంసీ డిప్యూటీ సిటీప్లానర్ సూరజ్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారులు, లైసెన్స్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాదర్బార్ సభ్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాటలు అన్ని తరాలను అలరిస్తాయని కళాదర్బార్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు అన్నారు. ఘంటసాల 103వ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక నాజ్ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొత్తూరి రంగారావు మాట్లాడుతూ, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఘంటసాల ప్రతిభ చాటుకున్నారన్నారు. దాదాపు మూడు వేలపాటలు ఆలపించిన ఆయన దేశ, విదేశాల్లో ఆదరణ పొందారని అన్నారు. నేటి తరం యువత కూడా ఘంటసాల పాటలను ఆదరించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాదర్బార్ సభ్యులు భానుప్రకాష్, పి.వేణుగోపాల్, చంద్రబాబు, బాబురావు, ఖాదర్, సధీర్ బాబు, జమదగ్ని, హనుమాన్ సింగ్, ధర్మాసింగ్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత జగత్తులో మహారాజు ఘంటసాల

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాజు ఘంటసాల వెంకటేశ్వరరావు అని అవగాహన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ బిళ్ళా అశోక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 13వేలకు పైగా పాటలు పాడి సంగీత అభిమానులను ఓలలాడించారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, రాజశేఖర్, ఆచారి, పీఎస్ మూర్తి, అప్పారావు, రాజేశ్వరి తదితరులున్నారు.

దళారుల ప్రమేయం లేకుండా చూడాలి



మాట్లాడుతున్న అజయ్, పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దళారుల ప్రభావంతో రైతులకు మద్దతు ధర అందడం లేదన్నారు. సీసీఐ ప్రవేశపెట్టిన నూతన నియమావళి దళారులకు అనుకూలంగా మారిందన్నారు. తేమ శాతం, తూకాల్లో మోసం చేస్తూ క్వింటాలుకు రూ.2వేల వరకు కోత పెడుతున్నారని అన్నారు. దళారుల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ, రైతుల ఇంటి వద్దే పత్తి కొనుగోళ్లు జరగాలన్నారు. తేమశాతం 20శాతం పెంచి కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం నవభారత్‌నగర్ 1/1వ లైను నుంచి 1/4వ లైను వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్ గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలానే ఆర్టీసీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బి ఆర్ స్టేడియం అంకమ్మతల్లి ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయం, బావాజీమఠం, ఆలీనగర్, ముగ్దుం నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పి రమేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.





ఆకట్టుకున్న ఆంధ్ర ఏకలవ్య

- కరతాళ నీరాజనం అందుకున్న 'ఆపరేషన్ సిందూర్'
- కేఎల్‌యూలో 2వ రోజు ఉద్భవ్ ఉత్సవం
- 22 పతకాలతో ప్రథమ స్థానంలో ఒడిశా
- 20 పతకాలతో ద్వితీయ స్థానంలో తెలంగాణ

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివ ర్సిటీలో ఉద్భవ్ - 2025 గిరిజన వేడుకల్లో భాగంగా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ, సంస్కృతి కళా ఉత్సవంలో రెండవ రోజు గురువారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. 49 ఈవెం ట్లలో ఇప్పటి వరకు 29 ఈవెంట్లు పూర్తి కాగా 22 పతకాలతో ప్రథమ స్థానంలో ఒడిశా, 20 పతకాలతో రెండవ స్థానంలో తెలంగాణ నిలిచింది. 11 పతకాలు సాధించి 5వ స్థానంలో ఆతి థ్య ఆంధ్రప్రదేశ్ నిలిచింది. 16 పతకాలతో సిక్కిం 3వ స్థానం, 13 పతకాలతో ఉత్తరాఖండ్ 4వ స్థానం దక్కించుకున్నాయి. శాస్త్రియ సంగీతం, ఆసు కవిత్వ విభాగాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పసిడి పతకం దక్కింది. దేశభక్తి, గ్రూప్ సాంగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు 3వ స్థానం దక్కింది. గురువారం సీనియర్స్, జూనియర్స్ విభాగంలో గిరిజన పాట లు, సంస్కృత శ్లోకాలు, కవితా పఠనం, ఆంగ్ల పద్యాలు, క్విజ్, హిందీ, ఆంగ్లంలో వక్తృత్వం, దైవభక్తి గీతాలు, జానపద గేయాలు, సంగీత వాయి ద్యాల కచేరి, నృత్య నాటక, సంగీత, దృశ్య కళల ద్వారా సంప్రదాయ కథనాల వక్త పోటీలు, మిమిక్రీ, క్లాసికల్ సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. శుక్రవారం 9 విభాగాలలో పోటీలను నిర్వహించి సాయం త్రానికి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

నేడు ముగింపు

ఉద్భవ్ 2025 కార్యక్రమం శుక్రవారం ముగి యనుంది. చివరి రోజున 9 విభాగాలలో పోటీలు జరగనున్నాయి. రీజినల్ ట్రైబల్ డ్యాన్స్, కర్ణాటక సంగీత గానం, జానపద సంగీతం, నాటిక, ఆర్కెస్ట్రా విభాగాలకు పోటీలు జరగనున్నాయి.

అలరించిన ఏకలవ్య, ఆపరేషన్ సిందూర్ నాటికలు

నాటిక ప్రదర్శనలలో ఆంధ్రప్రదేశ్ నుంచి లక్ష్య సాధనలో ఏకాగ్రత, గురుభక్తి ఎంత ప్రాముఖ్యత వహిస్తాయో తెలుపుతూ ఏకలవ్యుడు, ద్రోణాచార్యుడు, కథాంశంతో ఏపీ ఈఎంఆర్ఎస్ విద్యార్థుల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. పహల్గాం దాడిలో మరణించిన వారికి నివాళిగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూ ర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ ముర ళీ నాయక్ జీవిత చరిత్రను, పోరాట పటిమను నాటిక రూపంలో తెలంగాణ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడంతో ఆడి టోరియం మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది. మ హిళకు చదువు ఎంత ముఖ్యమన్నది జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే జీవితకథను నాటిక రూపంలో మహారాష్ట్ర విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. ఇలా..... ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థులు విభిన్న కోణాలలో ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, ఇతర గిరిజన సంక్షేమ శాఖ నెస్ట్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.





పాటలు పాడుతున్న విద్యార్థినులు

సినీనటుడు బ్రహ్మానందంకు బొల్లిముంత పురస్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందంకు బొల్లిముంత శివరామకృష్ణ జాతీయ స్థాయి జీవితకాల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. అంతర్జాతీయ రంగస్థల కళాకారుడు, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు రంగస్థల విశిష్ట కళా పురస్కారం ప్రదానం చేస్తారు. గుంటూరు జిల్లా తెనాలిలో శని, ఆదివారాలలో బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు జరుగుతాయని ఫౌండేషన్ కన్వీనర్ చందు సుబ్బారావు గురువారం తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగే ఈ ఉత్సవాలలో కూచిపూడి నాట్య కళాకారులు 500 మందితో ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ప్రజా సాహితీ సంపాదకుడు కొత్తపల్లి రఘుబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏఎన్‌యూ విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఐజీ త్రివిక్రమ్ వర్మ



ప్రతిజ్ఞ చేస్తున్న ఐజీ త్రివిక్రమ్ వర్మ తదితరులు

ఏఎన్‌యూ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐజీ త్రివిక్రమ్ వర్మ సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గురువారం ఆర్ట్స్, సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి ఐజీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు యువత వద్ద లభించినా.. లేక రవాణా చేసినా.. నాన్ బెయిలబుల్ కేసుల కిందకు వస్తుందని చెప్పారు. నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సెంటర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తుందని, యువత ఒక్కసారి మాదకద్రవ్యాల కేసులో చిక్కుకుంటే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ తాత్కాలిక ఉపకుల పతి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ర్యాగింగ్, మాదకద్రవ్యాల రహిత విశ్వవిద్యాల యంగా ఏఎన్‌యూ పేరుగాంచిందన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవడంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సూచించారు. రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ అవకాశాలు లభించే సర్టిఫికెట్ కోర్సులను చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించేం దుకు.. విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు. ప్రపంచ దేశాల కంటే భారత్‌లో యువశక్తి అ ధికంగా ఉందని, ఈ యువ శక్తిని దేశం సద్వినియోగం చేసుకుంటే ప్రపంచ దేశాల కంటే భారత్ ఉన్నతమైనదిగా తయారవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధకం ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఓఎస్డీ ఆచార్య రవికుమార్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీవీఐటీ యూనివర్సిటీలో సందడి చేస్తున్న శంభాల చిత్ర బృందం

మంచి కథకోసం ఎదురు చూశా

సినీ నటుడు ఆది సాయికుమార్

వీవీఐటీయూలో శంబాల సందడి

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నటుడు ఆది సాయి కుమార్, అర్చన అయ్యర్, స్వశిక ప్రధాన పాత్రల్లో.. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన థ్రిల్లర్ శంబాల చిత్ర బృందం వీవీఐ టీ యూనివర్సిటీలో గురువారం సందడి చేసింది. ఈ నెల 25న సినిమా విడుదల నేపథ్యంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా వ ర్సిటీ విద్యార్థులతో నటీనటులు ముచ్చటించారు. హీరో ఆది మాట్లాడుతూ ఈ చిత్రం ఆద్యంతం వినూత్నంగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. మంచి కథ కోసం చాలా సంవత్సరాలు ఎదురు చూశానని, ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్టెప్పులేసి.. సెల్ఫీలతో సందడి చేశారు. హీరోయిన్ అర్చన అయ్యర్, దర్శకుడు యుగంధర్, వర్సిటీ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పీజీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ కళాశాలల్లో ఏపీ పీజీ సెట్-2025 కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్ కోటా కింద ఎంఏ, ఎమ్మెస్సీ, ఎం.కామ్ తదితర కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ఉన్నత విద్యాశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ జీవో నంబరు 230ను గురువారం జారీ చేశారు. ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి కన్వీనర్ కోటా కింద ఖాళీ సీట్ల భర్తీపై రాసిన లేఖను పరిశీలించిన అనంతరం స్పాట్ ప్రవేశాలకు అనుమతిచ్చామని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్పీడ్.. యాక్సిస్ రోడ్డు పనులు

- ఫేజ్- 2లో కి.మీ. మేర సెంటర్ కారిడార్ రోడ్డు పూర్తి



సీడ్‌యాక్సిస్ రోడ్డులో మొదలైన తారురోడ్డు నిర్మాణం

- మంతెన ఆశ్రమం నుంచి సీఎం ఇంటి వరకు పొడిగింపు
- అనుసంధానంగా రెండు అప్రోచ్‌లు
- కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాలు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రహదారి వ్యవస్థలో అత్యంత ప్రధానమైన సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనుల్లో మరో ముందడుగు పడింది. ఇప్పటి వరకూ దొండపాడు నుంచి వెంకటపాలెంలోని మంతెన ఆశ్రమం వరకు ఉన్న రోడ్డును దాదాపు ఉండవల్లిలోని సీఎం ఇంటి వరకు విస్తరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీడ్ యాక్సిస్ రోడ్డు ఫేజ్-2 పనులు మొదలైన ఆరు నెలల్లో వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డుకు సంబంధించి సెంటర్ కారిడార్‌లోని 3 లేన్ల రోడ్డుకు సంబంధించి కిలోమీటరు మేర తారు రోడ్డు పనులు జరుగుతున్నాయి.

● మూడు దశల్లో రోడ్డు నిర్మాణం

రాజధాని అమరావతిలోని దొండపాడు నుంచి తాడేపల్లిలోని ఎన్‌హెచ్ 16 వరకు సీడ్ యాక్సిస్ రోడ్డును మూడు దశల్లో నిర్మిస్తున్నారు. తొలి దశలో ఫేజ్- 1 కింద దొండపాడు నుంచి వెంకటపాలెంలోని మంతెన సత్యనారాయణ పకృతి ఆశ్రమం వరకు 14.350 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం జరిగింది. మూడు కారిడార్లుగా 9 లేన్లలో 2019కి ముందే ఈ రోడ్డును నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫేజ్-2 కింద మంతెన సత్యనారాయణ ఆశ్రమం నుంచి ఉండవల్లి లోని కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వెనుక భాగం వరకు 4 కి.మీ. మేర రోడ్డును విస్తరించనున్నారు. ఫేజ్-3 కింద అక్కడి నుంచి తాడేపల్లిలోని కనకదుర్గమ్మ వారధి వరకు రోడ్డును విస్తరిస్తారు. అయితే 2019కి ముందే ఫేజ్- 1 పనులు పూర్తయ్యాయి. పెనుమాక, ఉండవల్లి గ్రామాలకు చెందిన పలు వురు రైతులు అప్పట్లో భూసమీకరణ కింద భూములిచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డు నిర్మాణం అక్కడితో ఆగిపోయింది. తాజాగా ఆ పనులు గాడిన పడ్డాయి. భూసమీకరణకు రైతులు ముందుకు రావడంతో పనుల్లో వేగం పెరిగింది. కేవలం ఆరు నెలల వ్యవధిలో మెర క వేసి, వివిధ దశల్లో రోడ్డును నిర్మించి గురు వారం తారు వేస్తున్నారు. తొలిరోజు 160మీ. మేర సెంట్రల్ కారిడార్‌లోని 3 లేన్ల రోడ్డుకు తారు వేశారు. శుక్ర, శనివారాల్లో మిగిలిన రోడ్డును పూర్తిచేయనున్నారు. కాగా ఒక చోట 80 మీటర్ల మేర భూమి రాకపోవడంతో అక్కడ బీటీ రోడ్డుతో సరిపుచ్చుతున్నారు. కాగా దీనికి సంబంధించి పూలింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలో ఆ పని కూడా పూర్తవుతుందని సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్డును కలిపేందుకు.. సీఎం ఇంటి వెనుక భాగంలో కరకట్ట నుంచి ఒక అప్రోచ్ రోడ్డు, ఉండవల్లి నుంచి కరకట్ట వచ్చే రోడ్డు నుంచి మరో అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

● మౌలిక సదుపాయాలు

సీడ్ యాక్సిస్ రోడ్డులోని కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయి. ఈ రెండు కారిడార్లలో మురుగునీటి డ్రెయిన్, వరద నీటి డ్రెయిన్, మంచినీటి పైపులైను, భూగర్భ విద్యుత్, కమ్యూనికేషన్ లైన్లు, యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందువల్ల అక్కడ బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఏడీసీ చేపట్టింది.

కూలీల కొరత

- రోజు రోజుకు భారంగా సేద్యం కూలీలు
- 40, 50 ఏళ్లు పైబడిన వారే
- ఉపాధి పథకం అనుసంధానంతో సమస్య పరిష్కారం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల కొరత పెరుగుతోంది. దీంతో అధిక శాతం రైతులు తమ భూములను కౌలుకు ఇచ్చేస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయించేందుకు.. రైతులు కూలీల ఇళ్లకు ఆటోలు, ట్రాక్టర్లు పంపించడం.. పని ప్రదేశంలో మినరల్ వాటర్, శీతల పానీయాలు అందించడం విశేషం.



నరసరావుపేట మండలం పాలపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

కాంట్రాక్ట్ పనులు

రోజువారీ కూలీ విధానానికి కాలం చెల్లింది. ఇప్పుడంతా కాంట్రాక్టు పద్ధతి నడుస్తోంది. వ్యవసాయానికి డిమాండ్‌ను బట్టి కూలీ రేట్లు వచ్చేశాయి. విత్తనాలు నాటడం దగ్గర నుంచి కోతల వరకు అన్ని పనులకు కాంట్రాక్టు విధానమే. వ్యవసాయ పనులు త్వరగా చేయించుకోవాలనే ఆత్రుతతో రైతుల మధ్యే పోటీ నెలకొని కూలీల రేట్లు పెంచేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోయి నష్టాల పాలవుతున్నారు.

ఉపాధికి పట్టణాల బాట

గ్రామాల్లో చదువుకున్న యువత ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వెళుతున్నారు. కూలి పనులు చేసుకునే వారు సైతం ఉపాధి అవకాశాల కోసం పట్టణాల బాటపడుతు న్నారు. ప్రస్తుతం గ్రామాల్లో 40, 50 ఏళ్లు పైబడిన వారే వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు.

ఉపాధి పథకానికి అనుసంధానం చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల కూలీల కొరతకు కొంత పరిష్కారం దొరుకుతుందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. నాట్లు, కోతలు, మొక్కజొన్న కండెలు విరిచేటప్పుడు, మిర్చి కోతలకు రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం.

ప్రభుత్వాలు మేల్కోవాలి

కూలీలు దొరక్క నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలీల కొరతతో సాగు కొనసాగడం కష్టం. పరిష్కారానికి ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.


-అల్లూరి కోటేశ్వరరావు, రైతు, ఇసప్పాలెం.

వంటగదికి ఊరట!

- దిగొచ్చిన కూరగాయల ధరలు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు ప్ర స్తుతం దిగొచ్చాయి. కొన్ని రోజులు హడలెత్తించిన ధరలు సాధారణ స్థితికి చేరుకోవటంతో సామన్య ప్రజలకు ఊరట కలిగినట్లయింది. పంట దిగుబడి పెరగడం, మార్కెట్‌కు పెద్ద ఎత్తున కూరగాయల ఉత్పత్తులు రావడంతో ధరలు దిగొచ్చాయి. మొన్నటి వరకు టమోటా కేజీ రూ.80 విక్రయించగా ప్రస్తుతం రూ.40కు చేరుకుంది. సన్నరకమైతే రూ.30కే విక్రయిస్తున్నారు. ఇక క్యారెట్ కేజీ రూ.100 పైనే విక్రయించారు. ప్రస్తుతం రూ.80 చెబుతున్నారు. ఇక దొండ కాయ ఒక దశలో రూ.80కు విక్రయించగా ప్రస్తుతం ధర సగానికి పడిపోయింది. ఇక బెండకాయలు కూడా గతంలో కేజీ రూ.60లకు విక్రయించగా ప్రస్తుతం రూ.40 వరకు అమ్ముతున్నారు. వంకాయ కేజీ ధర రూ.80 నుంచి రూ. 30కి పడిపోయింది. తాజాగా తగ్గిన కూరగాయల ధరలతో వంట ఖర్చు.. సామాన్యలకు కొంత తగ్గి.. ఆర్థిక భారం తప్పనుంది.





8న శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ పుణ్యతిథి

సింహగురు

శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయంలో 31వ ఆచార్యులు. ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమాన్ని (ఇస్కాన్) స్థాపించిన ఏ.సి. భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాద ఆయన శిష్యుల్లో ప్రసిద్ధులు. సరస్వతి ఠాకూర్ బాల్యనామం బిమల ప్రసాద్ దత్తా. ఆయన తండ్రి ఠాకూర్ భక్తి వినోద... ఆ రోజుల్లో ప్రభావవంతమైన ఆచార్యుడు. శ్రీ చైతన్య మహాప్రభువు సందేశాన్ని ప్రపంచవ్యాప్తం చేయగల కుమారుని కోసం ఆయన భగవంతుణ్ణి ప్రార్థించారు. భక్తివినోద ఒడిశాలోని జగన్నాథ పూరీలో ప్రభుత్వ మేజిస్ట్రేట్‌గా పని చేస్తున్నప్పుడు... 1874 ఫిబ్రవరి ఆరున బిమల ప్రసాద్ అక్కడ జన్మించారు. బిమలప్రసాద్‌కు ఆరు నెలల వయసున్నప్పుడు... తండ్రి ఆయనను జగన్నాథుడి పాదాల దగ్గర ఉంచారు. అప్పుడు జగన్నాథుడి మెడలోని పెద్ద పూలదండ కిందపడి, ఆ బిడ్డ చుట్టూ అలంకృతమయింది. తండ్రి నుంచి హరేకృష్ణ మంత్రాన్ని, నరసింహదేవ మంత్రాన్ని పదేళ్ళ వయసులో ఉపదేశం పొందిన బిమల ప్రసాద్... 1901లో నవద్వీపంలో ప్రముఖ వైష్ణవ సాధువైన శ్రీల గౌరకిశోర దాస బాబాజీ మహారాజ్‌ను తన ఆధ్యాత్మిక గురువుగా స్వీకరించారు.

ఆధ్యాత్మికత అందరిదీ...

శ్రీచైతన్య మహాప్రభువు బోధనలకు నిబద్ధుడైన సరస్వతీ ఠాకూర్ వాటిని మన దేశంతో పాటు విదేశాలలో కూడా వ్యాప్తి చేశారు. వర్ణ, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. అలాంటి వ్యవస్థ సనాతన ధర్మం కాదని భగవద్గీత నుంచి ఆయన ఉదహరించారు. 1913లో దక్షిణ కలకత్తాలో భాగవత్ ప్రెస్‌ను ఆయన స్థాపించారు. మొత్తం 61 రచనలను ప్రచురించారు, సవరణలు చేశారు, రచించారు. ఎనిమిది వేర్వేరు పత్రికలను కూడా నడిపారు. 1918లో, 44 ఏళ్ళ వయసులో సన్యాసం స్వీకరించి, 'గోస్వామి మహారాజ్' అనే బిరుదును పొందారు. అదే రోజున శ్రీధామ మాయాపూర్‌లో తన మొదటి వైష్ణవ మఠాన్ని (చైతన్య మఠం) స్థాపించారు. అది ఆయన ప్రచారానికి ప్రధాన కార్యాలయంగా మారింది. తన జీవితకాలంలో దేశ విదేశాల్లో 64 గౌడీయ మఠాలను స్థాపించి, భాగవతతత్త్వాన్ని వ్యాప్తి చేశారు. ఆధ్యాత్మిక జీవితాన్ని స్వీకరించడానికి భౌతికమైన అర్హతలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కుల, లింగ, జాతీయతలకు అతీతంగా... గత నేపథ్యం ఎలా ఉన్నప్పటికీ... నిజాయితీగా ఆధ్యాత్మిక జీవితాన్ని కోరుకొనేవారందరికీ ఉపదేశాన్ని అందించారు

లోకానికి మంత్ర సందేశం

శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ ఎంతో శక్తిమంతులైన, ధైర్యవంతులైన ప్రచారకులు. అందుకే ఆయన 'సింహగురు'గా ప్రసిద్ధి చెందారు. 1919 నుంచి 1929 వరకూ నిరంతరాయంగా భారతదేశం అంతటా పర్యటించారు. అసంఖ్యాకమైన ఉపన్యాసాలు ఇచ్చారు. చర్చలు జరిపారు. అప్రమాణికమైన మత శాఖలను ఖండించి, తుడిచిపెట్టారు. భౌతిక సుఖాలను, సౌకర్యాలను విసర్జించి, భక్తి ప్రచారానికి జీవితాంతం కృషి చేసిన ఆయన 62 ఏళ్ళ వయసులో... మార్గశిర బహుళ చవితి రోజున... జగన్నాథ పూరీలో ఈ భౌతిక ప్రపంచాన్ని విడిచిపెట్టారు. కులం, మతం, లింగం, దేశంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి పవిత్ర నామాలను, 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించాలన్నదే ఆయన ఇచ్చిన ప్రధాన సందేశం.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9640086664

భగవద్గీత

గీత గుర్తుకురాదేం?

నేను భగవద్గీత చాలాసార్లు చదివాను. చాలామంది రాసిన వ్యాఖ్యానాలూ చదివాను. చాలా శ్లోకాలు, వాటి అర్థాలు కంఠతా వచ్చేశాయి. ఇప్పటికిప్పుడు అప్పచెప్పమంటే వంద శ్లోకాలైనా చెప్పేయగలను. ఎన్నోసార్లు సమావేశాల్లో మాట్లాడడానికి వెళ్ళినప్పుడు, ఆ సమావేశం సందర్భాన్ని బట్టి ఒకటి రెండు శ్లోకాలు చెప్పాలని ముందుగా అనుకొని, ప్రసంగం మొదలుపెట్టేవాణ్ణి. ప్రసంగం అయిపోయాక గుర్తుకువచ్చేది.. శ్లోకం చెప్పడం మరచిపోయానని! ఇలా కాదని... చిన్న కాగితం మీద రాసుకొని, జేబులో పెట్టుకొని, ప్రసంగం మొదలుపెట్టి... అదీ మరచిపోయేవాణ్ణి. అలా కొన్నాళ్ళు గడిచాక... 'భగవద్గీత చెప్పే అర్హత నాకు లేదేమో! అందుకే ఆ సమయానికి అలా అవుతోంది' అని బాధపడేవాణ్ణి. దేవుణ్ణి పూర్తిగా నమ్మే నేను... నాలాంటివాళ్ళు భగవద్గీతను ప్రస్తావించడం దేవుడికి నచ్చకే ఇలా జరుగుతోందేమోనని సమాధానపడేవాణ్ణి. 'నాలో ఏం తక్కువయిందని దేవుడు ఇలా సమయానికి గీత గుర్తుకురాకుండా చేస్తున్నాడో?' అని మదనపడేవాణ్ణి కూడా.

ఆ శాపం సంగతి నాకు తెలుసు...


కొన్నాళ్ళ క్రితం రష్యాలో ఒక కోర్టు... భగవద్గీతను 'హింసను ప్రేరేపించే గ్రంథం' అంటూ నిషేధించిందనే వార్త భగ్గుమంది. భగవద్గీతను నమ్మేవారు, చదివినవారు... మనవాళ్ళందరూ ఖండించారు. రష్యా కోర్టు ఆదేశాలను గర్హిస్తూ అప్పట్లో... లోక్‌సభలో చర్చ జరిగింది. ఆ చర్చలో మాట్లాడుతున్నవారు రష్యా కోర్టు తీర్పును, భగవద్గీత గొప్పతనాన్ని చెబుతున్నారే తప్ప... అందులో ఒక శ్లోకాన్నీ చెప్పలేదు. మేమందరం కూర్చొని వింటున్నాం. అప్పటికే ఆరుసార్లు ఎంపీ అయిన సాయిప్రతాప్ (రాజంపేట) నాకు పాతికేళ్ళకుపైగా మంచి మిత్రుడు. అప్పుడప్పుడు మేమిద్దరమే ఉన్నప్పుడు.. భగవద్గీత శ్లోకాలు చెబుతూ ఉండేవాణ్ణి. ఆయనకు కూడా చాలా ఆసక్తి. "నువ్వు లేచి నాలుగు శ్లోకాలు చదువు అరుణ్" అన్నాడాయన. నా పక్కనే కూర్చున్న విశాఖపట్నం (అప్పటి) ఎంపీ సబ్బం హరి "లేలే! ఇప్పుడు కాకపోతే నీ భగవద్గీత ఇంకెప్పుడు పనికొస్తుంది?" అని తొందరపెట్టాడు. నేను "వద్దు, వద్దు" అన్నాను. నా బలహీనత నాకు తెలుసు. మొదలుపెట్టిన తరువాత ఏ శ్లోకమూ గుర్తుకురాదు. ఆ శాపం సంగతి నాకే తెలుసు!

గీతాప్రచారకుణ్ణి అయిపోయాను....

ఈలోపున సాయిప్రతాప్ వెళ్ళి... (అప్పటి) పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి పవన్ బన్సల్‌కు నా పేరు ఇచ్చి వచ్చేశారు. స్పీకర్ నా పేరు పిలిచారు. అప్పుడు "యదృచ్ఛా లాభసంతుష్టో" అనే శ్లోకంతో మొదలుపెట్టాను. సభలో ఊహించని స్పందన కనిపించింది. ఇంకో శ్లోకం చెప్పాను. ఆ రోజు నా ప్రసంగం తరువాత... లోక్‌సభలో తెలుగేతర సభ్యులందరికీ నేను గీతాప్రచారకుడిగా పరిచయమైపోయాను. నాకే ఆశ్చర్యం వేసింది. ఇంకా శ్లోకాలు గుర్తుకు వచ్చేస్తున్నాయి. 'అంటే... ఏ వేదికమీద శ్లోకం అవసరమో అక్కడే గీత గుర్తుకు వచ్చేలా దేవుడు ఏర్పాటు చేశాడన్నమాట' అనుకున్నాను. అంతకుముందు... రోజూ నోట్లో ఆడుతూ ఉండే ఎన్నో శ్లోకాలు ఉపన్యాసంలో చెబుదామంటే గుర్తుకు రాకపోవడం అనేది నాకు అర్థం కాని పజిల్‌గానే మిగిలిపోయింది.

ఆయనే నా వల్ల కాదన్నాడు...

ఆ తరువాత 'యత్ తద్ భగవతా ప్రోక్తం', 'శ్రావితస్త్వం మయా గుహ్యం...' తదితర శ్లోకాలు చదివాక... ఆ పజిల్ కొంతవరకూ విడిపోయింది. వాటి సారాంశం ఏమిటంటే.... "యుద్ధంలో చెప్పావే... అవే మళ్ళీ ఒక్కసారి చెప్పు కృష్ణా!" అని అడిగాడు అర్జునుడు. "అప్పుడు చెప్పాను గానీ... ఇప్పుడు మళ్ళీ చెప్పమంటే ఎలా?" అన్నాడు కృష్ణుడు. "అప్పుడు ఒత్తిడిలో ఉండడం వల్ల సరిగ్గా బుర్రకెక్కలేదు. మళ్ళీ ఒకసారి చెప్పించుకోవాలని అప్పట్నుంచీ అనుకుంటున్నాను" అని చెప్పాడు అర్జునుడు. "చాల్చాల్లే!



అంత వివరంగా ధర్మసూక్ష్మాలను చెబితే... ఇప్పుడు మళ్ళీ చెప్పమంటావా... అది నావల్ల అయ్యే పని కాదు" అన్నాడు కృష్ణుడు. చెప్పడానికి చికాకువేసి ఆయన అలా అన్నాడేమో అనుకోవడానికి లేదు. ఎందుకంటే యుద్ధం మొదట్లో చెప్పిన గీత మళ్ళీ చెప్పలేదు గానీ... దానికి బదులు అలాంటిదే 'బ్రాహ్మణ గీత' మొత్తం చెప్పాడు. సాక్షాత్తూ కృష్ణ పరమాత్మే "మళ్ళీ చెప్పమంటే నా వల్లకాదు" అన్న గీత... సామాన్యుణ్ణి... నాకు గుర్తుకురాకపోతే బాధెందుకు! మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చేవరకూ బట్టీపట్టడమే!

ఉండవల్లి అరుణ్‌కుమార్

దైవమార్గం



అప్పుడే భక్తి పరిపూర్ణం

దేవుడు ప్రేమమయుడు. సర్వ జీవుల మీదా ఆయన ప్రేమ నిరవధికంగా, సమానంగా ప్రసరిస్తూ ఉంటుంది. ఆయన ప్రేమే ఈ విశాల విశ్వంగా రూపుదిద్దుకుంది. మానవులందరూ తన పట్ల, తోటి మానవుల పట్ల ప్రేమతో ఉండాలని ఆయన ఆశించాడు. "నీవు నిండు హృదయంతో నీ దేవుణ్ణి ఆరాధించు, ప్రేమించు", "నిన్ను ప్రేమించుకున్నట్టే నీ పొరుగువాణ్ణి ప్రేమించు, సేవించు" అనే రెండు వాక్యాలు బైబిల్‌లో ఉన్నాయి. వాటిలో ఒకటి దైవ ప్రేమకు, మరొకటి మానవ సేవకు సంకేతాలుగా కనిపిస్తాయి.

తాను ఎంతో ప్రేమించే ఈ లోకం భ్రష్టమవుతూ ఉంటే, దాన్ని పునరుద్ధరించాలని దేవుడు సంకల్పించాడు. తాను సృష్టించిన ఈ సుందర విశ్వానికి భంగం కలిగి, తనపై శపథం చేసిన సాతాను పన్నిన వలలో తన బిడ్డలు చిక్కుకొని భ్రష్టులయ్యే దశలో... లోకోద్ధరణ కోసం తన కుమారుడైన క్రీస్తును మానవ లోకానికి పంపించాడు. ఈ లోకం పట్ల ప్రేమతో ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేశాడు. ప్రభువు జననం, ఆయన చేసిన బోధలు, చూపిన మార్గం... ఇవన్నీ మానవుల పట్ల దైవానికి ఉన్న ప్రేమకు తార్కాణాలు. దీనిని క్రీస్తు జననంలోని పరమ రహస్యంగా క్రైస్తవులు విశ్వసిస్తారు. క్రిస్మస్‌కు ముందు నెలరోజులు... తెల్లవారుజామున ప్రార్థనలు చేస్తారు. రాబోయే దైవకుమారుడికి స్వాగతం చెప్పడానికి నిరీక్షిస్తారు.

ప్రభువులోని ప్రేమతత్త్వమే ఈ విశ్వంలో సేవగా పరిణమించింది. దేవునిపై ఉండే ప్రేమ సాటి మానవుడికి చేసే సేవగా రూపాంతరం చెందాలి. అప్పుడే దైవ భక్తి పరిపూర్ణం అవుతుంది. దేవుణ్ణి ప్రేమించే కొద్దీ విశ్వాన్ని ప్రేమిస్తాం, సేవిస్తాం. కాబట్టి దేవుణ్ణి ప్రేమించడం ఎంత ప్రధానమో... మన తోటివారిని ప్రేమించడం కూడా అంతే ముఖ్యం. ప్రేమించడం నేర్చినవాడు సేవను కూడా అలవోకగా నేర్చుకుంటాడు. దైవ ప్రేమ మానవసేవగా పరిణమించే క్రమం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

యోగా

ఇగో... మంచీ చెడూ


'ఇగో' అనే పదానికి తెలుగులో 'అహం', 'అహంకారం', 'గర్వం' అనే అర్థాలు కనిపిస్తాయి. చాలామంది ఇగో అనే భావన ఒక వ్యక్తికి తప్పనిసరిగా ఉండాలని అనుకుంటూ ఉంటారు. వాస్తవానికి 'ఇగో' ఒక వ్యక్తి అస్తిత్వాన్ని నిలబెట్టే ఒక పరికరం. కత్తికి రెండు వైపులా పదును ఉన్నట్లు- ఈ 'ఇగో' మనిషిని గొప్పవాడినీ చేయగలదు. అతనిని పతనం అంచునా నిలబెట్టగలదు. 'ఇగో' అనే పదానికి మూడు అర్థాలు చెప్పుకున్నాం కదా... ఈ మూడు సమానార్థకాలు కావు. 'అహం' అంటే నేను. ఒక వ్యక్తి ఆత్మదర్శనానికి ఇది ప్రవేశద్వారంలాంటిది. 'అహంకారం' అంటే- 'నేను మాత్రమే' అనే భావన. దీనివల్ల కొంత మేలు జరుగుతూ ఉంటుంది. ఇది చెడుకు కూడా కారణమవుతుంది. ఇక మూడోది 'గర్వం'. ఇది ఒక వ్యక్తి పతనానికి రాజమార్గం. ఇది ఒక వ్యక్తి ఆలోచనా ధోరణిని, వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. అంతేకాదు. అతని వ్యక్తిగతమైన, వృత్తిపరమైన, సామాజికపరమైన సంబంధాలను తుంచేస్తుంది. దీనివల్ల అనేక ప్రతికూల ఫలితాలు కలుగుతాయి. మన జీవితంలో మనకు ఎదురయ్యే సమస్యలు, దంపతుల మధ్య వచ్చే విభేదాలు, ఆఫీసుల్లో గొడవలు- వీటన్నింటికీ ఇదే కారణం. ఇది వ్యక్తుల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంది.

పొంచి ఉన్న ప్రమాదం...

బాగా తెలివితేటలు ఉన్నవారందరినీ ఒక వేదికపైకి చేర్చి వారందరితోనూ పనిచేయించాలని అనుకోవడం సులభమే! దీనివల్ల కొన్ని కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. గొప్ప ఆలోచనలు పెల్లుబుకుతాయి. కానీ ఇవన్నీ జరగాలంటే ఆ సమూహంలో ఉన్న వ్యక్తులు తమ తమ ఇగోలను వదిలేయాల్సి ఉంటుంది. అప్పుడే ఇతరుల ఆలోచనలను, అభిప్రాయాలను స్వాగతించగలుగుతారు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి కూడా 'ఇగో' ఒక పెద్ద అడ్డంకి అనే చెప్పాలి. మనకు తెలియని, మనకన్నా గొప్ప శక్తిని చేరుకొనే పరిణామక్రమంలో వారు- 'నేను' అనే భావనను వదిలేయాల్సి ఉంటుంది. ఆ భావన వదిలేయకపోతే ఆ గొప్ప శక్తిలో మమేకం కాలేరు. మానవ లక్షణాలను వదిలేసి దైవ లక్షణాలను పొందే పరిణామక్రమంలో ఇగో అడ్డంపడుతుందని, దానిని వదిలేయగలిగినప్పుడే... పరమాత్మలో ఆత్మ విలీనం అయి- ఏకత్వ భావన సాధ్యమవుతుందని 'హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన' సంప్రదాయం చెబుతుంది. ఆ స్థితికి చేరుకున్నప్పుడు భౌతిక ప్రపంచంలో మన చుట్టూ జరిగే రకరకాల కార్యకలాపాలను సానుకూల ధోరణితో చూడగలుగుతాం.

ధ్యానమే మార్గం

నేను ఒక కార్డియాలజిస్ట్‌ను కాబట్టి నా దగ్గరకు అనేక మంది రకరకాల సమస్యలతో వస్తూ ఉంటారు. చికిత్స చేసినప్పుడు వారికి ఆరోగ్యం బాగుపడుతుంది. మళ్లీ సంతోషంగా జీవించగలుగుతూ ఉంటారు. 'నా వల్లే వారికి ఆరోగ్యం మెరుగుపడింది కాబట్టి.. నేను గొప్పవాణ్ణి' అనే భావన పెరిగిపోతే అది అనేక అనర్థాలకు దారి తీస్తుంది. అన్ని వృత్తుల్లో ఉన్నవారికీ ఇది వర్తిస్తుంది. 'ఇగో' పెరగడం వల్ల కొత్త ఆలోచనలకు స్వాగతించలేం. కొత్త ఆలోచనలను స్వాగతించకపోతే కొత్త సిద్ధాంతాలు.. ఆవిష్కరణలు అర్థం కావు. కొత్తగా నేర్చుకోవాలనే ఆలోచన రాకుండా ఇగో అడ్డం పడుతూ ఉంటుంది. తెలిసో తెలియకుండానో ఆ మార్గంలో ప్రయాణించడం మొదలుపెడితే వచ్చే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. కాబట్టి 'ఇగో'ను దూరంగా పెడితేనే మనం వ్యక్తిగత జీవితంలో, వృత్తిపరమైన జీవితంలో రాణించగలుగుతాం. ఈ స్థితికి చేరుకోవాలంటే 'ధ్యానం' ఒకటే మార్గం.



డాక్టర్ శరత్‌రెడ్డి
కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్
9440087532

తెలుసుకుందాం



విగ్రహం వీటితో శ్రేష్ఠం

భగవంతుడి శక్తిని విశేషంగా గ్రహించే వాటినే 'విగ్రహాలు' అంటారు. అంతటి మహిమాన్వితమైన విగ్రహాలను ఎలా, ఏయే వస్తువులతో తయారు చెయ్యాలి?... ఈ సందేహాలకు ప్రాచీన శాస్త్రాలు చక్కని వివరణ ఇచ్చి, మార్గదర్శనం చేశాయి. ఆ వస్తువులకు 'ప్రతిమా ద్రవ్యాలు' అని పేరు. భగవంతుడు సర్వాంతర్యామి. ఆయన అణువణువునా ఉన్నప్పటికీ... శాస్త్రోక్త పద్ధతిలో, శాస్త్రం సూచించిన ద్రవ్యాలతో తయారు చేసిన విగ్రహాలలో విశేషమైన దైవ సాన్నిధ్యం లభిస్తుంది. అలాగే ఆయా ద్రవ్యాలతో తయారు చేసిన విగ్రహాలు తమవైన శుభ ఫలితాలను ఇస్తాయి. "రాయి, లోహం, ఇటుక, కొయ్య, మన్ను, సున్నం, దంతం, వర్ణం, నవపాషాణం, మైనం అనే పది మాత్రమే శిల్పానికి తగిన పదార్థాలు" అని ప్రతిమా ద్రవ్యాల గురించి 'పింగళి నిఘంటువు' అనే ప్రాచీన గ్రంథం వివరించింది.

రాయి: 'శిల నుంచి ఉద్భవించినదే శిల్పం' అనే నానుడి ఉంది. శిలతో చేసిన విగ్రహాలు గర్భాలయంలో మూల విగ్రహాలుగా, ఇతతర పరివార దేవతలుగా మనకు దర్శనం ఇస్తాయి. శిల్పి ఉలిని శిలపై తాకించినప్పుడు ఓంకార శబ్దంలా ఘంటానాదం వస్తే దాన్ని 'పురుష శిల' అనీ, అదే శబ్దం దీర్ఘంగా వస్తే 'స్త్రీ శిల' అనీ, ఘంటానాదం కాకుండా సత్తును మోగించినప్పుడు వచ్చే శబ్దం వస్తే 'నపుంసక శిల' అనీ అంటారు. 'శిలలో దైవత్వం ఉందా? లేదా?' అనే విషయాన్ని ఈ శబ్ద పరీక్ష ద్వారా ఏకాగ్రతతో స్థపతి పరీక్షిస్తారు. పురుష శిల అయితే పురుష దేవతా విగ్రహాల తయారీలో, స్త్రీ శిల అయితే స్త్రీ దేవతా విగ్రహాల తయారీలో వినియోగిస్తారు. శివలింగం తయారీలో... మధ్యలో ఉండే శివలింగాన్ని పురుష శిలతో, పానవట్టాన్ని/ఆధారపీఠాన్ని స్త్రీశిలతో తయారు చేయాలని శైవ ఆగమాలు చెబుతున్నాయి. శబ్ద పరీక్షలో విఫలమయిన రాయిని నపుంసక శిలగా గుర్తించి, గర్భాలయం నుంచి ప్రాకారం వరకూ నిర్మాణాలలో వినియోగిస్తారు.

లోహం: దేవతా విగ్రహాల తయారీల లోహాన్ని మరొక ప్రముఖమైన ద్రవ్యంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా దేవాలయాలలో లోహవిగ్రహాలు 'చలబింబాలు'గా పిలిచే ఉత్సవమూర్తులుగా ఆరాధనలు అందుకుంటాయి. అయితే... చిదంబరంలోని శ్రీనటరాజ స్వామి ఆలయంలో, శబరిమలలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ధృవమూర్తులుగా పూజలు అందుకుంటున్నవి లోహవిగ్రహాలే. వీటి తయారీకి రాగికన్నా వెండి, వెండికన్నా బంగారం ఉత్తమమైనవి. ఇటీవల హైదరాబాద్‌లో నిర్మించిన సమతామూర్తి ఆలయంలో నిత్యపూజలు అందుకుంటున్న శ్రీరామానుజుల ధృవబింబాన్ని 120 కిలోల బంగారాన్ని వినియోగించి... లోహమయంగా ప్రతిష్ఠించడం గమనించవచ్చు. లోహాలను తగుపాళ్ళలో కలిపి... పంచలోహ విగ్రహాలు తయారు చేసుకొని, ప్రాణప్రతిష్ఠ చేయకుండా ఆరాధించడం అనూచాన సంప్రదాయం. గృహస్థులు తమ ఇళ్ళలో నిత్యం ఆచరించే తిరువారాధన కోసం లోహవిగ్రహాలు మాత్రమే శ్రేష్ఠమైనవి. అవి కూడా నియమితమైన ఎత్తుకు మించకుండా చేయించుకోవాలి. శిలావిగ్రహాలను గృహాలలో అర్చించరు.

దంతం: ఏనుగు దంతంతో చాలా అందమైన విగ్రహాలు తయారు చేస్తారు. కానీ ఆ విగ్రహాలకు పూజలు చేయరు. అవి కేవలం అలంకారానికి మాత్రమే బాగుంటాయి. విలాసవంతంగా ఉంటాయి.

వర్ణం: వస్త్రంపై దేవతామూర్తుల రూపాన్ని బొమ్మ గీసి, దానికి వర్ణాలు అద్దుతారు. ఆ చిత్రాన్ని సైతం దేవుని మూర్తిగా భావించి పూజించవచ్చు.

నవపాషాణం: పాషాణం అంటే విషం. ఔషధ గుణాలను కూడా కలిగి ఉన్న అలాంటి తొమ్మిది పాషాణాలను... 'నవపాషాణాలు' అంటారు. ఆ తొమ్మిది ద్రవ్యాలను తగుపాళ్ళలో కలిపి, విగ్రహంగా మలచి పూజించవచ్చు. తమిళనాడు రాష్ట్రం పళనిలోని సుబ్రహ్మణ్యస్వామి మూర్తి నవపాషాణాలతో నిర్మితమయింది. ఆ స్వామికి చేసే పంచామృతాభిషేకం విశేషమైనదనీ, ఆ పంచామృతం సేవిస్తే పలు వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం.

ఇటుక: శ్రేష్ఠమైన మట్టితో విగ్రహాలు చేసి, వాటిని కాల్చి, గట్టిపరచిన విగ్రహాలు ఇష్టికామూర్తులు. ఇవి ప్రాచీన కాలంలో ఉండేవి. వీటిని ఆరాధించడం ద్వారా భక్తులు తమ అభీష్టాలను తీర్చుకొనేవారు. ఇష్టాలను తీర్చేవి కాబట్టి 'ఇష్టికా విగ్రహాలు' అనీ, కాలక్రమేణా 'ఇటుక విగ్రహాలు' అని వ్యవహరించేవారు. ఈ ఆధునిక కాలంలో ఇటువంటి విగ్రహాలు చాలా అరుదు.

రత్నం: మాణిక్యం, ముత్యం, పగడం, మరకతం, కనకపుష్యరాగం, వజ్రం, ఇంద్రనీలం, గోమేధికం, వైడూర్యం... ఇవి నవరత్నాలు. వీటిలో అతి పెద్ద పరిమాణంలో దొరికే రత్నాలను విగ్రహాలుగా మలచి పూజిస్తారు. గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో మరకత రాజరాజేశ్వరీ విగ్రహాన్ని చూడవచ్చు.

కొయ్య: కలప తయారు చేసిన విగ్రహాలను 'దారుబింబాలు' అంటారు. ప్రతిమల తయారీలో దారువుది కూడా ముఖ్య స్థానమే. కేవలం అలంకార విగ్రహాలే కాదు... పూరీ క్షేత్రంలోని జగన్నాథుడు దారుమూర్తే. కంచి అత్తి వరదరాజస్వామి విగ్రహాన్ని అత్తి కొయ్యతో తయారు చేశారు కాబట్టి వాటికి ఆ పేరు వచ్చింది. అంతేకాదు... ఎన్నో గ్రామాల్లో, వాడలలో గ్రామదేవతలు, దేవర విగ్రహాలను కొయ్యతోనే చేసి, స్థాపించి, పూజిస్తారు.

మన్ను: నదీ తీరాలు, తటాకాలు, చెరువుల గట్ల మీద దొరికే శ్రేష్ఠమైన ఒండ్రుమట్టితో చేసే విగ్రహాలు అతి పవిత్రమైనవి. తాత్కాలికంగా పూజించడం కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తారు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రుల్లో మట్టి విగ్రహాలను పూజించడం మనం చూస్తున్నాం.

సున్నం: తెల్లని సున్నపురాయిని బాగా కాల్చి పొడి చేస్తారు. ఆ సున్నపు పొడిలో కరక్కాయ పొడి, నాటు బెల్లం నీళ్ళు లాంటి మరిన్ని ద్రవ్యాలు కలుపుతారు. వాటిని తిప్పి మెత్తగా చేసి, విగ్రహాలు తయారు చేస్తారు. మన ప్రాచీన ఆలయాలలో విమాన శిఖరం మీద, మండపాల సాలహారాల మీద నిర్మించినవి ఈ సున్నపు బొమ్మలే. వీటిని 'సుధాబింబాలు' అంటారు. మరో విశేషం ఏమిటంటే... కొన్ని ప్రాచీనమైన గుడుల గర్భాలయాల్లో మూల విగ్రహాలుగా కూడా ఇవి నిత్య పూజలు అందుకుంటున్నాయి. అలా మూలవిగ్రహాలుగా ప్రాణప్రతిష్ఠ చేయవలసిన సుధాబింబాల తయారీకి శిల్ప శాస్త్రాలు చాలా కఠినమైన నియమాలను నిర్దేశించాయి. శూలస్థాపన, రజ్జుబంధనము, కల్కలేపనం లాంటి ప్రక్రియల ద్వారా ఆడించిన సున్నంలో... పదహారు వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మృత్తికలను సమ్మిళితం చేసి ఈ విగ్రహాలు తయారు చేయాలి.


డి.యన్.వి. ప్రసాద్
స్థపతి, 9440525788

ఆరోగ్య భాగ్యం

"దైవం మనకు ఇచ్చిన రెండు వరాల విషయంలో మానవులు చాలా నిర్లక్ష్యం వహిస్తారు. మొదటిది... మంచి ఆరోగ్యం. రెండోది... తీరిక" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పారు. మనలో చాలామంది ఆరోగ్యాన్ని పట్టించుకోరు. విశ్వాసి ఎప్పుడూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదని, అల్లాహ్‌కు బలహీనుడైన విశ్వాసి కన్నా బలమైన విశ్వాసినే ఇష్టపడతాడని ఒక హదీసు (ప్రవక్త సూక్తి) చెబుతోంది. "కృతజ్ఞత తెలిపే నాలుక, స్మరించే హృదయం, కష్టపడే శరీరం, మంచి గుణం కలిగిన జీవిత భాగస్వామి... ఎవరికైతే ఇవి ఉన్నాయో... వారికి ప్రపంచంలోని వరాలన్నీ లభించినట్టే" అని మహనీయుడైన హజ్రత్ ఆలీ ఒక సందర్భంలో చెప్పారు. వాటితోపాటు ఆరోగ్యం కూడా గొప్ప వరం.

ఆరోగ్యం బాగుంటే ప్రశాంతంగా, మనస్ఫూర్తిగా, శ్రద్ధగా దైవారాధన చేసుకోవచ్చు. ఇతరులకు సహాయపడవచ్చు. ఆహారం తీసుకోవడంలో హెచ్చుతగ్గులు అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయి. ఎక్కువగా తినడం మంచిదికాదని, దాన్ని నివారించుకోవాలనీ పలు హదీసులు చెప్పాయి. మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉంటే అన్ని పనులు స్వయంగా చేయగలడు, సత్కార్యాలు ఆచరించగలడు. చక్కగా ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు చేయగలడు. ఇతరులకు ఏదైనా అవసరాలు కలిగితే వాటిని తీర్చగలడు, వారి పనులలో సహాయపడగలడు. దివ్యఖుర్‌ఆన్ పారాయణ, దైవస్మరణ చేయగలడు. కానీ మనిషి అనారోగ్యానికి గురైతే బలహీనపడతాడు. శరీరాన్ని నిస్సత్తువ ఆవహిస్తుంది. చురుకుగా తిరిగే సామర్థ్యం ఉండదు. చివరకు తన పని తాను చేసుకోవడానికి కూడా ఇతరుల సహాయం తీసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భంలో అతను స్వయంగా ఏ సత్కార్యం చెయ్యలేడు. నమాజ్ చేయలేడు. ఉపవసాలు పాటించలేడు. వేరొకరికి సాయపడలేడు. అందుకే ఆరోగ్యం విషయంలో అందరం జాగ్రత్త వహించాలి. చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. సరైన అలవాట్లు లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటివి సాధారణంగా అనారోగ్యానికి దారి తీస్తాయి. అందుకే అనారోగ్యానికి ముందు ఉన్న ఆరోగ్యాన్ని మహా భాగ్యంగా భావించాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు.

సందేశం



• మహమ్మద్ వహీదుద్దీన్



తన్వీ

క్వార్టర్స్‌లో తన్వీ, అస్మిత

గువాహటి: భారత షట్లర్లు తన్వీ శర్మ, అస్మిత చలిహ గువాహటి మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్, 8వ సీడ్ క్రీడాకారిణి తన్వీ 21-17, 23-21 తేడాతో ఫన్నచెట్ (థాయ్‌లాండ్)ను వరుస గేముల్లో ఓడించింది. అలాగే 96వ ర్యాంకర్ అస్మిత 16-21, 21-17, 21-16 తేడాతో తనకన్నా మెరుగైన ప్లేయర్, భారత్‌కే చెందిన ఐదో సీడ్ అన్మోల్ ఖర్బ్ (49వ ర్యాంక్)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో నెగ్గిన ఇషానీ బారువా కూడా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.

శతక 'జో'రూ'ట్

- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 325/9
- స్టార్క్‌కు ఆరు వికెట్లు
- ఆసీస్‌తో రెండో టెస్టు

యాషెస్ సిరీస్



రూట్

బ్రిస్బేన్: ఆధునిక క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నా.. ఇంగ్లండ్ స్టార్ జో రూట్‌కు ఆసీస్ గడ్డపై సెంచరీ ఊరిస్తూనే ఉంది. కానీ ఇన్నాళ్లకు ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోగలిగాడు. గురువారం ఆరంభమైన రెండో టెస్టులో 34 ఏళ్ల రూట్ (135 బ్యాటింగ్) అజేయ సెంచరీతో నిలిచాడు. గాబా మైదానంలో జరుగుతున్న ఈ గులాబీ టెస్టులో ఓవైపు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/71) నిప్పులు చెరిగే బంతులతో వికెట్ల వేట సాగిస్తున్నా.. మరో ఎండ్‌లో రూట్ మాత్రం పట్టు వదలకుండా క్రీజులో నిలిచాడు. ఫలితంగా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలే (76) అర్ధసెంచరీతో సహకరించాడు. ఇక టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టామ్ పేసర్‌గా వసీం అక్రమ్ (414) రికార్డును స్టార్క్ (418) అధిగమించాడు.

5/2తో తడబాటు..: స్టార్క్ ధాటికి మూడో ఓవర్‌లోపే ఓపెనర్ డకెట్, పోప్ డకౌట్లుగా వెనుదిరిగారు. అప్పటికి స్కోరు కేవలం ఐదు పరుగులే. ఈ దశలో మరో ఓపెనర్ క్రాలే అండతో రూట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. బ్రూక్‌ను అవుట్ చేసిన స్టార్క్ చివరి సెషన్‌లో చకచకా వికెట్లు తీసి ఒత్తిడి పెంచాడు. అటు రూట్ మాత్రం ఎదురొడ్డి నిలిచి ఆసీస్ గడ్డపై తొలి సెంచరీ పూర్తి చేశాడు.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 74 ఓవర్లలో 325/9 (రూట్ 135 బ్యాటింగ్, క్రాలే 76, ఆర్చర్ 32 బ్యాటింగ్, బ్రూక్ 31; స్టార్క్ 6/71).

హేడెన్ నగ్న నడక తప్పింది..

జో రూట్ శతకంతో మెల్‌బోర్న్ వాసులకు ఓ 'ప్రమాదం' తప్పింది. గతంలో ఆసీస్ గడ్డపై నాలుగు యాషెస్ సిరీస్‌లు ఆడిన రూట్ ఒక్కసారి కూడా సెంచరీ చేయలేదు. అందుకే రూట్ ఈసారి కూడా ఆసీస్ గడ్డపై సెంచరీ చేయలేకపోతే తాను మెల్‌బోర్న్ మైదానంలో నగ్నంగా నడుస్తానంటూ ఇటీవల ఆసీస్ మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనికి హేడెన్ కూతురు, వ్యాఖ్యాత గ్రేస్ స్పందిస్తూ.. 'రూట్.. దయచేసి ఒక్క సెంచరీ అయినా చెయ్' అని సరదాగా పేర్కొంది.

ఎక్కువ వికెట్లు తీసిన లెఫ్టామ్ పేసర్లు

బౌలర్	టెస్టులు	వికెట్లు
స్టార్క్	102	418
అక్రమ్	104	414
వాస్	111	355
బౌల్ట్	78	317
జహీర్	92	311



నరైన్ @ 600

అబుధాబి: వెస్టిండీస్ వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ టీ20 ఫార్మాట్‌లో 600 వికెట్లు పూర్తి చేసుకున్న మూడో బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (681), విండీస్ పేసర్ డ్వేన్ బ్రావో (631) ముందున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20)లో షార్జా వారియర్స్ తరపున ఆడుతున్న నరైన్ బుధవారం జరిగిన మ్యాచ్‌లో అబుధాబి నైట్‌రైడర్స్‌పై ఒక వికెట్ తీసి ఈ ఫీట్ అందుకున్నాడు.

రచిన్, లాథమ్ సెంచరీలు

- కివీస్ ఆధిక్యం 481
- వెస్టిండీస్‌తో టెస్ట్

క్రైస్ట్‌చర్చ్: రచిన్ రవీంద్ర (176), టామ్ లాథమ్ (145) శతకాలతో చెలరేగడంతో.. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్ పట్టు బిగించింది. ఆటకు మూడో రోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 32/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కివీస్ 417/4 స్కోరు చేసింది. 64 పరుగుల తొలిఇన్నింగ్స్ లీడ్‌తో కలిపి ప్రస్తుతం కివీస్ 481 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231 పరుగులు చేయగా.. విండీస్ 167 రన్స్‌కు ఆలౌటైంది.



100 అందేనా?

మరో 16 శతకాల దూరంలో విరాట్

దక్షిణాఫ్రికాపై రెండు వన్డేలలో వరుసగా రెండు సెంచరీలు బాదిన విరాట్ కోహ్లీ మళ్లీ తన పూర్వపు రోజుల్ని గుర్తు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ స్టార్ బ్యాటర్‌కు సంబంధించి దేశ క్రికెట్‌లో పెద్ద చర్చ నడుస్తోంది. అది..విరాట్ శతకాల 'సెంచరీ' చేస్తాడా అని! 37 ఏళ్ల కోహ్లీ సఫారీలపై రెండు శతకాలను (135, 102) కూడా మంచి స్ట్రయిక్ రేట్‌తో సాధించాడు. ఇటీవలి కాలంలో అతడి స్ట్రయిక్ రేట్‌పై విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో..వాటిని తిప్పికొడుతూ వేగంగా పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాపై రెండో వన్డేలో సెంచరీ.. విరాట్ కెరీర్‌లో 84వది. తాజా ఫామ్ 2016-17లో కోహ్లీ అద్భుత ప్రదర్శన రోజులను జ్ఞప్తికి తెస్తోంది. దీంతో అన్ని ఫార్మాట్లలో కలిపి సచిన్ చేసిన వంద శతకాల రికార్డును అతడు చేరుకోవడం సాధ్యం కావచ్చేమోనన్న చర్చ జరుగుతోంది. వన్డే వరల్డ్ కప్ 2027 అక్టోబరు-నవంబరులో దక్షిణాఫ్రికాలో జరగనుంది. ఇదే ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ, క్రమం తప్పకుండా జట్టుకు ఎంపికైతే కనుక మెగా టోర్నీకి ముందు కోహ్లీకి మరో 25 వన్డేలు ఆడే అవకాశం లభిస్తుంది.

ఆత్మవిశ్వాసం రెండింతలు..

ఇటీవలి కాలంలో పెద్దగా ఫామ్‌లో లేని విరాట్‌కు..సఫారీలపై చేసిన రెండు సెంచరీలు అతడిలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేశాయి. కోహ్లీ గత రికార్డులను పరిశీలిస్తే ప్రతి 5-6 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో ఒక శతకం సాధించాడు. కొన్ని సంవత్సరాల్లో అయితే ఆ రికార్డు మరింత మెరుగ్గా ఉండడం విశేషం. కానీ వయస్సు, కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లే ఆడడం వల్ల కొంతకాలంగా అతడి శతకాల నిష్పత్తి తగ్గింది. పైగా టెస్టులు, టీ20లనుంచి ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇక్కడి నుంచి..ప్రతి 4, 5 ఇన్నింగ్స్‌కు ఒకటి చొప్పున సెంచరీ కొట్టే రేట్‌ను కనుక విరాట్ కొనసాగిస్తే..12-16 శతకాలు సాధించేందుకు కనీసం 50-60 మ్యాచ్‌లు అవసరమవుతాయి..కానీ 2027 వన్డే వరల్డ్ కప్‌తో కలిపి కోహ్లీ కొంచెం అటూఇటూగా 36 మ్యాచ్‌లు మాత్రమే ఆడే చాన్సుంది. ఈ కోణంలో చూస్తే కోహ్లీ 2027 నాటికి వంద శతకాలు చేసే చాన్సులు దాదాపు కనిపించడం లేదు. అయితే పైన పేర్కొన్న మ్యాచ్‌ల కన్నా ఎక్కువ ఆడడంతోపాటు అత్యధిక సెంచరీల రేటు కలిగిన 2016-17 నాటి ఫామ్‌ను అందుకొంటే కోహ్లీ శతకాల 'సెంచరీ'కి చేరువ అయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ వన్డే వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైరవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

ఆ దిశగా అడుగులు..

వన్డే ప్రపంచ కప్ నాటికీ ఇదే ఫామ్‌ను కొనసాగించాలనే పట్టుదలతో విరాట్ ఉన్నాడు. దాంతో విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో ఆడాలని అతడు నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయాన్ని క్రికెట్ పండితులు స్వాగతిస్తున్నారు. బెంగళూరులో జరిగే మూడు మ్యాచ్‌ల్లో ఢిల్లీకి కోహ్లీ ఆడనున్నట్టు సమాచారం.

చత్తీస్‌గఢ్‌పై ఆంధ్ర విజయం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ

లఖ్‌నవూ: యువ క్రికెటర్ షేక్ రషీద్ (44 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 59 నాటౌట్)తో పాటు ఓపెనర్ అశ్విన్ హెబ్బర్ (40 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) అర్ధసెంచరీతో సత్తాచాటడంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆంధ్ర మరో విజయాన్నందుకుంది. గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్ర 8 వికెట్ల తేడాతో చత్తీస్‌గఢ్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చత్తీస్‌గఢ్ 20 ఓవర్లలో 158/6 స్కోరు సాధించింది. శశాంక్ సింగ్ (46), కెప్టెన్ అమన్‌దీప్ (44) రాణించారు. యశ్వంత్, పృథ్వీ రాజ్, శశికాంత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆంధ్ర 18.5 ఓవర్లలో 159/2 స్కోరుతో నెగ్గింది. రెండో వికెట్‌కు రషీద్-అశ్విన్ జోడీ 90 పరుగులు జత చేసింది.



మూడో వన్డే కోసం గురువారం విశాఖపట్నం చేరుకున్న భారత క్రికెటర్లు కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, దక్షిణాఫ్రికా సారథి బవుమా

ఆ సెంచరీతో సీన్ మారింది

విశాఖపట్నం (స్పోర్ట్స్): భారత్-దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ 1-1తో సమం కావడంతో.. విశాఖలో జరిగే మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది. ఈ నేపథ్యంలో సాగర తీరాన జరిగే మ్యాచ్ టిక్కెట్లు హాట్‌హాట్‌గా అమ్ముడయ్యాయి. టెస్ట్ సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్ కావడంతో.. తొలుత టిక్కెట్ల విక్రయాలు ఆరంభించినప్పుడు అంతగా స్పందన లభించలేదు. కానీ, మొదటి మ్యాచ్‌లోనే కోహ్లీ సెంచరీ బాదడంతో క్రమంగా అమ్మకాలు ఊపందుకొన్నాయి. ఇక, రాయ్‌పూర్‌లో విరాట్ వరుసగా రెండో సెంచరీ నమోదు చేయడంతో.. టిక్కెట్లకు డిమాండ్ ఆకాశాన్నంటింది. గత నెల 28న తొలి విడత టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించినప్పుడు డిమాండ్ అంతగా లేదు. కానీ రాంచీలో భారత్ మ్యాచ్ నెగ్గడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. రెండో దఫా టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచిన నిమిషాల్లోనే అన్నీ అమ్ముడుపోయాయని ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) వర్గాలు తెలిపాయి. ఇదే అదనుగా కొందరు బ్లాక్ మార్కెట్‌కు తెరలేపినట్టు సమాచారం.



పాండ్యా కోసం పోటెత్తిన అభిమానం

మ్యాచ్ వేదిక ఉప్పల్‌కు తరలింపు

హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరపున ఆడుతున్న టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కోసం అభిమానులు పోటెత్తడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మ్యాచ్ వేదికను తరలించాల్సి వచ్చింది. గురువారం జింఖానా మైదానంలో బరోడా, గుజరాత్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. కానీ, జట్టు బసచేసిన హోటల్ బయట, నెట్ ప్రాక్టీస్ సమయంలో, టికెట్ కౌంటర్ల వద్ద ఫ్యాన్స్ భారీగా గుమిగూడడాన్ని నిర్వాహకులు గమనించారు. దీంతో ముందు జాగ్రత్తగా మ్యాచ్ వేదికను జింఖానా నుంచి ఉప్పల్‌కు మార్చారు. మ్యాచ్ సాఫీగా కొనసాగించడంతోపాటు ఆటగాళ్ల, అభిమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా, ఈ మ్యాచ్‌లో బరోడా 8 వికెట్ల తేడాతో గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. పాండ్యా 10 పరుగులు చేయడంతోపాటు ఒక వికెట్ పడగొట్టాడు.

వాళ్లా.. రో-కో భవిష్యత్ నిర్ణయించేది?

- మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్



న్యూఢిల్లీ: తమ కెరీర్‌లో పెద్దగా ఏమీ సాధించని వారు.. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుండడం దురదృష్టకరమని భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ అన్నాడు. తనతోపాటు అనేకమంది సహచరులకు కూడా గతంలో ఇలాంటి పరిస్థితే ఎదురైందని అన్నాడు. ఇక భారత్‌లో మంచి స్పోర్టింగ్ వికెట్లపై ఆడే ధోరణి రావాలని సూచించాడు.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,360 ▼	1,19,500 ▼	2,00,000 ▼
విజయవాడ	1,31,500 ▼	1,23,000 ▼	1,80,000 ▼
విశాఖపట్నం	1,31,600 ▼	1,19,700 ▲	2,00,000 ▼
రాజమండ్రి	1,30,360 ▼	1,19,500 ▼	1,82,000 ▼
ప్రొద్దుటూరు	1,27,650 ▼	1,17,440 ▼	1,76,000 ▼
ముంబై	1,27,845 ▼	1,17,106 ▼	1,76,625 ▼


నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: అక్టోబరు నెలలో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతానికి దిగి రావడం, సెప్టెంబరు త్రైమాసిక వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి దూసుకుపోయిన నేపథ్యంలో రాబోయే రెండు నెలల్లో అనుసరించదగిన ద్రవ్య విధానాన్ని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించనున్నారు. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన కారణంగా రెపోరేటును 0.25% మేరకు తగ్గించవచ్చని కొందరు నిపుణులు, వృద్ధిరేటు బలంగా ఉన్న కారణంగా రెపోరేటును యథాతథంగానే కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నారు.

కొత్త ఏడాది పసిడి బుల్ రన్ ఆగదు..!

ధర 30 శాతం వరకు పెరిగే అవకాశం ▸▸ ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడి

న్యూఢిల్లీ: పసిడి ధర చుక్కలంటుతోంది. దేశీయ మార్కెట్లో ఇప్పటికే 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం ధర రూ.1.30 లక్షలు దాటిపోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు భారత మార్కెట్లో పసిడి ధర 60 శాతం పెరిగింది. గత ఏడాది కాలంలో దేశంలో మరే పెట్టుబడులు ఈ స్థాయిలో లాభాలు పంచలేదు. మరోవైపు వచ్చే ఏడాది (2026) కూడా పసిడి పరుగు ఆగదని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తన తాజా నివేదికలో తెలిపింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి 4,210 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వచ్చే ఏడాది ఇది మరో 15 నుంచి 30 శాతం (630-1,260 డాలర్లు) పెరిగి 4,840 నుంచి 5,470 డాలర్లకు చేరే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది. మరోవైపు ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ కూడా దాదాపు ఇదే అంచనాలు వెలువరించింది. దీంతో వచ్చే ఏడాది భారత మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర.. 6 శాతం దిగుమతి సుంకం, 3 శాతం జీఎస్‌టీ కలుపుకుంటే రూ.1,49,500 నుంచి రూ.1.69 లక్షలు పలికే అవకాశం ఉంటుందని అంచనా. అయితే ట్రంప్ సుంకాల పోటు ఫలించి అమెరికా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడితే మాత్రం ఔన్స్ పసిడి ధర 5 నుంచి 20 శాతం వరకు దిద్దుబాటుకు (కరెక్షన్) లోనయ్యే ప్రమాదం కూడా ఉందని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది.



బంగారం జోరుకు కారణాలు

- తగ్గుతున్న వడ్డీ రేట్లు
- కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- కేంద్ర బ్యాంకులు, గోల్డ్ ఈటీఎఫ్‌ల కొనుగోళ్లు
- సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న పేరు
- పొంచి ఉన్న ద్రవ్యోల్బణ భయాలు

సాయి పేరెంటరల్స్ రూ.110 కోట్ల పెట్టుబడులు

SAI PARENTERALS

- రూ.26 కోట్లతో ఆర్ అండ్ డీ సెంటర్
- ఐపీఓ ద్వారా రూ.285 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాయి పేరెంటరల్స్ లిమిటెడ్ (ఎస్‌పీఎల్).. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. కంపెనీ ఇప్పటికే మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించిందని కంపెనీ ఎండీ కే అనిల్ కుమార్ వెల్లడించారు. ఐపీఓలో భాగంగా తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.285 కోట్లు సమీకరించనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రస్తుత ఇన్వెస్టర్లు రూ.125 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారని ఆయన తెలిపారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.110 కోట్లను ప్లాంట్ల ఆధునికీకరణ, సాధారణ కార్పొరేట్ అవసరాలతో పాటు ఇటీవల ఆస్ట్రేలియాలో కొనుగోలు చేసిన న్యూమెడ్ ఫార్మా కోసం వినియోగించనున్నట్లు అనిల్ చెప్పారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలో నాలుగు ప్లాంట్లను నిర్వహిస్తోంది. బ్రాండెడ్ జెనరిక్ ఫార్ములేషన్స్‌తో పాటు కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) సేవలను అందిస్తోంది. భారత్‌తో పాటు ఫిలిప్పీన్స్, దుబాయ్, సౌదీ అరేబియా మార్కెట్లకు ఔషధాలను ఎగుమతి చేస్తోంది. తాజాగా న్యూమెడ్ కొనుగోలుతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పాటు మరికొన్ని రెగ్యులేటెడ్ మార్కెట్లకు తన కార్యకలాపాలను విస్తరించనుంది.


వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి న్యూమెడ్ ప్లాంట్ రెడీ: కాగా హైదరాబాద్ బొల్లారంలో కొత్తగా ఆర్ అండ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అనిల్ తెలిపారు. ఇందుకోసం రూ.26 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది ఈ సెంటర్ అందుబాటులోకి రానుందన్నారు. అలాగే ఆస్ట్రేలియాలోని న్యూమెడ్ ఫార్మా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికల్లా అందుబాటులోకి రానుందన్నారు. రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా 2027 జనవరి నుంచి వాణిజ్యపరంగా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం కానుందని అనిల్ వివరించారు.

ఏ రంగానికైనా ఆర్ అండ్ డీనే దన్ను

బీడీఎల్ సీఎండీ మాధవ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏ రంగానికి చెందిన పరిశ్రమల అభివృద్ధికి ఆర్ అండ్ డీ (పరిశోధన, అభివృద్ధి) కీలకమని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎండీ కమోడోర్ ఏ మాధవ రావు (రిటైర్డ్) అన్నారు. వైమానిక, రక్షణ రంగాలపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రక్షణ, వైమానిక రంగాల్లో ప్రైవేటు కంపెనీల పాత్ర పెరుగుతోందన్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి ఆయుధ ఎగుమతులు రూ.23,000 కోట్లు మించిపోయాయని తెలిపారు. ఇటీవల బీడీఎల్ కూడా ఆర్ అండ్ డీ కార్యకలాపాలను బాగా పెంచిందన్నారు. ప్రస్తుతం తమ టర్నోవర్‌లో దాదాపు 6 శాతం ఇందుకు ఖర్చు చేస్తున్నట్టు మాధవ రావు వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90



టీసీఎస్‌తో ఓపెన్ ఏఐ జట్టు!

భారత్‌లో స్టార్‌గేట్ కార్యకలాపాల విస్తరణ

- తుది దశకు చర్చలు..
- నెలాఖరు కల్లా ప్రకటన వెలువడే చాన్స్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)లో ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా ఎదిగిన 'ఓపెన్ ఏఐ' భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో జట్టు కట్టేందుకు చర్చలు జరుపుతోంది. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఏఐ ఆధారిత కంప్యూటర్ మౌలిక సదుపాయాలు, కంపెనీలకు అవసరమైన ఏజెంటిక్ ఏఐ సొల్యూషన్స్ అభివృద్ధి చేయాలని రెండు సంస్థలు భావిస్తున్నాయి. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చర్చలు ఈ నెలాఖరుకల్లా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎందుకంటే?

ఓపెన్ ఏఐకి అమెరికా తర్వాత భారత్ అతి పెద్ద మార్కెట్. ఈ కంపెనీ ఆఫర్ చేసే ఏఐ టూల్ 'చాట్ జీపీటీ' భారత్‌లో సూపర్ డూపర్ హిట్టయింది. అయితే ఇటీవల పర్‌ప్లెక్సిటీ, గూగుల్ జెమినీ ఏఐ టూల్స్ నుంచి ఓపెన్ ఏఐకి విపరీతమైన పోటీ ఏర్పడుతోంది. దీంతో టాటా వంటి పెద్ద పారిశ్రామిక గ్రూప్‌తో జట్టు కట్టి తన 'స్టార్‌గేట్ ఇండియా' కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తోంది. ఓపెన్ ఏఐతో ఈ డీల్ కుదిరితే, ప్రపంచంలో అతిపెద్ద ఏఐ ఆధారిత ఐటీ సేవల కంపెనీగా ఎదగాలన్న తన లక్ష్యం నెరవేరుతుదని టీసీఎస్ భావిస్తోంది.

లీజు ఒప్పందం మాత్రమే

ఏఐ సేవలకు అవసరమైన డేటా కేంద్రాల ఏర్పాటు కోసం టీసీఎస్ ఇప్పటికే హైపర్‌వాల్ట్ పేరుతో ప్రత్యేక వెంచర్ ఏర్పాటు చేసింది. టీసీఎస్ ఈ వెంచర్ ద్వారా మన దేశంలో సేవలు అందించే విదేశీ కంపెనీలకు తన డేటా సెంటర్ల ద్వారా సేవలు అందించనుంది. ఈ వెంచర్‌లో కనీసం 500 మెగావాట్ల డేటా సామర్థ్యాన్ని లీజుకు తీసుకోవాలని ఓపెన్ ఏఐ భావిస్తున్నట్టు సమాచారం. నిజానికి హైపర్‌వాల్ట్ వెంచర్‌లో ఈక్విటీ వాటా తీసుకునేందుకు ఓపెన్ ఏఐ ఆసక్తి చూపింది. అయితే ఇతర కస్టమర్ల నుంచి సమస్యలు వచ్చే అవకాశం ఉందనే భయంతో టాటా గ్రూప్ ఆ ప్రతిపాదనను తోసిపుచ్చింది. దీంతో డేటా సెంటర్ల లీజుతో సరిపెట్టుకునేందుకు ఓపెన్ ఏఐ సిద్ధమవుతోంది.

మరోవైపు టీసీఎస్ తన డేటా సెంటర్ వ్యాపారం కోసం మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్, ఎన్‌విడియాతో జట్టు కట్టాలని భావిస్తోంది.

2,200 కోట్ల డాలర్ల మార్కెట్

ప్రస్తుతం మన దేశంలో ఏఐ మార్కెట్ 780 కోట్ల డాలర్ల నుంచి 1,270 కోట్ల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ మార్కెట్ ఏటా 20.1 శాతం నుంచి 43.76 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. 2027 నాటికి ఇది 1,700 కోట్ల డాలర్ల నుంచి 2,200 కోట్ల డాలర్లకు చేరే అవకాశం ఉందని నాస్కామ్-బీసీజీ అంచనా. దీంతో గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజాలు భారత్‌లోని పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో జట్టు కట్టేందుకు ముందుకు వస్తున్నాయి. గూగుల్ ఇప్పటికే తన జెమినీ ఏఐ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో జట్టు కట్టింది. నిజానికి ఓపెన్ ఏఐ కూడా తన ఏఐ సేవల కోసం రిలయన్స్ ప్రభుత్వంతో చర్చలు జరిపినా అవి పెద్దగా ఫలించలేదు. దాంతో ఇప్పుడు టాటా గ్రూప్ కంపెనీ టీసీఎస్ జట్టు కట్టేందుకు ఆసక్తి చూపుతోందని భావిస్తున్నారు.

నాలుగు రోజుల నష్టాలకు తెర

380 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ మార్కెట్ నాలుగు రోజుల నష్టాలకు తెర దించింది. టెక్, ఐటీ షేర్ల కొనుగోలుతో గురువారం సూచీలు లాభాల్లో ముగిశాయి. అయితే ఆర్‌బీఐ పాలసీపై అప్రమత్తత, రూపాయి బలహీనత లాభాలను పరిమితం చేశాయి. మొత్తం మీద గురువారం ఇంట్రాడేలో 380 పాయింట్ల పైగా పెరిగిన సెన్సెక్స్ ఆ లాభాన్ని 158.51 పాయింట్లకు పరిమితం చేసుకుని 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.75 పాయింట్ల లాభంతో 26,033.75 వద్ద క్లోజైంది. అంతకు ముందు వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 613 పాయింట్లు, నిఫ్టీ 230 పాయింట్లు నష్టపోయాయి. శుక్రవారం ఆర్‌బీఐ పాలసీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు దూరంగా ఉండడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ అన్నారు.

19 పైసలు లాభపడిన రూపాయి: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి జీవితకాల కనిష్ఠ స్థాయి నుంచి స్వల్పంగా కోలుకుంది. ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించవచ్చన్న అంచనాలు రూపాయికి ఊపిరి పోశాయి. గురువారం ఒక దశలో ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయి 90.43 వరకు దిగజారినప్పటికీ తదుపరి కాస్తంత నిలదొక్కుకుంది. చివరికి 19 పైసలు లాభంతో 89.96 వద్ద ముగిసింది.

నెఫ్రో ప్లస్ షేరు ధర రూ.438-460: నెఫ్రో ప్లస్ బ్రాండ్‌తో డయాలసిస్ సేవలందిస్తున్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ వచ్చే వారంలో జారీ చేయనున్న ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.438-460గా ప్రకటించింది. కంపెనీ విలువ రూ.4,600 కోట్లుగా పరిగణించి ధరను నిర్ణయించారు. రూ.871 కోట్ల సమీకరణ లక్ష్యంగా మార్కెట్లోకి వస్తున్న నెఫ్రోప్లస్ ఇష్యూ వచ్చే బుధవారం (10వ తేదీ) ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది.

- భారత్‌లో తమ కస్టమర్ నెట్‌వర్క్‌లోని 80 లక్షల ఎండ్ పాయింట్స్, స్థాపిత బేస్‌లో 26.5 కోట్ల సైబర్ దాడులను గుర్తించినట్లు క్విక్‌కీల్ సంస్థ సెక్యూరైట్ వెల్లడించింది. అత్యధికంగా మహారాష్ట్రలో 3.61 కోట్లు, గుజరాత్‌లో 2.41 కోట్లు, ఢిల్లీలో 1.54 కోట్ల దాడులను గుర్తించింది.
- చిన్న వ్యాపారాల్లో డిజిటల్ వ్యవస్థను పెంపొందించేందుకు గాను ఏఐ చాట్‌బాట్‌ను మెటా, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, ఇండియా ఎస్ఎంఈ ఫోరమ్ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.
- సామ్‌సంగ్ మార్కెట్లోకి గెలాక్సీ ట్యాబ్ ఏ11ను విడుదల చేసింది. 6ఎన్ఎం ఆధారిత ఆక్టాకోర్ ప్రాసెసర్, 5,100 ఎంఏహెచ్ బ్యాటరీ, 4జీబీ, 8జీబీ మెమరీతో కూడిన దీని ధరలు రూ.12,999 నుంచి రూ.20,999 మధ్యన ఉన్నాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	130
వరంగల్	127	గుంటూరు	135
కరీంనగర్	127	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	117
కర్నూలు	127	నెల్లూరు	122
విశాఖపట్నం	120	అనంతపురం	122
గోదావరి	130		

ఐదుగురిని మింగేసిన అతివేగం

- చిలకలూరిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- మృతులు విజ్ఞాన్ ఇంజనీరింగ్ విద్యార్థులు
- ఇందులో అయ్యప్ప దీక్షలో ఉన్న నలుగురు
- కంటెయినర్‌ను ఓవర్ టేక్ చేస్తూ మృత్యువొడికి..


కారులో చిక్కుకుపోయిన మృతదేహాలను వెలికితీస్తున్న పోలీసులు

చిలకలూరిపేట, నాదెండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం ఐదుగురిని మింగేసింది! పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం పరిధిలోని జాతీయ రహదారి-16పై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విజ్ఞాన్ వర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. మృతుల్లో ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం వితలాపురానికి చెందిన మెడిగం రామిరెడ్డి, వినుకొండ మండలం శివాపురానికి చెందిన మేరుగు శ్రీకాంత్, పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి మహేష్‌బాబు, వినుకొండకు చెందిన వంగవోలు వాసు, మూలకలూరు చెందిన యశ్వంత్ సాయి ఉన్నారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వీరంతా 21 ఏళ్లలోపువారే. ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు మృతి చెందగా తీవ్ర గాయపడిన వాసును ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుల్లో నలుగురు విద్యార్థులు అయ్యప్ప దీక్షలో ఉన్నారు. రెండు రోజుల్లో అయప్ప దర్శనానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు నుంచి వీరందరూ కారులో వినుకొండ ప్రాంతంలోని ఓ దేవాలయంలో నిద్ర చేసేందుకు రాత్రి 8.30 గంటల సమయంలో చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో వెళ్తుండగా.. కంటెయినర్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదానికి గురయ్యారు.


మహిళా కానిస్టేబుల్ దంపతులతో హోంమంత్రి అనిత

అప్పుడు అమ్మకు సీమంతం.. ఇప్పుడు చిన్నారికి ముద్దులు!

విశాఖపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అనిత ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆందోళన కార్యక్రమానికి బయలుదేరగా, మహిళా కానిస్టేబుల్ రేవతి ఆమెను హౌస్‌అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమె గర్భవతిగా ఉన్న విషయం తెలుసుకున్న అనిత వారింటికి వెళ్లి సీమంతం చేశారు. గురువారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి అనిత హాజరయ్యారు. అక్కడ విధుల్లో ఉన్న రేవతితో మాట్లాడారు. తనకు కుమార్తె పుట్టిందని ఆమె చెప్పగా... ఆ పాపను తీసుకురావాలని కోరారు. రేవతి భర్త పాపను తీసుకురాగా, అనిత ఆ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు.

'చాముండ' సోదరులు.. మహా ముదుర్లు!

- ఇద్దరిపైనా బంగారం స్మగ్లింగ్ కేసులు
- ముంబై చేరుకున్న సిట్ బృందం
- చేతన్ పట్టుబడితే హవాలా గుట్టు రట్టు!

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన భారీ మద్యంకుంభ కోణంలో రోజుకో సంచలనం వెలుగులోకి వస్తోంది. ప్రజలు, డిస్టిలరీల నుంచి వైసీపీ ముఠా వసూలు చేసిన రూ.కోట్ల ముడుపులను హవాలా చేసిన 'చాముండ' బులియన్ సోదరులు చేతన్ కుమార్, రోణక్ కుమార్ బంగారం స్మగ్లింగ్ కేసులో నిందితులుగా తేలింది. రాజ్ కసిరెడ్డి గ్యాంగ్‌తో సంప్రదింపులు జరిపి వంద కోట్ల హవాలాకు ఒప్పందం కుదుర్చుకుని రూ.78 కోట్లు వైట్ మనీగా మార్చిన చేతన్ కుమార్‌ను సిట్ అధికారులు విచారణకు పిలవడం.. ఆరోగ్యం బాగా లేదంటూ అతడు తన తమ్ముడు రోణక్ కుమార్‌ను విజయవాడకు పంపడం.. ఇక్కడ హవాలా గుట్టు మొత్తాన్నీ అనిల్ చోఖ్రా (షెల్ కంపెనీల సృష్టికర్త) విప్పేశాడని అతడికి తెలియడం.. వెంటనే ముంబైకి పారిపోయే ప్రయత్నం చేయడం.. ఆ క్రమంలో గన్నవరం ఎయిర్‌పోర్టులో రోణక్‌ను పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. అతడి సెల్‌ఫోన్ ఓపెన్ చేయించి చూడగా.. అందులో కేంద్ర ఏజెన్సీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) విచారణకు పిలిచిన నోటీసులు కనిపించాయి. ఇవేంటని అడిగినా రోణక్ బయట పెట్టలేదు. దీంతో సిట్ అధికారులు ముంబైలోని డీఆర్‌ఐ అధికారులను సంప్రదించగా.. ఇద్దరిపైనా స్మగ్లింగ్ కేసులున్నాయని.. అవి విచారణ నిమిత్తం అతడికి తాము జారీ చేసిన నోటీసులని వారు వెల్లడించారు. చాముండ బులియన్ యజమాని జస్‌రాజ్‌కు దుబాయ్‌లో ఉన్న లింకులు, అతడి కుమారులైన చేతన్, రోణక్ వారసత్వ స్మగ్లింగ్, హవాలా గురించిన వివరాలు కూడా తెలియజేశారు. దీంతో వైసీపీ లిక్కర్ ముఠాతో సంబంధాలు నెరిపిన ఈ సోదరులు బంగారం స్మగ్లింగ్ కూడా చేస్తారని సిట్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. రాష్ట్రంలో ఎక్కువగా అమ్ముడుపోయే ఒక బ్రాండ్ మద్యాన్ని వైసీపీ హయాంలో సరఫరా చేసిన లిక్కర్ వ్యాపారులు.. ముంబైలో వందల కిలోల బంగారం కొనుగోలు చేసినట్లు బిల్లులు లభించాయి. ఈ కోణంలోనూ ఆరా తీస్తున్న సిట్ బృందం గురువారం సాయంత్రం ముంబైకి చేరుకుంది. అక్కడ చేతన్ కుమార్ పట్టుబడితే బంగారం గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది.


చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఇప్పటికే విడుదలైన 'మీసాల పిల్లా...' అంటూ సాగే పాట సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మరో పాట 'శశిరేఖ'ను ఈనెల 8న విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

అఖండ విడుదల వాయిదా

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2: తాండవం' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం సినిమా థియేటర్లలో నేడు విడుదల కావాల్సి ఉంది. 'కొన్ని అనివార్య కారణాల వల్ల అనుకున్న సమయానికి 'అఖండ 2' సినిమాను విడుదల చేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. ఈ విషయంలో నిరాశకు గురైన సినీ ప్రేక్షకులను మేము అర్థం చేసుకోగలం. వారందరికీ మా క్షమాపణలు తెలియజేస్తున్నాం. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే సానుకూల నిర్ణయంతో మీ ముందుకొస్తాం' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది.

విడుదలపై కోర్టు స్టే

గతంలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలసి ఈరోస్ సంస్థ మహేశ్‌బాబు నటించిన 'వన్ నేనొక్కడినే', 'ఆగడు' చిత్రాలను నిర్మించింది. ఆ చిత్రాల వల్ల వచ్చిన నష్టాలకు సంబంధించి ఈ రెండు సంస్థల మధ్య వివాదం నడుస్తోంది. 14 రీల్స్ సంస్థ నుంచి తమకు రావాల్సిన రూ.28 కోట్లు ఇప్పించాలని మద్రాస్ హైకోర్టును ఈరోస్ ఆశ్రయించింది. 14 రీల్స్‌లో భాగస్వాములైన రామ్ ఆచంట, గోపీ ఆచంటనే 14 రీల్స్ ప్లస్ సంస్థను కూడా ప్రారంభించారని కోర్టు దృష్టికి తెచ్చింది. తమకు రావాల్సిన బకాయిలు మొత్తం చెల్లించే వరకు 'అఖండ' విడుదలను నిలిపివేయాలని హైకోర్టును కోరింది. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు సినిమా విడుదలపై స్టే విధించింది. దీంతో గురువారం రాత్రి పడాల్సిన ప్రీమియర్ షోలు రద్దు అయ్యాయి.

శ్రీతేజ్ వైద్యానికి అండగా ఉంటాం

- నిర్మాత దిల్‌రాజు

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతేడాది 'పుష్ప 2' చిత్రం విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన చిన్నారి శ్రీతేజ్ వైద్యానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. ఈ ఘటనలో తల్లిని కోల్పోయి, గాయాలతో బాధపడుతున్న శ్రీతేజ్‌ను ఆదుకునేందుకు హీరో అల్లు అర్జున్ మరోసారి ముందుకొచ్చారని, బాబు రిహాబిలిటేషన్ ఖర్చులు భరించేందుకు ఆయన అంగీకరించారని దిల్‌రాజు వెల్లడించారు.

'పుష్ప 2' చిత్రం విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో హైదరాబాద్‌కు చెందిన భాస్కర్ సతీమణి రేవతి కన్నుమూయగా, వారి కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి ఏడాది అయిన సందర్భంగా బాధితుని కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ గురువారం ఆంధ్రజ్యోతి పత్రిక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అల్లు అర్జున్ బాబు పేరిట చేసిన డిపాజిట్ డబ్బులు వైద్య ఖర్చులకు సరిపోవడం లేదనీ, అల్లు అర్జున్ మేనేజర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదనీ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దిల్‌రాజు స్పందిస్తూ... భాస్కర్ తనను కలిశారని, అల్లు అర్జున్‌తో మాట్లాడి తదుపరి వైద్య ఖర్చులు కూడా భరించేలా ఒప్పించానని స్పష్టత ఇచ్చారు. శ్రీతేజ్ తండ్రి భాస్కర్, ఆయన సోదరుడితో కలసి గురువారం దిల్ రాజు ఫిల్మ్ ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. 'భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం. ఇంకో ఏడాదైనా శ్రీతేజ్‌ను రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచి, అవసరమైన చికిత్సలన్నీ చేయిస్తాం. ఏదున్నా మేం చూసుకుంటాం' అని దిల్‌రాజు భరోసా ఇచ్చారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



తమిళ సినీ దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్(86) భౌతికంగా దూరమయ్యారు. తన 85వ పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్న మరుసటి రోజున అంటే డిసెంబరు 4న ఆయన కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా ఆయన చెన్నైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన భౌతికకాయాన్ని స్థానిక సాలిగ్రామంలోని ఏవీఎం స్టూడియోలో సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు.. కాగా, ఏవీఎం శరవణన్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని శ్మశానవాటికలో పూర్తి చేశారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని పురాతన సినీ నిర్మాణ సంస్థల్లో ఏవీఎం ప్రొడక్షన్స్ ఒకటి. ఈ సంస్థ సుమారుగా 175కు పైగా సినిమాలను నిర్మించింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ఏవీ మెయ్యప్పన్ కుమారుల్లో ఏవీఎం శరవణన్ ఒకరు. ఏవీఎం ప్రొడక్షన్‌ను ప్రగతిపథంలో నడిపించడంలో ఆయన కీలక పాత్రను పోషించారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా కూడా పనిచేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను 'కలైమామణి' పురస్కారంతో సత్కరించింది.

దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ కన్నుమూత

- సినీ ప్రముఖుల అశ్రునివాళి
- ముగిసిన అంత్యక్రియలు
- దక్షిణాది చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు

నాలుగు సుగుణాలు



కృషి, ప్రణాళిక, పట్టుదల, వినయం అనే నాలుగు సుగుణాలతో తన తండ్రి ఏవీ మెయ్యప్పన్ చెట్టియార్ నిర్దేశించిన మార్గాన్ని అనుసరించి ఏవీఎం అనే మూడు అక్షరాలతో స్థాపించిన సినీ నిర్మాణ సంస్థను శరవణన్ భారతీయ చలనచిత్రపరిశ్రమలో అగ్రగామిగా నిలిపారు. ఏవీఎం శరవణన్ 1939 డిసెంబరు మూడో తేదీన జన్మించారు. తండ్రి మార్గదర్శకత్వంలో నడుస్తూ 1958లో 'మామియార్ మెచ్చియ మరుమగల్' అనే చిత్ర నిర్మాణంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. తమిళ, తెలుగు, హిందీ సహా అనేక భాషల్లో చిత్రాలను నిర్మించారు. తమిళంలో ఎంజీఆర్, శివాజీ, జెమిని గణేశన్, ఎస్ఎస్ఆర్, ముత్తురామన్, జయశంకర్, రవిచంద్రన్, కె.భాగ్యరాజ్, విజయకాంత్, విజయ్, అజిత్, సూర్య, విక్రమ్, మాధవన్ ఇలా అగ్ర నటులతో ఆయన సినిమాలు నిర్మించారు. రజనీకాంత్‌తో 'పోకిరి రాజా', 'పాయుంపులి', 'నల్లవన్‌కు నల్లవన్', 'మిస్టర్ భరత్', 'మనిదన్', 'రాజా చిన్న రాజా', 'ఎజమాన్' వంటి చిత్రాలను నిర్మించారు. మరో అగ్ర నటుడు కమల్‌తో 'సకలకళా వల్లవన్', 'తూంగాదే తంబి తంగాదే', 'పేర్ సెల్లుం పిళ్లై' వంటి పలు చిత్రాలను నిర్మించారు. 2007లో రజనీకాంత్ హీరోగా 'శివాజీ' చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించగా ఘన విజయం సాధించింది. ఈ సినిమాను తన తండ్రి ఏవీ మెయ్యప్పన్ శతజయంతి రోజున విడుదల చేశారు. ఏవీఎం నిర్మాణ సంస్థలో వచ్చిన 168వ చిత్రమిది. ఎస్.శంకర్ దర్శకత్వం వహించారు.

అగ్ర హీరోలతో తెలుగు చిత్రాలు

ఏవీఎం ప్రొడక్షన్స్ తెలుగులో కూడా పలు చిత్రాలను నిర్మించింది. ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేశ్, రానా.. ఇలా నాలుగు తరాల హీరోలతో సినిమాలు నిర్మించిన ఘనత ఈ సంస్థది. 'భూకైలాస్', 'నాదీ ఆడజన్మే', 'లేత మనసులు', 'భక్త ప్రహ్లాద' 'అవే కళ్ళు', 'రాము', 'చిట్టి చెల్లెలు', 'మూగనోము', 'పుట్టినిల్లు మెట్టినిల్లు', 'నోము', 'పూజ' వంటి చిత్రాలను ఏవీ మెయ్యప్ప చెట్టియార్ నిర్మించారు. పిల్లలు ప్రధాన పాత్రధారులుగా వరుసగా మూడేళ్లు 'లేత మనసులు', 'రాము', 'మూగనోము' చిత్రాలను ఏవీఎం సంస్థ నిర్మించడం, ఆ మూడూ హిట్ కావడం గమనార్హం. ఈ చిత్రాలకు శరవణన్ నిర్మాణ సారథిగా వ్యవహరించారు. ఇవి కాక 'పున్నమి నాగు', 'మూడు ముళ్ళు', 'బామ్మమాట బంగారుబాట', 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'జెమిని', 'లీడర్', 'ఎవరైనా ఎప్పుడైనా' వంటి చిత్రాలను ఏవీఎం శరవణన్ నిర్మించారు. వీటితో పాటు తమిళంలో హిట్ అయిన 'మెరుపు కలలు', 'శివాజీ' వంటి చిత్రాలను తెలుగులో కూడా విడుదల చేశారు.

ముక్కుసూటి మనిషి..

ఏవీఎం నిర్మాణ సంస్థ దాదాపుగా 175కు పైగా చిత్రాలను నిర్మించింది. కొన్నేళ్ళుగా చిత్ర నిర్మాణానికి దూరంగా ఉంటోంది. ఆయన మనవరాళ్ళు అపర్ణ, అరుణలు కొన్ని వెబ్ సిరీస్‌లు నిర్మిస్తున్నారు. చిత్ర నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేశారని శరవణన్‌ను స్నేహితులు ప్రశ్నించగా.. 'ఇప్పుడు చిత్ర నిర్మాణ వ్యయంతో పాటు నటీనటుల పారితోషికాలు భారీగా పెరిగిపోయాయి. నిర్మాతలకు తగిన గౌరవ మర్యాదలు లేవు. అందుకే చిత్ర నిర్మాణాలను ఆపివేశాను' అంటూ సమాధానమిచ్చారు. ఓ ప్రముఖ హీరో ఓ సందర్భంలో శరవణన్‌తో మాట్లాడుతూ, తనకు పారితోషికం ఇవ్వవద్దని ఆస్తి రూపంలో ఏవీఎం స్టూడియోలో ఏదైనా ఇవ్వాలని అడగ్గా.. అలాంటి సినిమా తీయాల్సిన అవసరం మాకు లేదని నిర్మొహమాటంగా చెప్పిన ముక్కుసూటి మనిషి ఏవీఎం శరవణన్.


తండ్రి ప్రాణ స్నేహితుడికి ప్రత్యేక గౌరవం

తన తండ్రి ఏవీ మెయ్యప్ప చెట్టియార్ అంటే శరవణన్‌కు అమితమైన గౌరవం. ఏ వేదికపై ప్రసంగించినా తన తండ్రి గురించి ఎంతో ఉన్నతంగా మాట్లాడేవారు. అలాగే తన తండ్రి ప్రాణ స్నేహితుడైన ఎస్పీ ముత్తురామన్ అంటే ఏవీఎం శరవణన్‌కు అమితమైన గౌరవం. అందుకే ఏవీఎం స్టూడియోలో శాశ్వత గదిని ముత్తురామన్‌కు కేటాయించడంతో పాటు తాము నిర్మించే చిత్రాల్లో సహ నిర్మాతగా ఆయన్ని చేర్చుకున్న గొప్ప మానవతావాది.

చేతులు కట్టుకునే..

ఐశ్వర్యవంతమైన కుటుంబంలో జన్మించినా.. ఆయన నిరాడంబరుడు, నిగర్వి అని కోలీవుడ్ వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. ఆయన ఎక్కడ కనిపించినా, ఏ కార్యక్రమానికి వచ్చినా రెండు చేతులు కట్టుకుని ఒక సాధారణ వ్యక్తిగా నిలబడేవారు. అదే తర్వాతి రోజుల్లో ఆయనకు ఒక గుర్తుగా మారిపోయింది. తన కన్నా చిన్నవయసువారైన ప్రముఖులను కలిసిన సందర్భాల్లోనూ ఆయన రెండు చేతులు కట్టుకునే ఉండేవారు.

సినీ ప్రముఖుల నివాళి




ఏవీఎం స్టూడియోలో ఉన్న శరవణన్ భౌతికకాయానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. రజనీకాంత్, సూర్య, విశాల్, ఈశ్వరీ రావు, ఆర్.పార్తిబన్, విక్రమ్ ప్రభు, చిన్న జయంతి, కరుణాకరన్, శివకుమార్, కేఆర్ విజయ, నాజర్, విజయకుమార్, అరుణ్ విజయ్ తదితరులు శరవణన్‌కు నివాళులర్పించారు. -చెన్నై, (ఆంధ్రజ్యోతి)

PARAS

నేడు మెగా పీటీఎం 3.0

- 45 వేల పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- మన్యంలో పాల్గొననున్న సీఎం, లోకేశ్, చిలకలూరిపేటలో పవన్

అమరావతి/చిలకలూరిపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం(పీటీఎం)-3.0 నిర్వహణకు పాఠశాల విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 45వేల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో మెగా పీటీఎం నిర్వహించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలోని భామిని మోడల్ స్కూల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ పాల్గొంటున్నారు. మిగిలిన పాఠశాలల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మెగా పీటీఎం జరుగుతుంది. కాగా, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని శారద జెడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం-3.0లో పాల్గొననున్నారని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు.

పీజీ సెట్ అర్హత లేకపోయినా అడ్మిషన్లు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఇతర పీజీ కోర్సుల్లో చేరేందుకు ఈ ఏడాదికి అర్హత మినహాయింపునిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కోర్సుల్లో చేరేందుకు పీజీసెట్ రాసి అర్హత సాధించకపోయినా, సెట్ రాయకపోయినా... వారికి కూడా స్పాట్ కోటా కింద అడ్మిషన్లు చేపట్టేందుకు అవకాశం కల్పించింది. యూనివర్సిటీల కాలేజీలు, ప్రభుత్వ కాలేజీల్లో మిగిలిపోయిన కన్వీనర్ కోటా సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేయాలని స్పష్టంచేసింది. అయితే ఈ కోటాలో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదు.

న్యాయమూర్తులకు డీఏ పెంపు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర న్యాయశాఖ లేఖలను అనుసరించి హైకోర్టు న్యాయమూర్తులకు, న్యాయాధికారులకు, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు, న్యాయాధికారులకు, కుటుంబ పింఛనర్లకు డీఏను 55 శాతం నుంచి 58 శాతానికి పెంచుతూ రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయశాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం తెలిపారు. డీఏ పెంపు 1-7-2025 నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

అరటి రైతులను కేంద్రం ఆదుకోవాలి: లక్ష్మీనారాయణ

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా అరటి రైతులు.. మార్కెట్‌లో ధరల పతనంతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని టీడీపీ ఎంపీ జి.లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని రైల్వే రవాణా చార్జీలు తగ్గించాలని, ఖాళీ కంటెయినర్ల హాల్టేజ్ చార్జీలను పూర్తిగా మాఫీ చేయాలని, నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: సీఎస్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు గోనెసంచుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

దివ్యాంగులకు చంద్రబాబు వరాలపై ప్రచారం

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి అన్నారు. చంద్రబాబు ప్రకటించిన వరాలకు కృతజ్ఞతగా గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, భారీఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. వారం రోజులపాటు ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.

కొత్త సెస్ నిధుల్లో వాటా ఇవ్వండి: ఎంపీ దగ్గుమళ్ల

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్నా 'ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రత సెస్ (హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్)-2025' ద్వారా వసూలుచేసే నిధుల నుంచి కొంత వాటాను రాష్ట్రాలకు బదిలీ చేయాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ ఉపనాయకుడు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య వ్యయంలో ప్రభుత్వ వాటా 2014లో 29 శాతం ఉండగా.. 2022 నాటికి 48 శాతానికి పెరిగిందని తెలిపారు.

తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఇవ్వండి

న్యూఢిల్లీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రధాన కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు టీడీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. గురువారం పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు ఆయనతో భేటీ అయ్యారు. డివిజన్ ప్రతిపాదనను అందజేశారు. సీమ ప్రజల కోసం డివిజన్‌ను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.

మెడికల్ పీజీ ఫీజు రూ.30 వేలు..

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది జరగనున్న పీజీ ప్రవేశాలకు సంబంధించిన వార్షిక ఫీజులను ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ పంపించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు ఆమోదించారు. ప్రభుత్వ కోటా సీటుకు ఏడాదికి రూ.30 వేలుగా నిర్ణయించింది. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.9 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీట్లకు రూ.29 లక్షలుగా ఫీజులు నిర్ధారించింది. 2025-26 ఏడాదికి సంబంధించి విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో 60 పీజీ సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) నిర్ణయం తీసుకుంది. ఇందులో రాజమండ్రి, నంద్యాల మెడికల్ కాలేజీల్లో ఒక్కో దానిలో 16 పీజీ సీట్లు, విజయనగరం, మచిలీపట్నం మెడికల్ కాలేజీల్లో ఒక్కో దానిలో 12 పీజీ సీట్లు, ఏలూరు మెడికల్‌కాలేజీలో 4 పీజీ సీట్లు కేటాయించింది.

హెల్త్ పాలసీ ఆర్ఎఫ్‌పీలో సవరణలకు ఆమోదం

యూనివర్సల్ హెల్త్ పాలసీకి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)లో కొన్ని కీలక సవరణలు చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలసీ ఆర్ఎఫ్‌పీకి రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొన్ని సవరణలు కోరుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో ప్రతిపాదనలు పంపగా సర్కారు ఆమోదముద్ర వేసింది.

వక్ఫ్ ఆస్తులు 100% నమోదు: అబ్దుల్ అజీజ్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదు గడువును ఈ నెల 6 వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం తెలిపారు. తొలుత ఈనెల 5 వరకు గడువు ఉండగా, ఇప్పుడు దాన్ని 6వ తేదీ వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు. కాగా, వక్ఫ్ ఆస్తుల మొత్తం డేటాను అప్‌లోడ్ చేసి, అప్రూవ్ చేయించుకున్న తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచిందన్నారు.

రాష్ట్రంలో మరో ఇద్దరికి స్క్రబ్ టైఫస్..!

ఏలూరు అర్బన్, సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ఇద్దరిలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలేనికి చెందిన ఓ గృహిణి (50) కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ఈ నెల 3న ఆమె శాంపిల్స్‌ను పరీక్షించగా.. స్క్రబ్ టైఫస్ పాజిటివ్ వచ్చింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడలో బత్తుల లూర్దమ్మ అనే మహిళలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి.

నారా భువనేశ్వరి వాహనం తనిఖీ

కూసుమంచి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వాహనాన్ని ఖమ్మం జిల్లా సరిహద్దులో అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాల సరిహద్దులో అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం భువనేశ్వరి హైదరాబాద్ నుంచి ఖమ్మం, అశ్వారావుపేట మీదుగా ఏపీలోని జంగారెడ్డిగూడెం వెళుతుండగా నాయకన్‌గూడెం చెక్‌పోస్టు వద్ద ఖమ్మం పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు.

జగన్ హయాంలో.. రాష్ట్రానికి చెడ్డపేరు

> రాష్ట్రంపై గత పాలకులు బ్యాడ్ ఇమేజీ ముద్ర వేశారు. మేం ఈ ముద్రను చెరిపేశాం. ఇప్పుడు ఏపీకి బ్రాండ్ ఇమేజీ తీసుకొచ్చాం. అందుకే విశాఖ పెట్టుబడుల సదస్సుకు భారీ స్పందన వచ్చింది.
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

సింగపూర్ ప్రభుత్వ పరిశ్రమలను తరిమేయడం వల్లే: సీఎం



ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు గొట్టిపాటి, అనగాని, లోకేశ్, భరత్, నారాయణ, దుర్గేశ్, సీఎస్ విజయానంద్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో సింగపూర్ ప్రభుత్వ సంస్థలను తరిమేశారని.. దానివల్ల రాష్ట్రానికి చెడ్డపేరు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాల్లేవన్న అపప్రథను ఇప్పుడు తొలగించుకున్నామని.. పారిశ్రామికవేత్తల విశ్వాసం పొందగలిగామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో జరిగిన 13వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం గత నెల 14, 15 తేదీల్లో విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికిపైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని వెల్లడించారు. ఒప్పందాలు జరిగిన 45 రోజుల్లోనే శంకుస్థాపనలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తాజా ఎస్ఐపీబీ భేటీలో రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వాటి ద్వారా 56,278 ఉద్యోగాలు దక్కే అవకాశముంది. కంపెనీలకు అవసరమయ్యే నీరు, విద్యుత్, రహదారులు, అనుమతుల్లో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూస్తున్నామని సీఎం అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

20 రోజుల్లోనే ఆచరణ దిశగా ..

ఒప్పందాలు చేసుకున్న ఇరవై రోజుల్లోనే ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాం. విశాఖ సదస్సులో చేసుకున్న ఒప్పందాల్లో ఇప్పటికే రూ.7.69 లక్షల కోట్ల పెట్టుబడులు ఆచరణలోకి వచ్చాయి. మిగిలిన ఎంవోయూలు కూడా వీలైనంత త్వరగా అమలయ్యేలా అధికారులు చూడాలి. సదస్సు ఒప్పందాలను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేస్తే.. ఈసారి దావోస్ ఆర్థిక సదస్సులో మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఇకపై ఎస్ఐపీబీతో పాటు ఎంవోయూలపైనా సమీక్షిస్తా. కలెక్టర్లు కూడా దృష్టిపెట్టాలి.

భూకేటాయింపులపై ఫిర్యాదులు రాకూడదు

భూముల కేటాయింపులో ఎలాంటి ఫిర్యాదులూ రాకూడదు. ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు కావాలి. లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీలు వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటమ్ వ్యాలీకి సలహా సంఘాన్ని నియమించాలి. మెంటరింగ్, మానిటరింగ్, వెంచర్ క్యాపిటల్‌పై ఈ సలహాసంఘం పనిచేయాలి. ఏఐ బేసిక్స్‌ను ఏడో తరగతి నుంచే బోధించాలి.

ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు సాధించాలి

ప్రభుత్వ రంగ సంస్థలు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. యూఏఈ వంటి దేశాల్లో ప్రభుత్వ సంస్థలు రూ.లక్షల కోట్ల సావరిన్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తుంటాయి. ఏపీ కూడా రూ.500 కోట్లతో సావరిన్ ఫండ్ ఏర్పాటు చేయాలి. పశుసంపద పరిశ్రమ రూ.8 లక్షల కోట్లకు చేరాలి.

పెట్టుబడుల ప్రతిపాదనలకు ఓకే

13 సమావేశాల ద్వారా ఇప్పటికి రూ.8.28 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 7,62,148 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలను ఎస్ఐపీబీ ఆమోదించింది. గురువారం ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద 6 కంపెనీలకు ఆమోదం తెలిపింది. మొత్తం 31 కంపెనీల ప్రతిపాదనలను అంగీకరించింది. వీటిలో చింతా ఎనర్జీ (రూ.8,500 కోట్లు-5,800 ఉద్యోగాలు), గనేకో త్రీ ఎనర్జీ (రూ.2,140 కోట్లు-వెయ్యి ఉద్యోగాలు), శ్రేష్ఠ రెన్యువబుల్ (రూ.70 కోట్లు-339 ఉద్యోగాలు), క్యూలైటెక్ (రూ.15 కోట్లు-512 ఉద్యోగాలు) తదితరాలు ఉన్నాయి.

రయ్ రయ్.. రహదారులకు గ్రీన్‌సిగ్నల్

- 11,597 కోట్లతో 441 కి.మీ. మేర హైవేలు
- రాష్ట్ర ప్రతిపాదనలకు జాతీయ రహదారులు, హైవేల సమావేశం ఆమోదం

రాష్ట్రంలో పలు జాతీయ రహదారులు, హైవేల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో రూ. 11,597 కోట్లతో 441 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశానికి రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే ప్రాజెక్టుల వివరాలను కేంద్రానికి అందజేశారు. మొత్తం 24 ప్రాజెక్టులపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. రాష్ట్ర ప్రతిపాదనలను ఆమోదిస్తూ త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తామని కేంద్రం వెల్లడించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)తో కలసి ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ (ఐఆర్ఏడీ) డేటా లేక్ రూపకల్పనకు కేంద్రం సమ్మతించింది.

రాష్ట్రం ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో ముఖ్యమైనవి

- ఖరగ్‌పూర్-కటక్-విశాఖపట్నం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మాణం.
- శ్రీశైలం దేవాలయాన్ని కలుపుతూ ఎన్‌హెచ్ 765 రహదారిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా జాతీయ రహదారి.
- పలమనేరు-కృష్ణగిరి సెక్షన్‌లో కుప్పం మీదుగా నాలుగు లేన్ల రహదారికి డీపీఆర్ తయారీ.
- అమరావతి రాజధాని నగరంలో రింగ్‌రోడ్‌ను 212 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.
- వినుకొండ-గుంటూరు నాలుగు లేన్ల ఓఆర్ఆర్‌కు ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది.
- హైదరాబాద్-గొల్లపూడి నాలుగు లేన్ల రహదారి ఆరు లేన్ల రహదారిగా మార్పు. విజయవాడలోని కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి హైదరాబాద్‌కు ఈ రహదారి విస్తరణ ఉంటుంది.
- విజయవాడ-మచిలీపట్నం ప్రస్తుతం నాలుగు లేన్లగా ఉన్న రహదారిని 64 కిలోమీటర్ల మేర ఆరు లేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదన.
- హైదరాబాద్- అమరావతి- మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ రోడ్ 270 కి. మీ. మేర మార్పులు చేర్పులపై అధ్యయనానికి అంగీకారం.

'సాదా బైనామా'లకు మోక్షం!

- భూముల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుల సమర్పణకు మరో అవకాశం
- 2027 డిసెంబరు 31 వరకు గడువు
- 90 రోజుల్లో రైతుల దరఖాస్తుల పరిష్కారం
- అవకాశాన్ని ఉపయోగించుకోవాలి: మంత్రి అనగాని

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ చిన్న, సన్నకారు రైతులకు సువర్ణావకాశం! సాదాబైనామాలతో జరిగిన భూముల లావాదేవీలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. సంబంధిత పత్రాలతో 2027 డిసెంబరు 31 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఇచ్చింది. 2024 జూన్ 15 నాటికి లావాదేవీలు జరిగి, సాదాబైనామాలు రాసుకున్న భూములపై రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్‌డ్యూటీ మినహాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు (జీవో 467) జారీచేశారు. సాదాబైనామాల రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత మండలం పరిధిలోని మీసేవ, గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు ఫామ్-10తోపాటు దరఖాస్తులు సమర్పించాలి. ఇందుకు కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. భూములు కొన్న వారు లేదా అమ్మిన రైతులు దరఖాస్తులు సమర్పించాలి. వాటిని అధికారులు పరిశీలించి జీవో ప్రకారం చర్యలు తీసుకుంటారు. సాదాబైనామాల రిజిస్ట్రేషన్లపై స్థానిక తహసీల్దార్ నోటిఫికేషన్ ఇచ్చి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడంతో పాటు ఊరూరా ప్రచారం కూడా కల్పిస్తారు. కాగా, రైతులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్దిష్టమైన గడువు విధించింది. 'ఫస్ట్ కమ్ ఫస్ట్' విధానంలో దరఖాస్తుల పరిష్కారం చేయాలని, ఇందులో ఎలాంటి మినహాయింపులకు తావులేదని స్పష్టతనిచ్చింది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని పేద రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు.

సరైన ఆధారాలు సమర్పించలేని పక్షంలో..

గతంలో చిన్న చిన్న కారణాలతో సాదాబైనామాల దరఖాస్తులను తిరస్కరించారని, ఈసారి అలా జరగడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతులు సరైన ఆధారాలు సమర్పించలేని పక్షంలో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి.. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమాచారం, ఇంకా పంటల బీమా, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి వివరాలను తెప్పించుకోవాలని ఆదేశించారు. రైతుకు భూములన్న ప్రాంతంలో చుట్టుపక్కల సాగుదారులను విచారించి వివరాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, తాము విచారణకు వెళ్లినప్పుడు చుట్టుపక్కల రైతులు అందుబాటులో లేరని, సంబంధిత రైతు పొజిషన్‌లో లేరంటూ దరఖాస్తులను తిరస్కరించవద్దని, దరఖాస్తుదారు లేదా చుట్టుపక్కల రైతులు విచారణను వాయిదా వేయాలని కోరితే ఆ పని చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన తేదీల్లో విచారణ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. సాదాబైనామా రిజిస్ట్రేషన్లు గ్రామీణ ప్రాంతంలోని సాగు భూములకే వర్తిస్తుంది. పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జిల్లా, రాష్ట్ర ప్రధాన కేంద్రాలు, నగర ప్రాంతాలు, వాటి పరిధిలోని భూములకు వర్తించదు. అలాగే ప్రభుత్వ, అసైన్డ్ భూములకు ఈ విధానం వర్తించదు.

2026లో సాధారణ సెలవులు 24

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది(2026) సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాధారణ సెలవులు..

పండుగ	తేదీ	వారం
భోగి	14/01/26	బుధవారం
మకర సంక్రాంతి	15/01/26	గురువారం
కనుమ	16/01/26	శుక్రవారం
రిపబ్లిక్ డే	26/01/26	సోమవారం
మహాశివరాత్రి	15/02/26	ఆదివారం
హోళీ	03/03/26	మంగళవారం
ఉగాది	19/03/26	గురువారం
రంజాన్	20/03/26	శుక్రవారం
శ్రీరామనవమి	27/03/26	శుక్రవారం
గుడ్ ఫ్రైడే	03/04/26	శుక్రవారం
జగ్జీవన్‌రామ్ జయంతి	05/04/26	ఆదివారం
అంబేడ్కర్ జయంతి	14/04/26	మంగళవారం
బక్రీద్	27/05/26	బుధవారం
మొహర్రం	25/06/26	గురువారం
స్వాతంత్ర్య దినం	15/08/26	శనివారం
వరలక్ష్మీ వ్రతం	21/08/26	శుక్రవారం
మిలాద్-ఉన్-నబీ	25/08/26	మంగళవారం
శ్రీకృష్ణాష్టమి	04/09/26	శుక్రవారం
వినాయక చవితి	14/09/26	సోమవారం
గాంధీ జయంతి	02/10/26	శుక్రవారం
దుర్గాష్టమి	18/10/26	ఆదివారం
విజయదశమి	20/10/26	మంగళవారం
దీపావళి	08/11/26	ఆదివారం
క్రిస్మస్	25/12/26	శుక్రవారం

ఐచ్ఛిక సెలవులు..

నూతన సంవత్సరం	01/01/26	గురువారం
హజ్రత్ అలీ జయంతి	03/01/26	శనివారం
షబ్-ఎ-మేరాజ్	16/01/26	శుక్రవారం
షబ్-ఎ-బరాత్	03/02/26	మంగళవారం
షహదత్ హజ్రత్ అలీ	11/03/26	బుధవారం
జమాతుల్ వాద	13/03/26	శుక్రవారం
షబ్-ఎ-ఖదర్	15/03/26	ఆదివారం
మహావీర్ జయంతి	31/03/26	మంగళవారం
బసవ జయంతి	20/04/26	సోమవారం
బుద్ధ పూర్ణిమ	01/05/26	శుక్రవారం
ఈద్-ఎ-గదీర్	03/06/26	బుధవారం
మొహర్రం	16/06/26	మంగళవారం
రథయాత్ర	16/07/26	గురువారం
అర్బయీన్	04/08/26	మంగళవారం
పార్శీల నూతన సంవత్సరాది	15/08/26	శనివారం
యజ్ దహుమ్ షరీఫ్	22/09/26	మంగళవారం
మహాలయ అమావాస్య	10/10/26	శనివారం
హజ్రత్ సయ్యద్ మొహమ్మద్ జువన్‌పురి మెహదీ జయంతి	27/10/26	మంగళవారం
గురునానక్ జయంతి	24/11/26	మంగళవారం
క్రిస్మస్ ఈవ్	24/12/26	గురువారం
బాక్సింగ్ డే	26/12/26	శనివారం

స్వతంత్రంగా పంచాయతీలు

- డీడీవో కార్యాలయాలతో పౌర సేవలు విస్తృతం
- 10 వేల మందికి ప్రమోషన్లతో న్యాయం చేశాం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- చిత్తూరు నుంచి వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభం
- వివిధ జిల్లాల్లో పాల్గొన్న స్పీకర్, మంత్రులు



చిత్తూరులో స్వచ్ఛ రథాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

చిత్తూరు/అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వ పాలనలో నిస్తేజంగా మారిన పంచాయతీలు ఇకనుంచి స్వతంత్రంగా వ్యవహరించనున్నాయి. స్థానిక సమస్యల పరిష్కారానికి ఆయా కార్యాలయాల చుట్టూ తిరగకుండా పంచాయతీలోనే తీర్మానం చేసుకొని పరిష్కరించుకొనేలా చేస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చిత్తూరు వేదికగా గురువారం ఆయన రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సంస్కరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను ప్రారంభించాం. డీడీవో వ్యవస్థతో పౌర సేవలు విస్తృతమవుతాయి. క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల పర్యవేక్షణకు వీలుంటుంది. ప్రభుత్వ ఆదేశాలు వెంటనే క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి' అని పేర్కొన్నారు.

స్వయం పాలన సంస్థలుగా పంచాయతీలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగుల ప్రమోషన్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని పవన్ తెలిపారు. 'వీడీవో, ఎంపీడీవోలు అవే హోదాల్లో రిటైరవుతున్నారు. మేం తీసుకున్న ఈ నిర్ణయంతో దాదాపు 10 వేల మందికి ప్రమోషన్లు ఇచ్చి న్యాయం చేశాం' అని తెలిపారు. డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను 77 డీడీవో కార్యాలయాల నుంచి వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, సవిత, మనోహర్‌తో పవన్ మాట్లాడారు. నర్సీపట్నం డీడీవో కార్యాలయం నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు కనిపించే సరికి, 'మీరు వస్తారని అనుకోలేదు' అని పవన్ అన్నారు. దీనికి అయ్యన్న మాట్లాడుతూ డీడీవో వ్యవస్థ బలోపేతం గొప్ప నిర్ణయమన్నారు. టెక్కలి నుంచి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ డీడీవో కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా మారనున్నాయని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి కీలకం కానుందన్నారు. ఆత్మకూరు నుంచి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 'అన్ని కార్యాలయాలు ఒకే తరహాలో నిర్మించాలి' అన్నారు. పెనుగొండ నుంచి సవిత మాట్లాడుతూ డీడీవో కార్యాలయాలు ప్రత్యేక భవనంలో ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై స్పందించిన పవన్.. 'ప్రస్తుతం ప్రారంభించిన కార్యాలయాలన్నీ ప్రభుత్వ భవనాలేనని, రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చు చేసి వసతులు కల్పించామని చెప్పారు.

హడావిడి లేనందుకు సంతోషం

పవన్ పర్యటనలో చిత్తూరు జిల్లా అధికార యంత్రాంగం ఆయన ఆలోచనల్ని పూర్తిస్థాయిలో ఆచరణలో పెట్టింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పవన్‌కు బొకేలు ఇవ్వడం, శాలువాలతో సత్కరించడం వంటివి చేయలేదు. ఏ హడావిడి లేనందున సంతోషంగాఉందని వారిని పవన్ అభినందించారు.

పాడేరు డీడీవోకు అభినందన

పాడేరు డీడీవో జయప్రకాశ్‌తో పవన్ మాట్లాడారు. 'గతంలో అల్లూరి జిల్లాలో పనిచేసి ప్రస్తుతం చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న సుమిత్‌కుమార్ 17 వేల ఎకరాల్లో గంజాయి సాగును అరికట్టి, ఉపాధి హామీ పథకం ద్వారా ప్లాంటేషన్ చేయించారు. మీరు దాన్ని కొనసాగిస్తూ 35 వేల ఎకరాలకు తీసుకెళ్లారు. అభినందనీయం' అని కొనియాడారు.

డీడీవో కార్యాలయాల కేంద్రంగా సరికొత్త పాలన

రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజన్లలో డీడీవో కార్యాలయాల ప్రారంభం ఓ సువర్ణాధ్యాయమని ఏపీ పంచాయతీరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) హర్షం వ్యక్తంచేసింది. కూటమి ప్రభుత్వం చొరవతో డివిజన్ స్థాయి పాలన మరింత సమన్వయంతో సాగుతుందని జేఏసీ చైర్మన్ కేఎస్ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి వైవీడీ ప్రసాద్, డి.వెంకట్రావు, కేఎన్‌వీ ప్రసాదరావు ఆశాభావం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ లక్ష్యాలు సాధించేలా ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

పవన్ మాటలను వక్రీకరిస్తున్నారు

- పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్

కోనసీమ కొబ్బరి తోటల నష్టాల సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను కొందరు తెలంగాణ నేతలు వక్రీకరిస్తున్నారని మంత్రి దుర్గేశ్ అన్నారు. పవన్‌కు తెలంగాణపై ఉన్న అభిమానాన్ని ఎవరూ శంకించలేరని, తెలంగాణను కించపర్చాలనే ఉద్దేశంతో ఆయన ఎప్పుడూ మాట్లాడలేదని చెప్పారు. 'తల్లి.. బిడ్డకు దిష్టితీసేటప్పుడు.. ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి, నా దిష్టి తగలకూడదని అనడం సహజం. అలాగే కొబ్బరి తోటల విషయంలో మాట్లాడారే తప్పితే తెలంగాణను కించపర్చడానికి కాదు. ఆయన క్యాజువల్‌గా అన్నమాటలను సీరియస్‌గా తీసుకోవద్దు. ఇక్కడితో ఇది పరిసమాప్తం కావాలని కోరుకుంటున్నాం' అని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి.. కూటమి ఐక్యతే మూలం

- చిన్న చిన్న మనస్పర్థలు సహజం: పవన్

చిత్తూరు సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీల నేతల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం చిత్తూరులో డీడీవో కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం కూటమి పార్టీల నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'వర్షించని మేఘం... శ్రమించని మేధావి' ఉన్నా, లేకపోయినా ఒక్కటేనని, కూటమి ప్రభుత్వానికి ఇంత బలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పు తీసుకురాకపోతే మనకు ఎన్ని పదవులున్నా నిష్ప్రయోజనమేనని చెప్పారు. మూడు పార్టీల నాయకులకు విభిన్న భావజాలాలున్నా 'రాష్ట్రం బాగుండాలి-అరాచకాలు ఉండకూడదు' అనే సదుద్దేశంతో ఒకే గొడుగు కిందకు వచ్చి కూటమిగా ఏర్పడ్డామన్నారు. మనలో మనకు చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్, మనస్పర్థలు ఉండడం సహజమేనని, ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని సూచించారు. వైసీపీ పాలనలో దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెడుతున్నామని చెప్పారు. నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబునే రాష్ట్రంలో ఒక నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వబోమంటూ వైసీపీ పాలకులు మాట్లాడారని.. పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేయడానికి భయపెట్టారని గుర్తుచేశారు. చిత్తూరు జిల్లాకే తలమానికమైన శేషాచలం అడవులను అడ్డగోలుగా దోచేశారని, అలాంటి వాళ్లను మనం నిలువరించాలన్నారు. అవినీతిని అరికట్టి బలహీనుల గొంతుగా మారాలని పిలుపిచ్చారు. నిస్సహాయులైన వ్యక్తులకు అండగా నిలవడమే నాయకుడి లక్షణమన్నారు. ఏ వ్యక్తికైనా పదవి అనేది బాధ్యత తప్ప అలంకారంగా మారకూడదని చెప్పారు. 'జనసేన నాయకుల ముఖ్య లక్ష్యం సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని నింపడమే. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తనూ గుర్తుపెట్టుకుని వారికి తగిన గుర్తింపు ఇస్తాం. గ్రామ స్థాయి నుంచి లోక్‌సభ నియోజకవర్గం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు.

ఆ ముగ్గురినీ బొక్కలో పెట్టాలి

చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై జగన్ ధ్వజం



అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీనీ అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను అరెస్టు చేసి బొక్కలో పెట్టాలని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు ముఖ్యమంత్రిని చేసినందుకు చంద్రబాబు గాడిదలు కాస్తున్నారా అని అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంకాల మీడియాను ముందు కూర్చోబెట్టుకుని జగన్ దాదాపు 2.43 గంటల సేపు ప్రసంగించారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, రాజ్యాంగేతర (నాణేనికి) ఇటు వైపు ఏముందో బహిర్గతం చేస్తున్నానని అన్నారు. కలుషిత తాగునీటితో వసతి గృహాల్లో పిల్లలు చనిపోతున్నారని ఆరోపించారు. కొత్త మెడికల్ కాలేజీలు 8 మంది ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేశారని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో కోటి సంతకాల ఉద్యమం జరుగుతోందని, ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తవుతుందని, ఆ రోజున నియోజకవర్గాల్లో ఈ పత్రాలు బయలుదేరి 13వ తేదీ నాటికి తాడేపల్లి వైసీపీ కార్యాలయానికి చేరుతాయని వెల్లడించారు. వాటిని 16వ తేదీన గవర్నర్‌కు అందజేస్తామని, ఆ తర్వాత మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అనే రీతిలో చంద్రబాబు పాలన సాగుతోందని, రైతుల పరిస్థితి చూస్తే జాలేస్తోందని అన్నారు. అందరూ హలో ఇండియా 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అని నినదిస్తున్నారని అన్నారు. 62 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉండగా, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటిదాకా ఆదుకోలేదని విమర్శించారు. తమ హయాంలో వ్యవసాయ పండగైతే .. కూటమి పాలనలో వ్యవసాయం దండగలా మారిపోయిందని అన్నారు. రైతులకు ఉచిత పంటల బీమా కింద ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో పంట నష్టపరిహారం అందడం లేదని, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక 17 సార్లు తుపానులు వచ్చి పంట నష్టం జరిగిందన్నారు. రైతుల ముందు కెళితే చంద్రబాబును తంతారని, అందుకే లేక పోతున్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు పైసా సాయం కూడా అందలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడిస్తారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఎన్నో కష్టాలకోర్చి పంటలు వేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. గతేడాది ధాన్యం, కందులు, మినుములు, పెసలు, ఉల్లి, టమోటా, చీనీ, మామిడి పంటలకు గిట్టుబాటు ధరలు లేవని అన్నారు. మొంథా తుపానుకు తడిసిన ధాన్యం కొనేనాథుడే లేరన్నారు. ధాన్యానికి రూ.1300 దర కుదుతున్నారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ ప్రభుత్వం ఎలా స్పందించేదో ఒకసారి గుర్తు చేసుకోవాలని రైతులను కోరారు. యుద్ధ ప్రాతిపదికన సహాయం చేసేవారిమని జగన్ అన్నారు.

అమాయకులపై కేసులు

రైతన్న కోసం అంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు కానీ చంద్రబాబు రైతు దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదని జగన్ అన్నారు. అడ్వర్టైజ్‌మెంట్లతో బుల్డోజ్ చేస్తూ చంద్రబాబు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, గోబెల్స్‌కు ఆయన మాస్టర్ అని అన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని ఎవరు చెప్పారు? లడ్డూలో అసలే కలిశాయా అని ప్రశ్నించారు. చంద్రబాబు హామీలన్నీ మోసమేనని, జైల్లో పెట్టి తన్నాలని వ్యాఖ్యానించారు. ఆయన బెయిల్ షరతులన్నీ ఉల్లంఘిస్తున్నారని, అధికారులను భయపెట్టి కేసులు కొట్టేయించుకుంటున్నారని ఆరోపించారు. అమాయకులైన జోగి రమేశ్, పిన్నెల్లి సోదరులు, వల్లభనేని వంశీ, మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పను తప్పుడు కేసుల్లో ఇరికించారని విమర్శించారు. అమాయకులైన వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డిని గంజాయి కేసులో ఇరికించారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీని ఖూనీ చేశారని, నాడు-నేడు విద్యావ్యవస్థ కుప్పకూలిందని, ఇంగ్లిష్ మీడియం లేకుండా చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు నెలకు రూ.1500 ఇస్తానని ఎగవేశారని, ఏటా పంట నష్టపరిహారం చెల్లించడం లేదని, ఉచిత బీమా నిర్వీర్యమైపోయిందని ఆరోపించారు. పులివెందులలో అరటి పంటను ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునేలా కోల్డ్ స్టోరేజీని నిర్మిస్తే, దానిని వినియోగించకుండా రైతులకు నష్టం చేకూర్చారని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ చంద్రబాబు మోసం చేస్తున్నారని అన్నారు.

డైవర్ట్ అయిపోతుందంటూ..

మీడియా ప్రతినిధులు ప్రశ్నలు వేసేందుకు సిద్ధమయ్యేసరికి సమయమైపోయిందంటూ జగన్ లేచి వెళ్లిపోయారు. మొదట రాజధాని భూములపై ప్రశ్నించినప్పుడు హెరిటేజ్ సంస్థ గుండా రింగ్ రోడ్డు వెళ్లేందుకు స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. మూడు రాజధానుల అంశాన్ని మీడియా ప్రతినిధి ప్రస్తావించినప్పుడు ఒక్క ఉదుటన కుర్చీలోనుంచి జగన్ లేచారు. ఇప్పటికే సమయం అయిపోయిందని.. రెండు గంటలు దాటిపోయిందని అన్నారు. ఇప్పుడు ఈ సబ్జెక్ట్ మీద మాట్లాడితే.. ఇప్పటి దాకా తాను మాట్లాడినదంతా డైవర్ట్ అయిపోతుందంటూ వెళ్లిపోయారు.

అబ్బాయికి బాబాయే షాకిచ్చినా..!

కల్తీ నెయ్యి కేసులో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్నను సిట్ అరెస్టు చేసింది. దీనిపై జగన్ మాట్లాడుతూ.. అప్పన్న టీడీపీ ఎంపీ వేమిరెడ్డి దగ్గర పని చేస్తుండగా, సుబ్బారెడ్డికి ఆయన పీఏ అంటూ ప్రచారం చేస్తున్నారని వాదించారు. అయితే, చిన్నాన్న సుబ్బారెడ్డి స్వయంగా తన వద్ద అప్పన్న గతంలో పనిచేసేవాడని వెల్లడించడం ఇక్కడ గమనార్హం. జగన్ గాబు గుయ్యిమనేలా సుబ్బారెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. అయినా జగన్ తీరు మారలేదు. అప్పన్న ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నాడన్నది కాదు... కల్తీ నెయ్యి మాటున జరిగినప్పుడు సరఫరా దారుల నుంచి కమీషన్లు ఆయన వసూలు చేశారా..లేదా? ఆ సమయంలో సుబ్బారెడ్డి పీఏగా అప్పన్న ఉన్నారా...లేదా? అనేది ముఖ్యం. కానీ, దీనిపై మాత్రం జగన్ పెదవి విప్పలేదు.

వాడూ.. వీడూ.. ఎవడు!?

- ఐపీఎస్‌లపై జగన్ అనుచిత వ్యాఖ్యలు
- పరకామణి చోరీ చిన్న విషయమేనట!
- కల్తీ నెయ్యిపై దర్యాప్తు చెయ్యొద్దట

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ సిద్ధాంతం ప్రకారం... తిరుమల పరకామణిలో చోరీ చేయడం చాలా చిన్న విషయం! శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేయడం ఇంకా పెద్ద నేరం! సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నా సరే... అది చాలా పెద్ద ఘోరం! గురువారం జగన్ చేసిన వ్యాఖ్యలను చూస్తే ఇదే అనిపిస్తుంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను తిట్టిపోయడంతోపాటు... సీనియర్ ఐపీఎస్‌లను జగన్ 'వాడు, వీడు' అంటూ దూషించారు. ఐపీఎస్‌లకు రాజకీయాలు అంటగట్టి, తలాతోక లేని ఆరోపణలకు తెగబడ్డారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు దర్యాప్తులో భాగంగా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డిని సీబీఐ జేడీ నేతృత్వంలోని సిట్ ఇటీవల ప్రశ్నించింది. ఇదే పెద్ద తప్పు అన్నట్లు జగన్ మాట్లాడారు. బసవతారకం ట్రస్టుకు సంబంధించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో కలిసి ఏపీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ కృష్ణయ్య పాల్గొన్న ఫొటో చూపిస్తూ... 'వీడి బంధువే.. వాడెవడో గోపీనాథ్ జెట్టి...' అంటూ విశాఖ రేంజ్ డీఐజీని అవమానించారు. నిజానికి... లడ్డూ కల్తీ వ్యవహారంపై 'సిట్' ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదు. సీబీఐ, రాష్ట్ర పోలీసులతో కలిసి దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని స్వయానా సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు నేతృత్వంలోని 'సిట్‌'లో ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారులు ఎస్.ఎస్. త్రిపాఠీ, గోపీనాథ్ జెట్టి సభ్యులుగా ఉన్నారు. అసలు విషయం ఏమిటంటే... వైవీ సుబ్బారెడ్డి పిటిషన్ ఆధారంగానే సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. సీబీఐ అధికారుల పేర్లు ప్రస్తావిస్తే తనపై ఇప్పటికే ఉన్న 11 కేసుల్లో ఇబ్బంది పడాల్సి వస్తుందన్న భయంతో... ఏపీ కేడర్ అధికారులపైనే జగన్ విషం చిమ్మారు. పల్నాడులో జగన్ పార్టీకి చెందిన పిన్నెల్లి సోదరులు ఎన్నికల్లో చేసిన వీరంగం వీడియోలతో సహా బయట పడింది. మహిళా ఏజెంట్ నుదుటిపై గొడ్డలితో నరికిన వ్యక్తులను త్రిపాఠీ అరెస్టు చేయించారు. ఆ కక్షతోనే కాబోలు... 'ఆయన ఏమేమి వీరంగం చేశారో...' అంటూ త్రిపాఠీని ఉద్దేశించి జగన్ నోరు పారేసుకున్నారు. గోపీనాథ్ జెట్టి తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు జగన్‌కు అత్యంత సన్నిహితుడైన ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని విదేశీ న్యాయస్థానాలను ఒప్పించి మరీ విమానంలో భారత్‌కు తీసుకొచ్చి జైల్లో పెట్టారు. పోలీసు శాఖలో గోపీనాథ్ జెట్టికి నిజాయితీపరుడు, సమర్థుడిగా పేరుంది. జగన్ ప్రభుత్వ హయాంలో విశాఖ మన్యంలో పెరిగిన గంజాయితోపాటు, దాని మూలాల్ని పెకిలిస్తున్న జెట్టిపై జగన్ అహంకారం ప్రదర్శించారంటూ పోలీసులు మండిపడుతున్నారు.

దొంగకు వత్తాసు...

పరకామణిలో జరిగింది చిన్న చోరీ అని జగన్ అభివర్ణించారు. రూ.72 వేలు విలువ చేసే తొమ్మిది యూఎస్ డాలర్లు తస్కరించిన దొంగ కుటుంబసభ్యులు పశ్చాత్తాపంతో 14కోట్ల విలువైన ఆస్తులు దేవుడికి ఇవ్వడం తప్పవుతుందా? అని జగన్ అమాయకంగా ప్రశ్నించారు. ఆయన ఉద్దేశంలో ఇది తప్పు కాకపోవచ్చు. కానీ... చోరీకి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవడం మాత్రం తప్పే! దీనిని హైకోర్టు తప్పు పట్టింది. దీంతో... ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. జగన్ దీనిని కూడా రాజకీయం చేసేశారు. ఈ చోరీని సమర్థిస్తూ.. సింహాచలం దేవస్థానంలో రూ.55వేలు దొంగతనం చేస్తూ పట్టుబడ్డ అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి స్టేషన్ బెయిలు ఎందుకిచ్చారనీ, జైల్లో పెట్టి ఆస్తులెందుకు స్వాధీనం చేసుకోలేదని వింత ప్రశ్నలు వేశారు.

కోర్టులూ ధ్రువీకరించాయి కదా!

తన హయాంలో జరిగిన మద్యం స్కామ్‌ను వెలికి తీస్తున్న సిట్ అధికారులపైనా జగన్ విషం కక్కారు. అసలు కుంభకోణమే జరగని లిక్కర్ కేసులో ఏవేవో సృష్టించి....చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్ రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, రాజ్ కసిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప విజయవాడ ఏసీబీ కోర్టు, ఏపీ హైకోర్టు, అంతిమంగా సుప్రీం కోర్టు వరకూ వెళ్లినా సిట్ ఆధారాలనే కోర్టులు సమర్థించాయి. లొంగిపోవాలని వారికి సూచించాయి. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టారంటూ జగన్ వాపోయారు. ఆయన అధికారంలో ఉండగా వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మహిళలు, న్యాయమూర్తులు, ప్రతిపక్ష నేతలు, కుటుంబ సభ్యులపై జుగుప్సాకరమైన పోస్టులు పెడుతూ, వైరల్ చేసిన విషయాన్ని మరిచారు.

అరటిపైనా అబద్ధాలు

కిలో అర్ధ రూపాయంటూ జగన్ ప్రచారం

- పులివెందుల మార్కెట్లో నాణ్యమైన అరటి టన్ను రూ.5-6 వేలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పులివెందుల... మాజీ సీఎం జగన్ సొంతగడ్డ. ఆయన పులివెందుల ఎమ్మెల్యే కూడా. అదే పులివెందుల మార్కెట్లో ప్రస్తుతం నాణ్యత గల అరటి టన్ను రూ.5-6 వేల మధ్య ధర పలుకుతోంది. బయటి వ్యాపారులు ఈ మేరకు కొనుగోలు చేస్తున్నారని రైతులే చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి ఆర్డర్లు పెద్దగా లేకపోవడంతో... లోకల్‌గా కూడా టన్ను రూ.2-3 వేలకు కొనుగోలు చేస్తున్నారు. కానీ కిలో అర్ధ రూపాయి కూడా పలకట్లేదని జగన్ అన్నారు. దీంతో రైతులతో పాటు వ్యాపారులూ ముక్కున వేలేసుకుంటున్నారు. వాస్తవానికి రాయలసీమ అరటికి నెల రోజులుగా డిమాండ్ లేకుండా పోయింది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై మార్కెట్లకు ఎగుమతులు మందగించాయి. గెలలు దింపాక రెండు వారాలు కూడా నిల్వ ఉండని అరటికి మొదటి నుంచీ డిమాండ్ తక్కువే. పంట ఎక్కువగా ఉంటే ధర తగ్గడం సహజం. ఈ ఏడాది ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో అరటి ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో తక్కువ ధరకు వస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, హరియాణా వంటి పెద్ద మార్కెట్లకు అరటి గెలలు ఇబ్బడిముబ్బడిగా చేరుతున్నాయి. దీంతో అక్కడి వ్యాపారులు దూరప్రాంతంలో ఉన్న రాయలసీమ నుంచి అరటి కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. కొవిడ్ సమయంలో అరటికి డిమాండ్ ఉండడంతో కిసాన్ రైళ్లలో ఉత్తరాది రాష్ట్రాలకు సీమ రైతులు ఎగుమతి చేశారు. తర్వాతి కాలంలో కూడా అడపాదడపా రైళ్లలో ఎగుమతులు సాగుతూనే ఉన్నాయి. గతేడాది కూడా టన్ను రూ.25-27 వేలు పలికింది. కానీ ప్రస్తుత సీజన్‌లో ఉత్తరాది రాష్ట్రాల్లో అరటి ఉత్పత్తి బాగా పెరగడంతో.. రాయలసీమ అరటికి డిమాండ్ తగ్గింది. మరోవైపు సీమలో అరటి సాగు ఏటేటా పెరుగుతూనే ఉంది. ఎగుమతి ఆర్డర్లు లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి ఉద్యానశాఖ అధికారులు, రైతు ప్రతినిధుల బృందాన్ని ఢిల్లీ, హరియాణా మార్కెట్లకు పంపించింది. పెద్ద వ్యాపారులతో చర్చించింది. అయితే యూపీ, మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకే అరటి లభిస్తున్నందున డిసెంబరు మొదటి వారం తర్వాత సీమకు వస్తామని అక్కడి వ్యాపారులు చెప్పారు. దీనిపై ఉద్యానశాఖ అధికారులు ఇతర రాష్ట్రాల వ్యాపారులతో చర్చలు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కడప, అనంతపురం, కర్నూలుతో పాటు ఉభయగోదావరి, విజయనగరం జిల్లాల్లో అరటి ప్రధానంగా సాగవుతోంది. 1.30 లక్షల హెక్టార్లలో 87.10 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. సీమ క్లస్టర్‌లో గ్రాండ్ నైన్ రకమే 45 వేల హెక్టార్లలో, 100% మైక్రో ఇరిగేషన్, ఫర్టిగేషన్‌తో కలిపి సాగులో ఉంది.

ధర పెరుగుతోంది: ఉద్యాన డైరెక్టర్

ప్రభుత్వ చర్యల ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాల అగ్రిగ్రేటర్లు ఏపీ నుంచి అరటిని సేకరించడం ప్రారంభించడంతో కడప, అనంతపురం జిల్లాల నుంచి తాజాగా 700 టన్నుల అరటి ఉత్తరాది మార్కెట్లకు ఎగుమతి అయినట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రాయలసీమలో గత వారంలో టన్ను రూ.2 వేలున్న ధర ప్రస్తుతం రూ.4 వేలతో రెట్టింపు అయిందని చెప్పారు.

రైతులపై జగన్ మొసలి కన్నీరు: నాదెండ్ల

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన ఐదేళ్ల పాలనలో రైతులను నిండా ముంచి.. వారి శ్రమను నిలువునా దోచుకున్న జగన్.. ఇప్పుడు రైతులకు అన్యాయం జరిగిపోతోందంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. రైతుకు ఏ కష్టమొచ్చినా పవన్ కల్యాణ్ ముందుంటారని, అలాంటి పవన్‌ను విమర్శించే స్థాయి, అర్హత జగన్‌కు లేవని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జగన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు కులం, మతం అంటగడుతున్న ఆయనకు ఇంగితం లేదన్నారు. గురువారం విజయవాడలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1450 నుంచి 1650 మద్దతు ధర చెల్లించగా.. కూటమి ప్రభుత్వం 1,792 చెల్లిస్తోంది. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు కూడా 5.20 లక్షల టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేసి చేతులెత్తేసింది. ఆ ధాన్యానికి చెల్లించాల్సిన రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోతే.. మా ప్రభుత్వమే చెల్లించింది. ఆయన హయాంలో మద్దతు ధర చెల్లించకుండా నెలల తరబడి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే.. ఇప్పుడు 4 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం' అని చెప్పారు.

వెంకన్న హుండీ దోపిడీ చిన్న చోరీనా: లోకేశ్

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'జనం సొమ్ము లక్షల కోట్లలో దోచేసిన మీకు వెంకన్న హుండీ దోపిడీ చిన్న చోరీలా కనిపిస్తోందా? మహాపాపం' అని మంత్రి లోకేశ్ జగన్‌ను ఉద్దేశించి ఎక్స్‌లో పోస్టు చేశారు. తన పోస్టుకు జగన్.. పరకామణి చోరీపై చేసిన వ్యాఖ్యల వీడియోను ట్యాగ్ చేశారు.

సంక్షేమ పథకాలు అమలు కావడం లేదా?

- బయటికి వచ్చి వాస్తవాలు తెలుసుకో జగన్: కందుల దుర్గేశ్

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ రెండు నెలలకోసారి తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి రెండు, మూడు గంటలు మీడియా సమావేశం పెట్టి ప్రభుత్వంపై తన అక్కసు వెళ్లగక్కుతున్నారని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ మండిపడ్డారు. తన ఉనికి కాపాడుకోవాలనే తాపత్రయంతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అమరావతి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ బయటకి వచ్చి వాస్తవాలు తెలుసుకోండి.. బయటకి వచ్చినా మీకు వినిపించడం లేదంటే మీకు వినికిడి సమస్య అయినా ఉండాలి.. కంటి చూపైనా మందగించి ఉండాలి. లేదా.. వాస్తవాలు తెలుసుకోవాలనుకుంటే తాము ఏం చేశామో గణాంకాలు ఇస్తామ'ని మంత్రి జగన్‌పై మండిపడ్డారు. పవన్‌ను మాంత్రికుడని వైసీపీ నేత పేర్ని నాని వ్యాఖ్యానించడం దారుణమని, మాంత్రికుడి వేషం వేసేదే ఆయన అని దుర్గేశ్ విమర్శించారు. వ్యక్తిగతంగా కించపరచడమే వైసీపీ సంస్కృతి అని మండిపడ్డారు.

సమాజాన్ని నాశనం చేసేవారికి జగన్ దన్ను: కొల్లు

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సర్వనాశనం చేసే వ్యక్తులను జగన్ వెనకేసుకురావడం ఏమిటని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. ఆఖరి గంజాయితో దొరికిన వైసీపీ నాయకులను ఇబ్బంది పెడుతున్నారని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నరరూప రాక్షసుడులాంటి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని దేవతామూర్తిగా చూపించాలని చూస్తున్నారా.. జోగి రమేశ్ లాంటి వ్యక్తులను అద్భుతమైన వ్యక్తులుగా చూపించాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. పరకామణి కేసులో వేంకటేశ్వరస్వామి హుండీ డబ్బులు కొట్టేసిన వారిని వెనకేసుకొచ్చి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు.

జగన్‌కు తెలిసే పరకామణి చోరీ: వర్ల

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరకామణి కేసుపై జగన్ మాట్లాడింది చూస్తే చోరీ వ్యవహారం, అందులో భూమన, వైవీ సుబ్బారెడ్డి పాత్ర అంతా జగన్‌కు తెలిసే జరిగినట్లు అనిపిస్తోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకన్న సొమ్ము దోచేసిన రవికుమార్, తాను దొంగలించిన సొత్తులో రూ.14.5 కోట్లు తిరిగి స్వామి వారికి గిఫ్ట్‌గా రాస్తే, చంద్రబాబు ఎప్పుడైనా స్వామి వారికి అలా ఇచ్చారా అని జగన్ అనడం అతడి పిచ్చివాగుడుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం: యనమల

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక క్రమశిక్షణకు ఉద్దేశించిన ఎఫ్ఆర్‌ఎంబీ(ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనలను జగన్ తన పాలనలో ఎప్పుడూ పాటించలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో బడ్జెట్ రుణాలు 6.5 లక్షల కోట్లకు చేరాయని, ఇది జీఎస్డీపీలో 35 శాతమని తెలిపారు. ఆ రుణాలను ఎక్కడ ఖర్చు చేశారో కూడా లెక్కలు లేవన్నారు. కాగా.. జగన్ మైనార్టీల ద్రోహి అని, 2014-19 మధ్య కాలంలో మైనార్టీలకు చెందిన 11 సంక్షేమ పథకాలను జగన్ అధికారంలోకి రాగానే రద్దు చేశారని టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విమర్శించారు. జగన్ హయాంలో వేలాది ఎకరాల వక్ఫ్ భూములను కబ్జా చేశారని, 12 మైనార్టీ గురుకులాలకు ఒక్క రూపాయీ ఇవ్వలేదని ధ్వజమెత్తారు.

ఉత్తరాంధ్ర ఏపీకే తలమానికం

- మరో 15 ఏళ్లు కూటమిదే అధికారం
- గత ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ లేదు నాపైనే 23 కేసులు పెట్టారు
- రప్పా రప్పా బ్యాచ్‌కు బుద్ధి చెప్పాం: లోకేశ్



పాలకొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేశ్

పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతం కాదని, ఆంధ్రప్రదేశ్‌కే తలమానికంగా తయారు చేస్తామని మంత్రి లోకేశ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామ సమీపంలో గురువారం రాత్రి ఆయన పాలకొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఉత్తరాంధ్రలో 33 అసెంబ్లీ సీట్లు ఉండగా, 31 సీట్లను ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి ఇచ్చారని అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నామని, ఐటీ తదితర కంపెనీలను ఉత్తరాంధ్ర జిల్లాలకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టో మేరకు ప్రాధాన్య క్రమంలో హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా సకాలంలో ఇచ్చిన పరిస్థితి లేదని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామన్నారు. సామాజిక పింఛన్లు ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వనివిధంగా ఏపీలో లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. కూటమి ఐక్యత ఎల్లప్పుడూ ఉంటుందని, చిన్నపాటి సమస్యలు వచ్చినా కుటుంబసభ్యుల మాదిరిగా చర్చించి సమస్య పరిష్కరించుకుంటామని తెలిపారు. 2019-24 మధ్య ఒక సైకో పాలన కొనసాగిందని, ఈ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని దుయ్యబట్టారు. కత్తులతో దాడులు చేసినా జై చంద్రబాబు అంటూ నినాదాలు ఇచ్చిన తోట చంద్రయ్య ప్రతి టీడీపీ కార్యకర్తకూ ఆదర్శమన్నారు. కార్యకర్తల కష్టం, శ్రమ ఫలితంగానే కూటమి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. చంద్రబాబును అన్యాయంగా జైల్లో పెట్టినప్పుడు ప్రతీ కార్యకర్త రోడ్డుపైకి వచ్చి మద్దతు తెలపడాన్ని తాను ఎప్పుడూ మరిచిపోనని అన్నారు. గిరిజనుల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో వారి సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఉక్కును కాపాడిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వానిదేనని లోకేశ్ అన్నారు. మెగా డీఎస్సీకి వైసీపీ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని అన్నారు. దళిత డ్రైవర్‌తో పాటు డాక్టర్ సుధాకర్‌ను వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా అంజిరెడ్డి తాత నామినేషన్ వేసేందుకు వెళ్లగా, వైసీపీ నాయకులు లాక్కోవడానికి ప్రయత్నిస్తే తొడకొట్టి నామినేషన్ వేశారని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను అధికారులు గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో తనపై 23 కేసులు పెట్టారని లోకేశ్ చెప్పారు. రప్పా రప్పా బ్యాచ్‌కు తగిన బుద్ధి చెప్పామన్నారు.



నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌ను చుట్టుముట్టిన వరద నీరు

ముంచిన వాన

- నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎడతెరపిలేని వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దిత్వా తుపాను అవశేషంగా కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా పొంగి పొర్లుతున్నాయి. నెల్లూరులో ఏ వీధి చూసినా మోకాలిలోతు నీళ్లు పారుతున్నాయి.ఆ జిల్లాలో 90 శాతానికిపైగా చెరువులు నిండిపోవడంతో అలుగులు దాటి పొలాలపైకి నీరు పారుతోంది. పలు చోట్ల గండ్లు కొట్టారు. నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి వద్ద నెల్లూరు కాలువలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు.

నేటి నుంచి పెరగనున్న చలి

అల్పపీడనం గురువారం పూర్తిగా బలహీనపడింది. అయినప్పటికీ బంగాళాఖాతం నుంచి వీస్తున్న తేమగాలులకు నెల్లూరు, తిరుపతి, వాటికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. శుక్ర, శనివారాలు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తుఫాన్ బలహీనపడిన నేపథ్యంలో ఉత్తరాది నుంచి చలిగాలుల జోరు పెరిగింది.

రైతులకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా?

- అన్నదాతలను తప్పుదారి పట్టిస్తున్న పులివెందుల ఎమ్మెల్యే: అచ్చెన్న



అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల్ని ప్రతిసారి తప్పుదారి పట్టించే పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి మరోసారి అబద్దాలను ప్రచారం చేయడం దారుణమని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల్ని పట్టించుకోవట్లేదంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. 'ఏడాదిన్నర కూటమి పాలనలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ రైతుల వైపు కన్నెత్తి చూడటం లేదంటున్న జగన్.. నీ ఐదేళ్ల పాలనలో రైతుల్ని ఏం ఉద్ధరించావ్? మా 18 నెలల కాలంలో మేమేం చేశామో బహిరంగ చర్చకు రా' అని సవాల్ విసిరారు. జగన్‌రెడ్డి అనే పిల్లి తాడేపల్లి ప్యాలెస్ నుంచి వారానికోసారి బయటకు వచ్చి విలేకరుల సమావేశం పెట్టిమరీ పచ్చి అబద్దాలు మాట్లాడుతుంటాడని ఆయన మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అచ్చెన్న మీడియాతో మాట్లాడారు. ఇంట్లో టీవీ ముందు కూర్చుని తన పేపరు, తన టీవీల్లో మాట్లాడడం కాదని, దమ్ముంటే శాసనసభకు రావాలని జగన్‌కు అచ్చెన్న సవాల్ విసిరారు. 'జగన్ పాలనలో రైతులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారు. వ్యవసాయ ఆధారిత రంగాలను ఆదర్శంగా నిలపేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంటే.. పంట ఉత్పత్తుల ధరలు పతనమయ్యాయంటూ జగన్ విమర్శలు చేయడం హాస్యాస్పదం. 2023లో అధిక వర్షాలకు రైతులు నష్టపోతే జొన్న, మొక్కజొన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు రూ.5కోట్లు విడుదల చేయకుండా ఎగ్గొట్టిన జగన్‌కు 18నెలల కాలంలో 16 విపత్తులు వస్తే.. ఒక్కసారైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని అడిగే నైతిక హక్కు ఎక్కడది? రైతుల్ని మోసం చేసిందెవరో జగన్ ప్రెస్‌మీట్‌తోనే తేలిపోయింది. గోబెల్స్ ప్రచారం ఎవరిదో రైతులకు అర్థమైంది. కూటమి సర్కార్‌పై ప్రజలు చూపుతున్న విశ్వాసాన్ని చూడలేక ఇంకా తప్పుడు కూతలు కూస్తున్న జగన్‌కు మళ్లీ ప్రజలే బుద్ధి చెప్తారు" అని హెచ్చరించారు. జగన్ రెడ్డిలా తాము బెంగళూరు, తాడేపల్లి ప్యాలెస్‌లలో కూర్చోవడం లేదని, గత ఆరు రోజులుగా రాష్ట్రంలో 55లక్షల మంది రైతులను కలిసి మాట్లాడామని అచ్చెన్న తెలిపారు.

18 నెలల్లో 18 రోజులు కూడా ఏపీలో లేరు: అనిత



విజయనగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం 18 నెలల పాలనలో జగన్మోహన్‌రెడ్డి 18 రోజులు కూడా ఆంధ్రప్రదేశ్‌లో లేరని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గురువారం విజయనగరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ పదవి పోయిన తరువాత పులివెందుల ఎమ్మెల్యే జగన్ ఏపీలో ఎన్ని రోజులు ఉన్నారో చెప్పాలన్నారు. జగన్ హయాంలో ప్రజా సమస్యలు పరిష్కరించకుండా గాలికొదిలేశారని మండిపడ్డారు. ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. టిడ్కో ఇళ్లు ప్రజలకు అందకుండా చేసిన ఘనత జగన్‌దేనని విమర్శించారు. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేసే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం తీసుకుందని అనిత చెప్పారు. ఆయుధాలు విడిచిపెట్టి మావోయిస్టులు లొంగిపోవాలని కోరుతున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని, ఆపదలో ఉన్నవారిని మాత్రం సకాలంలో ఆదుకుంటామని తెలిపారు. జగన్ నుంచి ఈ రాష్ట్రానికి విముక్తి కలిగిందని, 2024 తరువాత ఏపీకి మంచి రోజులొచ్చాయని అన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌టీజీఎస్‌తో పరిపాలన సులభతరం అయిందన్నారు. ఇటీవల చిన్నారులు చేపట్టిన మాక్ అసెంబ్లీ ఎంత అద్భుతంగా జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని, దీంతోనే తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్నామని అనిత తెలిపారు.



అందరివాడు రోశయ్య: వీహెచ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో సభ్యుల భాష మంచిగా అనిపించడం లేదని, కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు అన్నారు. ప్రతిపక్ష నేతలను దూషించకుండా, హుందాగా విమర్శను వ్యక్తం చేయడంలో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆదర్శనీయుడని, ఆయన అందరివాడు అని కొనియాడారు. రోశయ్యను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో రోశయ్య నాలుగో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌కు రోశయ్య స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాగా, రోశయ్య సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్మరించిందని చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ విమర్శించారు.

నకిలీ మద్యం కేసులో బెయిళ్లపై 18న తీర్పు

విజయవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 18న వెలువరిస్తామని న్యాయాధికారి జి.లెనిన్‌బాబు వెల్లడించారు.

డిప్యూటీ కలెక్టర్ విజయ సూర్యకళ సస్పెన్షన్

అమరావతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మల్లాది విజయ సూర్యకళను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన ఆమె ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్ కింద జైల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో సర్వీసు నిబంధనల ప్రకారం ఆమెను సస్పెండ్ చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫైబర్‌నెట్ కేసులో నా వాదనలు వినండి: గౌతం రెడ్డి

విజయవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ కార్పొరేషన్ కేసులో తీర్పు ఇచ్చే ముందు తన వాదనను వినాలని కోరుతూ ఆ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పి.గౌతంరెడ్డి విజయవాడలోని ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ వేశారు. 2014-19 మధ్య ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని, కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారని వైసీపీ ప్రభుత్వంలో కేసు నమోదైంది. ప్రతిపక్ష హోదాలో ఉండగా చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. నాడు సీఐడీకి ఫిర్యాదు చేసిన ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నట్టు కోర్టుకు తెలిపారు. ఈ కేసుపై ఏసీబీ కోర్టు శుక్రవారం తీర్పును వెలువరించాల్సిఉన్న నేపథ్యంలో గౌతంరెడ్డి పిటిషన్ వేశారు. ఇది శుక్రవారం బెంచ్ మీదకు రానుంది.

నల్లమలసాగర్‌పై వివరణ ఇవ్వండి: గోదావరి బోర్డు

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు బదులుగా పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం ప్రాజెక్టును తెరపైకి తెచ్చి దాని డీపీఆర్ తయారీకోసం ఇటీవల టెండర్లను ఏపీ నిర్వహించింది. దీనిపై తెలంగాణ ఫిర్యాదు చేయగా, వాస్తవ పరిస్థితులను వారంలోగా తెలియజేయాలంటూ గోదావరి నదీ యాజమాన్య బోర్డు ఏపీ జలవనరుల శాఖకు లేఖ రాసింది.

శ్రీలక్ష్మి క్వాష్ పిటిషన్‌లో తీర్పు రిజర్వ్

హైదరాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారంలోని పెన్నా సిమెంట్ కేసులో నిందితురాలిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో ఇరువర్గాల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు గురువారం ప్రకటించింది. పెన్నా సిమెంట్ వ్యవహారంలో సీబీఐ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది.

ఎవరి క్రెడిట్... ఎవరి చోరీ!?

- గూగుల్ డేటా సెంటర్‌పై జగన్ సిత్రాలు
- అది 'అదానీ'దే అంటూ వింత వాదనలు
- 2020 నవంబరులోనే ఒప్పందమట!
- అంతకు ఏడాదిన్నర ముందే శంకుస్థాపన చేసిన చంద్రబాబు

(విశాఖపట్నం/అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖలో గిగావాట్ సామర్థ్యంతో 'ఏఐ డేటా సెంటర్' ఏర్పాటు చేస్తున్నదెవరు? గూగుల్ సంస్థా? అదానీయా? ఈ ప్రశ్నకు ప్రపంచమంతా చెప్పే సమాధానం... 'గూగుల్' అనే! చివరికి... అదానీని అడిగినా 'అది గూగుల్ డేటా సెంటర్' అనే చెబుతారు. జగన్ మాత్రం 'అది అదానీదే' అంటూ వింతలకు పోతున్నారు. భాగస్వాముల మధ్య ఒప్పందాలు, సాంకేతిక అంశాల మేరకు విడుదలైన ఉత్తర్వులను చూపిస్తూ, అసలు వాస్తవాలను దాచేస్తూ అదానీనే ఆశ్చర్యపరిచే స్థాయిలో జగన్ రోత పత్రిక గురువారం కథనాన్ని ప్రచురించింది. డేటా సెంటర్ క్రెడిట్ అదానీకి ఇవ్వలేదనే బాధ ఒకవైపు.. తనకు క్రెడిట్ వస్తుందనే ఏకైక కారణంతో చంద్రబాబు 'అదానీ' పేరు తొక్కేస్తున్నారని మరో వైపు! ఆ డేటా సెంటర్ తమదే అయినప్పుడు 'అదానీ' ఎందుకు మౌనంగా ఉంటారు? గూగుల్‌కు క్రెడిట్ ఎందుకు ఇస్తారు? జగన్ పత్రికలో దీనికి జవాబు దొరకదు.

ఇదీ అసలు విషయం...

అమెరికా వెలుపల తొలిసారి భారత్‌లో, అదీ విశాఖలో అత్యంత భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం... అని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ స్వయంగా ప్రకటించగా... ఆ సంస్థ ప్రతినిధులు ఢిల్లీలో కేంద్ర మంత్రుల సమక్షంలోనే అక్టోబరు 14వ తేదీన కుదుర్చుకున్న ఈ ఒప్పందం గురించి అందరికీ తెలుసు! ఇది గూగుల్ అనుబంధ సంస్థ 'రైడెన్' ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్. అతి భారీ ప్రాజెక్టులను అమలు చేసేటప్పుడు... స్థానిక, ఇతర భాగస్వాములను చేర్చుకోవడం సహజం. అలాగే గూగుల్ సంస్థ... భారతీ ఎయిర్‌టెల్, నెక్స్‌ట్రా డేటా, అదానీ ఇన్‌ఫ్రా, అదానీ కనెక్స్, అదానీ పవర్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంది. అండర్ సీ కేబుల్ ఏర్పాటు, నిర్మాణ పనులు, విద్యుత్ సరఫరా వంటి పనులు చేస్తాయి. భారత్‌లో తమ తరఫున డేటా సెంటర్ నిర్మాణ పనులు చేస్తున్నందున భూమిని అదానీ పేరుతో కేటాయించాలని గూగుల్ స్వయంగా కోరింది. దీంతో... ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానిని పట్టుకుని... 'ఇదిగో... ఇది అదానీదే' అని జగన్ పత్రిక వింత వాదనలు చేసింది.

'అదానీ'ని తెచ్చిందెవరు?

'ఇది అదానీ డేటా సెంటర్. దానికి బీజాలు వేసింది నేనే. ఆ క్రెడిట్‌ను చంద్రబాబు కొట్టేస్తున్నారు' అని జగన్ పదేపదే చెబుతున్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడే అదానీని ఒప్పించి రాష్ట్రానికి తీసుకొచ్చానని.. విశాఖలో 2023 మే 3న స్వయంగా డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశానని చెప్పుకొచ్చారు. కాసేపు... గూగుల్‌ను పక్కనపెట్టేసి, 'అదానీ' సంగతి మాత్రమే చూద్దాం! 2023లో జగన్ శంకుస్థాపన చేయడానికి నాలుగేళ్ల ముందే.. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు హయాంలో డేటాసెంటర్‌పై ఒప్పందం కుదిరింది. అప్పుడు లోకేశ్ ఐటీ మంత్రిగా, ప్రస్తుత సీఎస్ విజయానంద్ ఐటీ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. వారి సమక్షంలోనే అదానీ గ్రూపుతో 2019 జనవరి 9న అమరావతిలోని 'ప్రజావేదిక' (దీనిని జగన్ కూల్చివేయించారు)లో ఎంవోయూ కుదిరింది. మరుసటి నెల 14న విశాఖలోని కాపులుప్పాడలో కేటాయించిన భూమిలో చంద్రబాబు అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆనాటి ఒప్పందం ప్రకారం అదానీకి 500 ఎకరాలు ఇవ్వడానికి ప్రభుత్వం సంసిద్ధత తెలిపింది. అందులో రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెడతామని ఆ సంస్థ ప్రకటించింది. గిగావాట్ సామర్థ్యంతో హైపర్ స్కేల్ డేటా సెంటర్, 5 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ పార్క్ నిర్మిస్తామని తెలిపింది. . ఇది అదానీతో జరిగిన మొదటి ఒప్పందం. అంటే... అదానీ డేటా సెంటర్‌కు తొలుత బీజం పడింది 2019లో, చంద్రబాబు హయాంలోనే.



కాపులుప్పాడ కొండపై 2019 ఫిబ్రవరి 14వ తేదీన అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన నాటి మంత్రులు లోకేశ్, గంటా శ్రీనివాసరావు, తదితరులు (ఫైల్). 'ఈ డేటా సెంటర్ నేను నాటిన మొక్క... 2020 నవంబరులోనే శంకుస్థాపన చేశాం' అంటున్న జగన్ దీనికి ఏం సమాధానం చెబుతారో!?

జగన్ సీఎం అయ్యాక మారిన సీన్..

జగన్ 2019 ఎన్నికల్లో గెలిచి సీఎం అయ్యాక అదానీ డేటా సెంటర్‌కు మోకాలడ్డారు. కాపులుప్పాడలో కేటాయించిన భూములను వెనక్కి తీసుకున్నారు. 20 ఏళ్ల దీర్ఘకాలిక ప్రణాళిక అంటే కుదరదని, ఐదేళ్లలో ఏమి చేస్తారో చెబితే కొత్త ఒప్పందం చేసుకుందామని ప్రతిపాదించారు. దాంతో అదానీ తన పెట్టుబడిని రూ.70 వేల కోట్ల నుంచి రూ.22 వేల కోట్లకు కుదించింది. తర్వాత 14 వేల కోట్లకే పరిమితం చేసింది. ఉద్యోగ అవకాశాల సంఖ్యను 1.1 లక్షల నుంచి 25 వేలకు కుదించింది. ఏడేళ్లలో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు (200+100) రెండు ఏర్పాటు చేస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్టుకు జగన్ ప్రభుత్వం 190 ఎకరాలు ఇచ్చింది. సంబంధిత స్థలాల బదలాయింపులన్నీ పూర్తయ్యాక.. 2023 మే 3న విశాఖలో జగన్ తీరిగ్గా అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

గూగుల్-అదానీకి లింకేంటి?

గూగుల్ డేటా సెంటర్‌కు, అదానీ డేటా సెంటర్‌కు సంబంధమే లేదని రాష్ట్రప్రభుత్వ లావాదేవీలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో జగన్ శంకుస్థాపన చేసే నాటికే అదానీ డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్కుకు అప్పగించేశారు. ఆ కథ అప్పుడే ముగిసిపోయింది. అదానీకి జగన్ హయాంలో కేటాయించిన స్థలాలు వేరు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కేటాయించిన స్థలాలు వేరు. విశాఖలో డేటా సెంటర్ నిర్మించబోతున్న రైడెన్ ఇన్ఫోటెక్ తమ అనుబంధ సంస్థేనని పేర్కొంటూ గూగుల్ అధికారికంగా సమాచారం ఇచ్చింది. అయితే... అదానీ, రైడెన్ మధ్య ఇదివరకే వ్యాపార లావాదేవీలు జరిగాయి. నోయిడాలో అదానీ డేటా సెంటర్‌లో 4.64 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ విషయాన్ని కూడా జగన్ పత్రిక ప్రచురిస్తూ... 'అదానీ, గూగుల్ ఒక్కటే అన్నట్లుగా కలరింగ్ ఇచ్చింది. నిజానికి... భారత్‌లో గూగుల్ సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న తొలి మొదటి డేటా విశాఖదే! అదానీతో తమకు భాగస్వామ్యం ఉందని ఎంవోయూ సమయంలోనే వెల్లడించింది. అండర్ సీ కేబుల్ ల్యాండింగ్ విషయంలో అదానీ తమకు సహకరిస్తుందని తెలిపింది.

దీనికోసం. 'అదానీ కనెక్స్'తో ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే పునరుత్పాదక విద్యుత్ సరఫరా కోసం అదానీ పవర్‌తో, భవన నిర్మాణ పనులకోసం అదానీ ఇన్‌ఫ్రాతో గూగుల్ ఒప్పందాలు కుదుర్చుకుంది. అందులో భాగంగానే... స్థలాల కేటాయింపు విషయంలో తమ తరఫున ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు అధీకృత వ్యక్తిగా అదానీకి చెందిన సంజయ్ వ్యవహరిస్తారని గూగుల్ (రైడెన్) లేఖ రాసింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంత మాత్రాన... అది 'అదానీ డేటా' సెంటర్ అయిపోదు. 'గూగుల్‌తో భాగస్వామి అవుతున్నందుకు సంతోషంగా ఉంది' అని అదానీ చెప్పినప్పటికీ... చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే అదానీ పేరెత్తలేదని జగన్ పత్రిక విచిత్ర వాదన చేసింది.

కొసమెరుపు: 'ఆ డేటా సెంటర్ జగన్ నాటిన మొక్క'.... 2020 నవంబరులోనే అదానీతో ఒప్పందం కుదిరిందని జగన్ పత్రిక పేర్కొంది. మరి... అంతకంటే ఏడాదిన్నర ముందే 2019 ఫిబ్రవరి 14న అదానీ డేటా సెంటర్‌కు చంద్రబాబు చేసిన శంకుస్థాపన సంగతేమిటి? ఇది ఎవరు నాటిన మొక్క?

సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో తప్పేముంది?

- ఆలయాల్లో అక్రమాలు జరిగినప్పుడు సుమోటోగా జోక్యం చేసుకోవచ్చు: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నప్పుడు, మైనర్ల హక్కులకు భంగం కలిగినప్పుడు సుమోటోగా జోక్యం చేసుకుని.. తగిన ఆదేశాలు జారీ చేసే అధికారం న్యాయస్థానాలకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఆలయాల ప్రయోజనాలను కాపాడే విషయంలో మొదటి సంరక్షకులు కోర్టులేనని పేర్కొంది. తిరుమల పరకామణిలో చోరీకి సంబంధించి నమోదైన కేసును లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకోవడం చిన్న విషయం కాదని, నిందితుడు రవికుమార్‌తో అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ లోక్ అదాలత్ వద్ద కేసు రాజీ చేసుకునే అధికారం లేదని సింగిల్ జడ్జి ప్రాథమికంగా మాత్రమే అభిప్రాయపడ్డారని.. లోక్‌అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని అంతిమంగా డివిజన్ బెంచ్‌కే అప్పగించారని గుర్తు చేసింది. ఆ ఉత్తర్వుల్లో తప్పేముందని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించింది. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ ఇచ్చిన అవార్డుకు చట్టబద్ధత ఉందా లేదా అనే అంశంపై వాదనలు వినిపించాలని ఆయనకు సూచించింది. అప్పీల్‌పై తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన సీజే ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతిని ప్రస్తుత వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకోవాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామని.. దీనిని అనుమతించాలని కోర్టును సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. తదుపరి విచారణలో పరిశీలిస్తామని పేర్కొంది. విచారణను 11కి వాయిదా వేసింది. రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు.

డేటా సెంటర్‌కు 480 ఎకరాలు

- విశాఖ జిల్లా తర్లువాడ, అడవివరం, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో కేటాయింపు

విశాఖపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనున్న వేయి మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌కు 480 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్న అదానీ ఇన్‌ఫ్రా పేరున భూములు ఇవ్వాలని గూగుల్ విజ్ఞప్తి చేయడంతో ఆ మేరకు కేటాయింపులు చేసింది. గూగుల్‌కు విశాఖపట్నం జిల్లా తర్లువాడ, అడవివరం, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో మొత్తం 480 ఎకరాలు ఇవ్వడానికి అంగీకరించింది. వీటిని సర్వే చేసి, బదలాయించాలని ఏపీఐఐసీని రైడెన్ ఇన్ఫోటెక్ కోరగా నవంబరు 28న మంత్రివర్గం సమావేశం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిసెంబరు 2న ప్రభుత్వం భూములను అదానీ ఇన్‌ఫ్రా పేరిట బదలాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖలో గూగుల్ దశల వారీగా వేయి మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటుచేస్తుంది. పెట్టుబడిని రూ. 1.35 లక్షల కోట్లకు పెంచడానికి అంగీకరించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

సాయుధ పోరాటం విఫలం

- దేశంలో ప్రస్తుత పరిస్థితులు పోరాటానికి అనుకూలంగా లేవు
- నన్ను ఉద్యమ ద్రోహి అంటున్నవారికి వాస్తవ పరిస్థితి తెలియదు
- ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ మావోయిస్టు మల్లోజుల వేణుగోపాల్



హైదరాబాద్, డిసెంబరు 4: మనదేశంలో సాయుధ పోరాట విప్లవ పంథా విఫలమైందని మావోయిస్టు పార్టీ మాజీ నేత మల్లోజుల వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. పార్టీ చేసిన తప్పిదాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని తెలిపారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితులు సాయుధ పోరాటానికి అనుకూలంగా లేవని చెప్పారు. మావోయిస్టులంతా ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన ఈమెయిల్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు.

మీరు దాదాపు 50 ఏళ్లపాటు అడవుల్లోనే జీవించారు. ఆ జీవితం ఎలా ఉండేది?

అడవిలో నా ఉద్యమ కాలం నాకు స్వర్ణయుగం లాంటిది. ఆదివాసీలను దాదాపు 50 ఏళ్ల క్రితం కలిశాను. ఆ తర్వాత వారితో నా జీవితం పెనవేసుకుపోయింది.

మీరు లొంగిపోవటానికి కారణం ఏమిటి?

నేను లొంగిపోవాలని అనుకోలేదు. కానీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతం, ఆచరణలో మార్పు తీసుకురావటంలో మేం విఫలమయ్యాం. మా పార్టీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావు (బసవరాజు) సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భావించారు. దానిని అమలుచేసే ప్రయత్నంలో ఉండగానే ఎన్‌కౌంటర్‌లో మరణించారు. నంబాలతో సిద్ధాంతపరంగా ఏకీభవించిన మేము లొంగిపోవాలని నిర్ణయించుకున్నాం.

మీ సోదరుడు కిషన్‌జీ 2011లో ఎన్‌కౌంటర్‌లో మరణించినప్పుడు కూడా మీరు లొంగిపోలేదు. అప్పుడు మీరెలా ఆలోచించారు?

నా సోదరుడు మరణించినప్పుడు మాలో ఎవరూ లొంగిపోవాలని అనుకోలేదు. అయితే, అప్పటి నుంచే పార్టీ చేసిన పొరపాట్లను నేను అర్థం చేసుకున్నాను. సెంట్రల్ కమిటీ (సీసీ), పొలిట్ బ్యూరో సభ్యుడిగా వాటిని సరిదిద్దాలని భావించి, నా అభిప్రాయాలను సీసీ ముందు పెడితే ఏకగ్రీవంగా తిరస్కరించారు. తర్వాత కొంత కాలానికి సీసీ నా వాదనను ఆమోదించింది. కానీ, అప్పటికే పరిస్థితులు పూర్తిగా దిగజారాయి.

మిమ్మల్ని కొందరు ద్రోహి అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మీ వ్యక్తిగత భద్రత గురించి భయపడుతున్నారా?

పార్టీ గురించి తప్ప నా జీవితం గురించి నాకు ఎలాంటి భయం లేదు. నన్ను ద్రోహి అని నిందిస్తున్నవారు.. పొలిట్‌బ్యూరో సర్క్యులర్‌తో పాటు నేను విడుదల చేసిన 22 పేజీల డాక్యుమెంటును చదివితే సంతోషిస్తాను. ఉద్యమానికి గతంలోకంటే ఇప్పుడే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కొందరు అనుకుంటున్నారు. అలాంటి వాళ్లు తమ పెన్నుల శక్తిని పేపర్‌పై, మైక్రోఫోన్ల ముందే ప్రదర్శిస్తున్నారు.

మీ అభిప్రాయం ప్రకారం మావోయిస్టు పార్టీ ప్రజల ఆదరణ కోల్పోవటానికి కారణం?

చాలాకాలంగా చేస్తూ వచ్చిన తప్పుల వల్ల పార్టీ తన మూల సిద్ధాంతం నుంచి పక్కకు వెళ్లిపోయింది. విప్లవ పార్టీ లేకపోతే విప్లవమే లేదని లెనిన్ చెప్పారు. భారత్‌లో అదే జరిగింది. భారత ప్రభుత్వాన్ని మేము తక్కువగా అంచనా వేశాం. ప్రజలను ఏకం చేసేందుకు ఉన్న చట్టబద్ధ అవకాశాలను తిరస్కరించాం.

మాద్వి హిడ్మాతో మీకున్న అనుబంధం?

హిడ్మాతో నాకు 20 ఏళ్ల నుంచి సాన్నిహిత్యం ఉంది. అతడు అద్భుతమైన గెరిల్లా పోరాట నాయకుడు.

మీరు బ్రాహ్మణులు కదా? పార్టీలో కుల ప్రభావం ఎలా ఉండేది?

బ్రాహ్మణుడిగా నేను అవకాశం ఉంటే రోజూ స్నానం చేసేవాడిని. దీనిని నా సహచరులు కొందరు 'బ్రాహ్మణ అలవాటు' అని హేళన చేసేవారు. మనదేశంలో కులం కంటే ప్రమాదకరమైన ఆయుధం లేదు.

వచ్చే పదేళ్లలో ఏం చేయాలనుకుంటున్నారు?

దానిని కాలమే నిర్ణయిస్తుంది. లెనిన్ సిద్ధాంతానికి విరుద్ధంగా మావోయిస్టు పార్టీ ఎన్నికలను బహిష్కరించాలనే విధాన నిర్ణయం తీసుకుంది. సాంకేతికంగా చూస్తే ఎవరైనా తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ఎన్నికలను సాధనంగా వాడుకోవచ్చు.

మొదటికొచ్చిన మావోయిస్టుల కస్టడీ

విజయవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు, విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అరెస్టు అయిన మావోయిస్టుల కస్టడీ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. న్యాయపరిధి విషయంలో గందరగోళమే దీనికి కారణమని తెలుస్తోంది. పెనమలూరు పోలీసులు ముగ్గురిని, పటమట పోలీసులు నలుగురు మావోయిస్టులను కస్టడీకి ఇవ్వాలంటూ సంబంధిత కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, తమకు ఆ అధికారం లేదని, జిల్లా కోర్టును ఆశ్రయించాలని సూచించాయి. దీంతో జిల్లా కోర్టులో పిటిషన్లను దాఖలు చేశారు. జిల్లా కోర్టు వాటిని తిరస్కరిస్తూ, సంబంధిత కోర్టుల్లోనే పిటిషన్లు దాఖలుచేయాలని సూచించింది. దీంతో విజయవాడ నాలుగు, ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్‌మేజిస్ట్రేట్ కోర్టుల్లో పిటిషన్లు వేశారు.

మావోయిస్టు మృతులు 18 మంది..: ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం నిర్వహించిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సంఖ్య 18కి పెరిగింది. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు, పన్నెండు మంది మావోయిస్టులు మృతి చెందినట్టు తొలుత పోలీసులు భావించారు.

మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లు బూటకం

- హిడ్మా, శంకర్ హత్యలకు ఆ నలుగురే కారణం : మావోయిస్టులు

మంథని, చర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి, రంపచోడవరంలో జరిగిన ఎన్‌కౌంటర్లు బూటకమని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు గత నెల 27వ తేదీన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట లేఖ విడుదల కాగా గురువారం అది వెలుగులోకి వచ్చింది. మావోయిస్టు హిడ్మా ఆయనతో ఉన్న మరో ఐదుగురిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు నవంబరు 15న అరెస్టు చేశారని, మూడు రోజులపాటు చిత్రహింసలు పెట్టి 18న హత్య చేశారని ఆరోపించారు. హిడ్మా అక్టోబరు 27న విజయవాడకు చెందిన ఓ కలప వ్యాపారి ద్వారా వైద్యం కోసం విజయవాడకు వెళ్లాడని, ఆ తర్వాత మరికొందరు వెళ్లారన్నారు. నిరాయుధులుగా ఉన్న హిడ్మాతో సహా ఆరుగురిని పట్టుకొని హత్య చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు పోలీసులు కట్టు కథ ప్రచారం చేశారని ఆరోపించారు. అలాగే నవంబరు 19న రంపచోడవరం మండలంలో మరో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారని, నిరాయుధులైన ఏవోబీ-ఎస్‌జెడ్‌సీ నేత శంకర్‌తోపాటు మరో ఆరుగురిని అరెస్టు చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారన్నారు. గత నెల 9న పార్టీ నుంచి కోసాల్ అనే సభ్యుడు పారిపోయి తెలంగాణ పోలీసులకు లొంగిపోయాడని, అతనికి హిడ్మా బయట ఉన్న విషయం తెలుసని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్లకు విజయవాడకు చెందిన కలప-ఫర్నిచర్ వ్యాపారి, బిల్డర్-సివిల్ కాంట్రాక్టర్, అల్లూరి జిల్లాలో ఐటీడీఏ పనులు చేసే కాంట్రాక్టర్, కోసాల్ కారణమన్నారు. అరెస్టు అయిన వారిలో తమ అగ్రనేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి లేరని స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.